గురువారం
1•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 37
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD







## కాఫీ డే సిద్ధార్థ మృతి

- నేత్రావతి నదిలో మృతదేహం లభ్యం
- ఆత్మహత్యగానే భావిస్తున్న పోలీసులు
- మృతదేహం అన్వేషణలో హైదరాబాదీ టెక్నాలజీ సాయం
- కోమాలో సిద్ధార్థ తండ్రి

11



- పారిశ్రామికవేత్తలపై ప్రభుత్వ సంస్థల నుంచి వేధింపులు
- విపక్షాల ధ్వజం
- ఆయన ఓ జెంటిల్‌మన్: టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

5

## జాతీయ జలవిధానం తేవాలి



- పలు సందర్భాల్లో దీని ప్రాధాన్యాన్ని సీఎం కేసీఆర్ చెప్పారు
- కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత బిల్లు అన్నిరకాల నీటి సమస్యలను పరిష్కరించదు
- కాళేశ్వరంతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నాం
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు

8

5

## జల వివాదాలకు రెండేండ్లలో పరిష్కారం!

నూతన 'అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల బిల్లు'కు లోక్‌సభ ఆమోదం
సభలో ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్
జలవివాదాల పరిష్కారంలో ప్రస్తుత ట్రిబ్యునళ్లు విఫలమయ్యాయని వ్యాఖ్య
బిల్లు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించిన ప్రతిపక్షాలు

# బిల్లు కట్టకుంటే వేటు

**కరంటు బిల్లులపై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లకు సీఎం కేసీఆర్ హెచ్చరిక**

- ప్రభుత్వ, స్థానికసంస్థలు, శాఖలనుంచి కరంటు బిల్లుల వసూళ్లకు కఠిన విధానం
- ప్రభుత్వశాఖల బడ్జెట్‌నుంచి ఆర్థికశాఖే చెల్లిస్తుంది
- పాత బకాయిలకు వన్‌టైమ్ సెటిల్మెంట్
- విద్యుత్ పనులపై 60 రోజుల కార్యాచరణ
- సమస్యల పరిష్కారానికి 'పవర్ వీక్'
- ఎత్తిపోతల పథకాలకు సౌర విద్యుత్
- వెయ్యి మెగావాట్లకు టెండర్లు పిలువాలి
- విద్యుత్‌సంస్థలకు అండగా ఉంటాం
- సంక్షోభంలో చిక్కుకోకుండా ఆదుకుంటాం
- విద్యుత్‌శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్



"**గ్రామపంచాయతీలు**, మున్సిపాలిటీలు పెద్దమొత్తంలో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడం దారుణం. వాడిన కరంటుకు తప్పక బిల్లు చెల్లించాలి. ఇప్పటినుంచి ప్రతినెలా గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, హెచ్‌ఎండబ్ల్యూఎస్ తప్పక విద్యుత్ బిల్లులు చెల్లించాలి.
–సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ విద్యుత్ సంస్థలకు అవసరమైన ఆర్థికప్రేరణ అందించడంతోపాటు, అన్నివిధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విభాగాల్లో అద్భుత పనితీరు ప్రదర్శించి, దేశానికే అదర్శంగా నిలిచిన విద్యుత్‌సంస్థలు ఆర్థికసంక్షోభంలో చిక్కుకోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యుత్‌సంస్థల పనితీరుపైనే రాష్ట్ర అభివృద్ధి ఆధారపడి ఉన్నందున వాటిని కాపాడుకుని తీరుతామన్నారు. 'కనురెప్పపాటుకూడా కరంటు పోవద్దు.. విద్యుత్ సంస్థలు ఆర్థిక ఇబ్బందులు పడొద్దు' అనే విధానం తమదని సీఎం తెలిపారు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్థానికసంస్థలు ఇకపై ప్రతినెలా విద్యుత్ బిల్లులు చెల్లించేలా కఠినమైన విధానం అవలంబిస్తామని వెల్లడించారు. విద్యుత్ సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి గ్రామాలు, పట్టణాల్లో త్వరలోనే 'పవర్ వీక్' నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు. విద్యుత్‌శాఖపై ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం ప్రగతిభవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ పురోభివృద్ధిలో విద్యుత్‌సంస్థల పాత్ర చాలా కీలకమైనది. తెలంగాణ ఏర్పడినప్పుడు తీవ్ర విద్యుత్ సంక్షోభం నెలకొని ఉన్నది. నేడు తెలంగాణ రాష్ట్రం విద్యుత్‌రంగంలో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఇందులో విద్యుత్ అధికారులు, ఉద్యోగుల శ్రమ, చిత్తశుద్ధి ఉన్నది. నేడు తెలంగాణలో అన్నిరంగాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతున్నది. దేశంలో

మిగతా 2వ పేజీలో



బుధవారం జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీశైలం వైపు పరుగులు తీస్తున్న కృష్ణా జలాలు

• ఉప్పొంగుతూ తరలివస్తున్న కృష్ణమ్మ

# నేడు మల్లన్న చెంతకు

తెల్లవారేసరికి శ్రీశైలం జలాశయానికి!

ఎగువన కొనసాగుతున్న భారీ వరద

- జూరాలకు 2.05 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టులో 24 గేట్లు ఎత్తిన అధికారులు
- దిగువకు 2.21 లక్షల క్యూసెక్కుల విడుదల
- నిండుకుండల్లా మహారాష్ట్ర ప్రాజెక్టులు
- వారంపాటు దిగువకు కొనసాగనున్న వరద

**హైదరాబాద్/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/ నెట్‌వర్క్:**

తెలంగాణలో గోదావరి, కృష్ణాబేసిన్లలో నీటి ప్రవాహాలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. జూరాల నుంచి విడుదలవుతున్న కృష్ణాజలాలు.. గురువారం ఉదయానికి శ్రీశైలం జలాశయానికి చేరుకోనుండగా, ఇటు గోదావరిలో కాళేశ్వరం వద్ద మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ప్రాణహిత జలాలు పెద్దఎత్తున వచ్చి కలుస్తున్నాయి. మరోవైపు ఇంద్రావతి నుంచి నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి కలుస్తుండటంతో పేరూరు వద్ద గోదావరి ఏడు లక్షల క్యూసెక్కులతో ఉగ్రరూపందాల్చింది. కృష్ణా, గోదావరి బేసిన్లలోని వివిధ భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు లక్షలు, వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలు వస్తుండటంతో ప్రాజెక్టులన్నీ జలకళను సంతరించుకున్నాయి. ఇదిలాఉంటే.. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకటో లింక్ విజయవంతమైంది. మేడిగడ్డ బరాజ్‌నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా ఎదురు ప్రయాణం ప్రారంభించిన ప్రాణహిత జలాలు.. అన్నారం, సుందిల్ల బరాజ్‌లను

మిగతా 3వ పేజీలో

### ఉగ్ర గోదావరి

- పేరూరు వద్ద ఏడు లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- శ్రీపాద ఎల్లంపల్లికి భారీగా వరదనీరు
- కడెంకు కొనసాగుతున్న ప్రవాహం
- కుమ్రంభీం ప్రాజెక్టు 3 గేట్లు ఎత్తివేత

### కాళేశ్వరం లింక్-1 సక్సెస్

- సుందిల్ల పంప్‌హౌస్‌లో విజయవంతంగా ఒకటో మోటర్ ద్వారా ఎత్తిపోతలు
- ఎల్లంపల్లి జలాశయంలోకి దుంకిన జలాలు
- కాళేశ్వరం ప్రాజెక్టులో అద్భుతం ఆవిష్కారం



బుధవారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోలివాడలోని సుందిల్ల పంప్ హౌస్‌లో ఒకటో నంబర్ మోటర్ వెట్‌రన్ విజయవంతమైన దృశ్యం



## కొత్త అసెంబ్లీ కట్టుకుంటే తప్పేమిటి?

**పాలనలో తమ మార్కు చూపాలనుకుంటే అభ్యంతరం ఎందుకు?**

**పాత రాష్ట్రాల్లోనే కొత్త అసెంబ్లీలు కట్టారు కదా!**

**ఎర్రమంజిల్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ.. అసెంబ్లీ భవనాన్ని నిర్మించుకొంటే తప్పేమిటి? అని హైకోర్టు ప్రశ్నించింది. ఎర్రమంజిల్ ప్రాంతంలో అసెంబ్లీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం ధర్మాసనం విచారణ జరిపింది. పాత రాష్ట్రాలే కొత్తగా అసెంబ్లీ భవనాలు కట్టుకొంటున్నప్పుడు.. కొత్త రాష్ట్రంలో అభ్యంతరాలు ఎందుకు? అని చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ షమీమ్‌అక్తర్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రశ్నించింది. 'దశాబ్దాల కిందట నిర్మించిన భవనాలు ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా లేవని ప్రభుత్వం చెప్తున్నది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కొత్త భవనాలు అవసరమని పేర్కొంటున్నది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో అసెంబ్లీ భవనం నిర్మిస్తే తప్పేమిటి? పాలనలో ప్రభుత్వం తన మార్కును చూపించాలనుకోవడంలో ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. పాత రాష్ట్రాల్లో కొత్త అసెంబ్లీ భవనాలు కట్టుకున్నారు. ఢిల్లీ, చండీగఢ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త భవనాలు

మిగతా 8వ పేజీలో

# టీఆర్‌ఎస్ సభ్యులు 50 లక్షలు



బుధవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ కార్యకర్తల బీమా ప్రీమియంకు సంబంధించిన రూ.11.21 కోట్ల చెక్కును యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు అందజేస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో మంత్రులు తలసాని, మల్లారెడ్డి, ఎమ్మెల్యే జోగురామన్న, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి కూడా ఉన్నారు.

- రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారు
- ప్రతిపక్షాలకు మాట్లాడేందుకు అంశాలు లేవు
- అందుకే అర్థంలేని ఆరోపణలు
- టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు

**నెలరోజుల్లోనే ఇంతటి నమోదు దేశంలోనే రికార్డు**

**క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**కార్యకర్తలందరికీ రూ.2 లక్షల ప్రమాద బీమా**

**ఇన్సూరెన్స్ కంపెనీకి రూ.11.21 కోట్ల చెల్లింపు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశంలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు.. ఉత్తమ నిర్మాణం కలిగిన సంస్థగా టీఆర్‌ఎస్‌ను తీర్చిదిద్దాలన్నది పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు లక్ష్యమని, అందుకు అనుగుణంగానే తాము పనిచేస్తున్నామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా.. పోటీ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెల రోజుల్లోనే 50 లక్షల సభ్యత్వ నమోదు చేయడం దేశంలోనే రికార్డని కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో బుధవారం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి.. పార్టీ కార్యకర్తల ప్రమాద బీమా ప్రీమియంకు సంబంధించిన రూ.11.21 కోట్ల చెక్కును కేటీఆర్ అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, సభ్యత్వ

మిగతా 2వ పేజీలో

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 317.00 | రంగారెడ్డి | 317.00 |
| మెదక్ | 317.00 | కరీంనగర్ | 320.00 |
| వరంగల్ | 320.00 | చిల్లర ధర | 3.75 |

## గిరిజనుల భూమిని కాజేశారు

ధర్మగంట

- రికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ చేతివాటం
- కాసులకు కక్కుర్తిపడి ఇతరులకు పట్టా
- నల్లగొండ జిల్లా పెద్దవూర మండల రెవెన్యూ అధికారుల లీలలు
- న్యాయం కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న గిరిజనులు

9



గిరిజన రైతు రమావత్ గ్యామా, భార్య హాసిలి

**వాళ్లంతా** గిరిజనులు. ఎప్పుడో మూడు దశాబ్దాల క్రితం ప్రభుత్వం వారికి ఇచ్చిన భూమిని సాగుచేసుకొంటూ.. పండిన పంటపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రెండేండ్ల క్రితం వరకు చీకూచింతా లేకుండానే సాగింది. ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సమయంలో అధికారుల చేతివాటం వారిని ఒక్కసారిగా సమస్యల సుడిగుండంలోకి నెట్టింది. కొందరు రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడి, దొంగ సాదాబైనామాలను సృష్టించి గిరిజనుల భూములను ఇతరుల పేరిట పట్టాచేశారు. సదరు పట్టాను రద్దుచేసి గిరిజనులకు న్యాయం చేయాలన్న ఆర్డీవో ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి. ఏ ఒక్క అధికారి కూడా వారి గోడును పట్టించుకోవడంలేదు. దీంతో తమకు న్యాయం చేయాల్సిందిగా నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం కుంకుడుచెట్టు తండాకు చెందిన గిరిజన రైతులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

# హైవేల అభివృద్ధికి నిధులివ్వండి

కేంద్రమంత్రి గడ్కరీకి మంత్రి జగదీశ్‌రెడ్డి విజ్ఞప్తి



బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, రంజిత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి వెంటనే నిధులు మంజూరుచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తిచేశారు. ఆయన బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిశారు. నేషనల్ హైవే 65 హైదరాబాద్ –విజయవాడ రహదారిపై సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్ బ్రిడ్జీలను నిర్మించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరినట్టు ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఎన్‌హెచ్ –365 సూర్యాపేట –జనగామ రహదారిపై నాగారం, తిరుమలగిరి గ్రామాల మధ్య డ్రైన్లు, ఫ్లైఓవర్లు ఏర్పాటుచేయాలని విన్నవించినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అనేక పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్న ఆయన.. రహదారుల అభివృద్ధికి కేంద్రం నిధులు మంజూరుచేయాలని కోరినట్టు చెప్పారు. గడ్కరీని కలిసినవారిలో ఎంపీలు బడుగుల లింగయ్యయాదవ్, డాక్టర్ రంజిత్‌రెడ్డి ఉన్నారు.

## వైద్యశాఖ పోస్టుల భర్తీ విధివిధానాల్లో మార్పు

టీఎస్‌ఎంహెచ్‌ఎస్‌ఆర్బీ ద్వారా నియామకాలు
ఆర్థికశాఖ ఉత్తర్వులు

2



## సబ్సిడీరహిత సిలిండర్ ధర 62.50 తగ్గింపు

అర్ధరాత్రి నుంచే అమల్లోకి

5

# గవర్నర్‌తో కేటీఆర్ భేటీ

- మర్యాదపూర్వకంగానే కలిశా: కేటీఆర్





**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు బుధవారం రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌తో రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈ భేటీ మర్యాదపూర్వకంగానే జరిగిందని కేటీఆర్ తెలిపారు. గవర్నర్ తనకు తండ్రి లాంటివారని, ఆయన్ను తాను తరుచుగా కలుస్తుంటానన్నారు. ఈ మధ్యన కలవక చాలా రోజులు కావడంతో ఆయనతో భేటీ అయినట్లుగా వివరించారు. ఈ భేటికి ఎలాంటి ప్రాధాన్యం లేదని కేటీఆర్ స్పష్టంచేశారు.

# వైద్యశాఖ పోస్టుల భర్తీ విధివిధానాల్లో మార్పు

- టీఎస్ఎంహెచ్ఎస్ఆర్బీ ద్వారా నియామకాలు
- ఆర్థికశాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ పరిధిలోని వివిధ క్యాటగిరీల్లో 1,466 పోస్టుల భర్తీ విధివిధానాల్లో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఇప్పటికే ఆయా పోస్టుల భర్తీకి అనుమతిచ్చిన ఆర్థికశాఖ.. జిల్లాలవారీగా భర్తీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. కానీ, తాజాగా ప్రత్యేక రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాలు జరుపాలని సూచిస్తూ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ స్టేట్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎంహెచ్ఎస్ఆర్బీ) ద్వారా 1,466 పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టేలా కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ విధివిధానాలను ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు.

# 19 నుంచి బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా జలాల అంశంలో బ్రిజేశ్ ట్రిబ్యునల్ విచారణ ఆగస్టు 19 నుంచి నిర్వహించనున్నారు. ఆగస్టు 19 నుంచి 21 వరకు నిర్వహించే విచారణకు హాజరుకావాలని తెలంగాణ తరఫు సాక్షి ఘన్‌శ్యాంఝాకు సూచించారు.



హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న అనూష




కేటీఆర్‌కు ట్విట్టర్‌లో చేసిన పోస్ట్

# అనూషకు కేటీఆర్ అభయం

- పెద్దపల్లి జిల్లా బాలిక వైద్య సేవలకు భరోసా

**సుల్తానాబాద్‌రూరల్:** 'సార్ ఆపదలో ఉన్నాం. ఆదుకోండి' అంటూ బాధితులు చేసిన ఒక్క ట్వీట్‌కు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు స్పందించారు. అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న బాలికకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటానని అభయమిచ్చారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం ఐతరాజ్‌పల్లికి చెందిన తడిగొప్పుల సంపత్ ఇటీవల అంతుచిక్కని వ్యాధితో మృతిచెందగా, అతని కుమార్తె అనూష కూడా కొద్దిరోజులుగా అదే వ్యాధితో బాధపడుతున్నది. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకోలేకపోయింది. ఐతరాజ్‌పల్లికి చెందిన యువకులు ఇటీవల అనూష ఆరోగ్య పరిస్థితి గురించి కేటీఆర్‌కు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అదేసమయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ధీకొండ భూమేశ్ సైతం విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన వెంటనే స్పందించారు. అనూషను హైదరాబాద్‌కు దవాఖానకు తీసుకురావాలని సూచించారు. దీంతో బుధవారం అనూషను భూమేశ్ హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ అడ్మిట్ చేసుకుని వైద్య పరీక్షలు వైద్య పరీక్షలు ప్రారంభించారని భూమేశ్ తెలిపారు. మరింత మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ మంజూరుచేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చినట్టు భూమేశ్ చెప్పారు. దీనిపై బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# సబార్డినేట్ కోర్టుల్లో ఉద్యోగఖాళీల భర్తీ

- నోటిఫికేషన్ విడుదల చేసిన హైకోర్టు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సబార్డినేట్ కోర్టుల్లో వివిధ క్యాటగిరీల్లోని ఉద్యోగఖాళీలను నేరుగా భర్తీ చేయడానికి హైకోర్టు బుధవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలంగాణ న్యాయశాఖ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 2018 అనుసరించి రాష్ట్రంలోని సబార్డినేట్ కోర్టుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్), అదనపు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) డాక్టర్ డీ నాగార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. నోటిఫికేషన్లకు సంబంధించిన సమాచారం, పూర్తి వివరాల కోసం హైకోర్టు http://hc.ts.nic.in వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు.

### బీసీ ఓవర్సీస్ పథకానికి నేటినుంచి
# దరఖాస్తుల స్వీకరణ

- ఆగస్టు 31 వరకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మా జ్యోతిబాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా లబ్ధికి అభ్యర్థులు గురువారం (ఆగస్టు 1) నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ అనితారాజేంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించదలచిన బీసీ విద్యార్థులు ప్రభుత్వం తరపున అందించే రూ.20 లక్షల ఆర్థిక సహాయానికి వీసా, పాస్‌పోర్ట్ కాపీతోపాటు, ఆధార్‌కార్డు, స్థానికత, కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణపత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. యూకే, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, సౌత్‌కొరియా దేశాల్లో ఉన్నత విద్యావకాశం పొందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు అభ్యర్థులు http://www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కమిషనర్ తెలిపారు.

# బిల్లు కట్టకుంటే వేటు

మొదటిపేజీ తరువాయి...

ఎక్కడా లేనివిధంగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మెరుగైన విద్యుత్‌వల్ల పారిశ్రామికాభివృద్ధి జరిగింది. విద్యుత్‌సంస్థలు మరింతగా వృద్ధిచెందాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దు. అదే సమయంలో తెలంగాణలో కనురెప్పపాటు కూడా కరంటు పోవద్దు. అందుకోసం ప్రభుత్వపరంగా చేయాల్సిందంతా చేస్తాం' అని చెప్పారు.



బుధవారం ప్రగతిభవన్‌లో విద్యుత్‌శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి తదితరులు ఉన్నారు.

### బిల్లులు చెల్లించకపోతే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులపై వేటు

'గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉన్నది. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించకపోవడం దారుణం. వాడిన కరంటుకు తప్పక బిల్లు చెల్లించాలి. ఇప్పటినుంచి ప్రతినెలా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, హెచ్ఎండబ్ల్యూఎస్ తప్పక విద్యుత్ బిల్లులు చెల్లించాలి. సకాలంలో కరంటు బిల్లు కట్టకపోతే గ్రామాల్లో సర్పంచ్, గ్రామ కార్యదర్శి.. మున్సిపాలిటీ అయితే చైర్‌పర్సన్, కమిషనర్లపై వేటు తప్పదు. పాత బకాయిలను వన్‌టైం సెటిల్మెంట్ కింద ప్రభుత్వం చెల్లిస్తుంది. విద్యుత్‌సంస్థల బకాయిలను జీరో సైజుకు తెస్తాం. గ్రామాలు, పట్టణాల్లో వీధిలైట్ల వాడకంలో కూడా క్రమశిక్షణ రావాలి. పగలు లైట్లు వెలుగకుండా చూసుకోవాలి' అని చెప్పారు.

### శాఖల బడ్జెట్ నుంచే బిల్లుల చెల్లింపు

'ప్రభుత్వశాఖల్లోనూ క్రమశిక్షణ రావాలి. అనేక శాఖలు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించటంలేదు. ఇకపై ప్రభుత్వశాఖల బిల్లులను ఆయాశాఖలకు కేటాయించే బడ్జెట్ నుంచి ఆర్థికశాఖే నేరుగా చెల్లిస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ అవసరాలకోసం వాడే విద్యుత్‌కు ప్రీపెయిడ్ మీటర్లను అమర్చాలి. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడానికి, ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరాకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. ఇందుకోసం బడ్జెట్‌లోనే ప్రత్యేక గ్రాంటు కేటాయించి.. ప్రతినెలా విధిగా విద్యుత్‌సంస్థలకు అందిస్తుంది. విద్యుత్‌సంస్థలు తమ వ్యవస్థలను బలోపేతం చేసుకోవడానికి వీలుగా నిధులు సమకూర్చుకోవడానికి అవసరమైనచోట ప్రభుత్వం పూచీకత్తు ఇస్తుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'పవర్ వీక్'

గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో తక్షణం చేయాల్సిన పనుల కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందిస్తుంది. 60 రోజుల పాటు అమలయ్యే కార్యాచరణలో ఏడురోజుల పాటు 'పవర్ వీక్' కూడా ఉంటుంది. వంగిన విద్యుత్ స్తంభాలను, ఒరిగిన లైన్లను సరిచేయడం, బిల్లులు పెండింగులో లేకుండా చేయడం తదితర పనులను ఆ సమయంలో నిర్వహిస్తాం. సదరు గ్రామానికి, పట్టణానికి వీధిలైట్లకు ఎంత కరంటు అవసరం? ఎంత బిల్లు వస్తుంది? అనే విషయాలను శాస్త్రీయంగా మదింపు చేయాలి' అని సీఎం అన్నారు.

### లేఔట్లలోనే విద్యుత్‌కు తగిన స్థలం

'హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాల్లో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయడానికి స్థలంలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికోసం పట్టణాలు, నగరాల్లో చేసే లేఔట్లలో కచ్చితంగా విద్యుత్ అవసరాలకు తగిన స్థలం కేటాయించేలా ప్రభుత్వం విధానాన్ని తీసుకొస్తుంది' అని సీఎం కేసీఆర్ వెల్లడించారు.

### ఎత్తిపోతలకు సౌర విద్యుత్‌వాడకం

ఎత్తిపోతల పథకాలకు ఏ సమయంలో ఎంత విద్యుత్ అవసరం? దాన్ని ఎలా సమకూర్చాలి? అనే విషయంపై నీటిపారుదల, విద్యుత్‌శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమావేశమై సరైన అంచనాలతో ముందుకు పోవాలని సీఎం సూచించారు. ఎత్తిపోతల పథకాలకు ఏర్పడిన డిమాండును తట్టుకునేందుకు, తక్కువ ధరకు లభ్యమయ్యే సోలార్ విద్యుత్‌ను సమకూర్చుకోవాలని చెప్పిన సీఎం.. ప్రస్తుతం వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కోసం టెండర్లు పిలవాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖకు ఎప్పుడు అవసరం వచ్చినా.. తీర్చగలిగే ఆర్థిక విధానాన్ని రూపొందించాలని ఆర్థికశాఖను సీఎం కోరారు. సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు ఎస్ నర్సింగ్‌రావు, రామకృష్ణారావు, జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిశోర్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్ పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో శ్రీనివాసరావు కుటుంబసభ్యులను ఓదార్చుతున్న కేటీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కూడా ఉన్నారు.

# అధైర్యపడకండి

- మావోయిస్టులు హత్యచేసిన శ్రీనివాసరావు కుటుంబానికి కేటీఆర్ భరోసా

**చర్ల రూరల్:** మావోయిస్టులు ఇటీవల హత్యచేసిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల టీఆర్ఎస్ నేత, ఎంపీటీసీ సభ్యుడు నల్లూరి శ్రీనివాసరావు కుటుంబసభ్యులను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఓదార్చారు. 'అధైర్య పడకండి.. ప్రభుత్వం ఆదుకుంటుంది. కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుంది' అని భరోసా ఇచ్చారు. మంత్రి శ్రీనివాసగౌడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, మండలి చీఫ్ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, సత్యవతి రాథోడ్, కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్యతో కలిసి నల్లూరి శ్రీనివాసరావు భార్య దుర్గ, కుమారుడు ప్రవీణ్ బుధవారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ దురదృష్టకర ఘటనపై కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకొన్నారు. ప్రవీణ్ చదువులకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ కలిగిన నాయకుడిని కోల్పోయిందని విచారం వ్యక్తంచేశారు. కేటీఆర్‌ను కలిసినవారిలో టీఆర్ఎస్ చర్ల మండల అధ్యక్షుడు పీ రవికుమార్, సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు తదితరులు ఉన్నారు.



బుధవారం తెలంగాణభవన్‌లో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి బీమా ప్రీమియం చెక్కును అందజేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్‌రాజు తదితరులు



పదవీవిరమణ పొందుతున్న సందర్భంగా ప్రశాంత్‌కుమార్ ఝా బుధవారం గవర్నర్ నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిసి మొక్కను అందజేశారు. సమర్థంగా విధులు నిర్వర్తించిన ఝాను ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు.



పదవీ విరమణ పొందిన ప్రశాంత్‌కుమార్ ఝాను సన్మానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ జోషి

**ముహూర్తం**



సూర్యోదయం: 5.59 గంటలకు



సూర్యాస్తమయం: 6.46 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం అమావాస్య ఉదయం 8.43 వరకు, తదుపరి శ్రావణమాసం, శుక్లపక్షం పాడ్యమి, నక్షత్రం: పుష్యమి మధ్యాహ్నం 12.12 వరకు, తదుపరి ఆశ్లేష, అమృత ఘడియలు: ఉదయం 6.28 నుంచి 8.04 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.58 నుంచి 3.34 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.21 నుంచి సాయంత్రం 5.04 వరకు, వర్జ్యం: రాత్రి 11.33 నుంచి 1.09 వరకు.

# టీఆర్ఎస్ సభ్యులు 50 లక్షలు

మొదటిపేజీ తరువాయి...

నమోదుతోపాటు పార్టీ పటిష్ఠతకు కమిటీలు వేయాలని, సంస్థాగత నిర్మాణంమీద దృష్టి సారించాలని తమ పార్టీ అధినేత కేసీఆర్ నిర్దేశించారని చెప్పారు. కార్యకర్తలను సుశిక్షితులైన సైనికులుగా తయారుచేయడానికి జిల్లాల్లో కార్యాలయాలను నిర్మించాలని సూచించారని తెలిపారు. పార్టీ కమిటీల నిర్మాణం జరుగుతున్నదని, చాలాచోట్ల గ్రామ కమిటీలు, పట్టణాల్లో బూత్ కమిటీలు వేస్తున్నారని కేటీఆర్ అన్నారు. దసరా వరకు పార్టీ కార్యాలయాల నిర్మాణం పూర్తయితే పార్టీ నిర్మాణం మీద, నాయకులు, కార్యకర్తలకు శిక్షణ మీద దృష్టి పెడుతామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని సమర్థంగా నడుపుతున్నారని, ప్రభుత్వపరంగా ఇచ్చిన హామీలను అమలుచేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో బ్రహ్మాండంగా వర్షాలు పడుతున్నాయని, ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రతిపక్షాలకు సమస్యలు లేక ఏదో ఒకటి మాట్లాడాలని విమర్శిస్తున్నారని, వాటి పట్ల తమకు ఆసక్తి లేదని, ఎవరెన్ని విమర్శలు చేసినా, సమయం వచ్చినప్పుడు తమ వాదనను ప్రజలకు వినిపించి.. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకొంటామని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రజలు టీఆర్ఎస్‌వైపు నిలిచారని, 32జెడ్పీలను టీఆర్ఎస్‌కు కట్టబెట్టారని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాకోర్టులో తేల్చుకుందామన్నారు. ఎవరు బాగా పనిచేస్తున్నారో నిర్ణయించేది ప్రజలేనని చెప్పారు. క్యాబినెట్ విస్తరణ గురించి తనకు తెలియదని కేటీఆర్ తెలిపారు. పార్టీలో అన్ని కమిటీలు వేసుకున్నాక, కమిటీలవారీగా జిల్లా, రాష్ట్రస్థాయిలో శిక్షణలు ఉంటాయని చెప్పారు. హైదరాబాద్‌లో సభ్యత్వ వేగం పెంచాల్సిన అవసరం ఉన్నదని, టీఆర్ఎస్వీ సభ్యత్వాన్ని కూడా చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ అనుబంధ సంఘాలను పటిష్ఠపర్చాల్సి ఉన్నదని, తద్వారా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరుపాలో ఎన్నికల సంఘం నిర్ణయిస్తుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని, బీజేపీ పని బీజేపి చేస్తుందని, తమ పని తాము చేస్తున్నామని చివరికి ప్రజల పని ప్రజలు చేస్తారని అన్నారు. గడిచిన ఐదేండ్లుగా కాంగ్రెస్ నాయకులు అనేక మాటలు మాట్లాడారని, కొంత మంది శపథాలు చేశారని, మరికొందరు గడ్డాలు తీయబోమని చెప్పారని గుర్తుచేశారు.

### ప్రమాద బీమాకు రూ.11.21 కోట్ల ప్రీమియం

ఇప్పటివరకు 50 లక్షల సభ్యత్వం పూర్తయిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 2014-15 నుంచి పార్టీ కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పించడం ఆనవాయితీగా వస్తున్నదని చెప్పారు. సభ్యత్వం తీసుకున్నవారికి ఆగస్టు 1 నుంచి ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయన వెల్లడించారు. ప్రమాదవశాత్తు చనిపోయినవారికి రూ.2 లక్షలు చెల్లించడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన ప్రీమియం రూ.11.21 కోట్లను ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించామని తెలిపారు. సభ్యత్వ నమోదు బ్రహ్మాండంగా జరిగిందని, నెల రోజుల్లో 50లక్షల సభ్యత్వం చేయడం దేశంలో ఒక రికార్డుగా ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ నగరంలో సభ్యత్వం కొనసాగుతున్నదన్నారు. పార్టీ సభ్యత్వాన్ని విజయవంతం చేయడానికి కృషిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సహా ఇతర నాయకులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్ మల్లారెడ్డి, మాజీ మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జోగు రామన్న, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీలు మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంభీపూర్‌రాజు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావు, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖకు మహిళా అధిపతి

- పీసీసీఎఫ్‌గా రొయ్యూరి శోభకు పూర్తి అదనపు బాధ్యతలు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి తొలి మహిళగా ఘనత
- పీసీసీఎఫ్ ఝాకు ఆత్మీయ వీడ్కోలు



పూర్తిస్థాయి అదనపు పీసీసీఎఫ్‌గా నియమితులైన రొయ్యూరి శోభను బుధవారం అరణ్యభవన్‌లో అభినందిస్తున్న అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అటవీశాఖ అధిపతి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌గా తొలిసారి ఓ మహిళ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ పీసీసీఎఫ్‌గా ఉన్న రొయ్యూరి శోభను పూర్తిస్థాయి అదనపు పీసీసీఎఫ్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం పీసీసీఎఫ్‌గా ఉన్న ప్రశాంత్‌కుమార్ ఝా బుధవారం పదవీవిరమణ చేయడంతో.. ఆయన స్థానంలో శోభను నియమించారు. ఆమె గురువారం నుంచి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను చేపట్టనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటివరకు అటవీశాఖ అధిపతిగా ఒక మహిళ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను చేపట్టడం ఇదే మొదటిసారి. ఇప్పటివరకు దేశంలో ముగ్గురే ఈ బాధ్యతలు చేపట్టారు. నాలుగో అధికారిగా శోభ ఘనతకెక్కనున్నారు. 33 ఏండ్ల సర్వీస్ ఉన్న ఆమె సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారిగా ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రంలో పలు కీలక పదవుల్లో పనిచేశారు. మిషన్ భగీరథ వంటి బృహత్తర పథకాలకు వెనువెంటనే ఫారెస్ట్ క్లియరెన్స్ లిచ్చి జాప్యానికి ఆస్కారం లేకుండా పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కృషిచేశారు. ఉన్నతాధికారుల ప్రశంసలను పొందారు.

### ఝాకు ఆత్మీయ వీడ్కోలు

మూడేండ్లు అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌గా విధులు నిర్వర్తించి బుధవారం పదవీ విరమణ పొందిన ప్రశాంత్‌కుమార్ ఝాకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. అరణ్యభవన్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అటవీ, పర్యావరణశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ, పీసీసీఎఫ్‌లు పృథ్వీరాజ్, మునీంద్ర పాల్గొన్నారు. వివాదాలకు అతీతంగా పీసీసీఎఫ్‌గా విధులు నిర్వర్తించిన పీకే ఝా అటవీ సంరక్షణకు చేసిన కృషి మరువలేనిదని మంత్రి ఇంద్రకరణ్ చెప్పారు. హరితహారం విజయవంతంతోపాటు కాళేశ్వరం ప్రాజెక్ట్, ఇతర అభివృద్ధి పనులకు చకచకా అటవీ అనుమతులను తీసుకొచ్చి ప్రభుత్వానికి సహకరించారని తెలిపారు. ఝా నేతృత్వంలో అటవీశాఖ సమర్థంగా పనిచేసిందని సీఎస్ ఎస్కే జోషి అభినందించారు. ప్రతి ఒక్కరి సహకారంతోనే తన విధి నిర్వహణలో విజయవంతమయ్యానని పీకే ఝా అన్నారు. ఇంచార్జి పీసీసీఎఫ్‌గా నియమితులైన ఆర్ శోభకు మంత్రి ఇంద్రకరణ్, సీఎస్ ఎస్కే జోషి, ప్రశాంత్‌కుమార్‌ఝా తదితరులు అభినందనలు తెలిపారు.

### లోకం పోకడ




ఒకరి భూమి ఇంకొకరికి రాసేస్తున్నామని మామీద విమర్శలు వస్తున్నాయయ్యా.. అందుకని నా పేరు మీదే రాసుకున్నా!

# రెరా అనుమతిలేని ప్రాజెక్టుల పేర్లు పత్రికల్లో ప్రచురిస్తాం

- ప్రాజెక్టుల నమోదుకు గడువు పొడిగింపు లేదు
- రెరా అథారిటీ చైర్మన్ రాజేశ్వర్‌తివారీ స్పష్టీకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రెరా అథారిటీ సంచలన నిర్ణయం తీసుకున్నది. 2017 జనవరి 1 నుంచి 2018 ఆగస్టు 31 దాకా స్థానిక పట్టణ సంస్థల అనుమతి తీసుకుని.. రెరాలో నమోదు చేసుకోని సంస్థలకు గడువును పొడిగించడంలేదని బుధవారం స్పష్టంచేసింది. రెరా అనుమతి తీసుకోని సంస్థలపై జరిమానా విధిస్తామని ప్రకటించింది. ఆయా వెంచర్లు, ప్రాజెక్టుల్లో కొనుగోలుదారులు ఎట్టి పరిస్థితుల్లో ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయించకూడదని రెరా అథారిటీ సూచించింది. రెరా అనుమతి తీసుకోకుండా ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయిస్తున్న సంస్థల పేర్లను ఇకనుంచి క్రమం తప్పకుండా పత్రికల్లో ప్రచురిస్తామని రెరా అథారిటీ చైర్మన్ రాజేశ్వర్ తివారీ తెలిపారు. తెలంగాణ రెరా అథారిటీ తీసుకున్న ఈ నిర్ణయంపై నిర్మాణసంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. నమోదైన ప్రాజెక్టుల్లో ప్లాట్లు, ఫ్లాట్లను కొనుగోలుకి వీలు కలుగుతుందని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జక్కా వెంకట్‌రెడ్డి తెలిపారు.

# 15న ఇంటింటా ఇన్నోవేటర్

- ఆధునిక ఆవిష్కరణల ప్రదర్శనకు టీఎస్ఐసీ అవకాశం
- దరఖాస్తులకు గడువు 5వ తేదీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నది. రాష్ట్రంలో సరికొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చేందుకు 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమాన్ని ఆగస్టు 15న నిర్వహించనున్నది. 33 జిల్లాల్లో జరిగే ఈ కార్యక్రమంలో గ్రామీణ యువత, విద్యార్థులు తదితరులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించవచ్చు. కొత్త స్టార్టప్‌లు, ఎమ్మెస్ఎంఈకి చెందిన ఆధునిక ఆవిష్కరణలను ప్రదర్శించేందుకు వీలు కల్పిస్తారు. ఆసక్తిగలవారు ముందుగా తమ ఆవిష్కరణను క్లుప్తంగా వివరించి, వీడియోను 9100678543 నంబరుకు పంపించాలని టీఎస్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 5 చివరి తేదీకాగా, తుది పోటీకి అర్హులైన వారికి నోడల్ అధికారి సమాచారం అందజేస్తారని పేర్కొన్నది.




బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలివచ్చిన భక్తులు (ఇన్‌సెట్‌లో) కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద ఉధృతంగా గోదావరి



బుధవారం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపూర్ పుష్కరఘాట్ వద్ద శ్రీశైలం వైపు పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



# నేడు మల్లన్న చెంతకు

మొదటిపేజీ తరువాయి...

నింపుకొని, ఇప్పుడు సుందిల్ల పంప్‌హౌస్ ద్వారా ఎల్లంపల్లి జలాశయంలోకి చేరుకోవడంతో లింక్– 1 పరిపూర్ణమైంది. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు కీలకమైన మైలురాయిని అధిగమించినట్టయింది.



బుధవారం నీటితో కళకళలాడుతున్న జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు

## ఆల్మట్టికి కొనసాగుతున్న వరద

కర్ణాటకలోని ఆల్మట్టికి 1,19,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. వరద ఇలాగే కొనసాగుతుందని సీడబ్ల్యూసీ కూడా పేర్కొనటంతో దిగువకు ఎక్కువ నీటిని వదులుతున్నారు. ఆల్మట్టి స్పిల్‌వే ద్వారా 1,33,563 క్యూసెక్కులు, విద్యుత్‌ప్లాంట్ల నుంచి 42,000 క్యూసెక్కులు నదిలోకి విడుదలవుతున్నాయి. నారాయణపుర జలాశయానికి 1.93 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తుతుండటంతో డ్యాం 24 గేట్లు ఎత్తి 1,85,400 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం రాత్రి 10 గంటలకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కు 2,05,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 24 గేట్ల ద్వారా 2,21,5321 క్యూసెక్కులను దిగువనకు విడుదల చేస్తున్నారు. ఈ జలాలు ఇప్పటికే శ్రీశైలం బ్యాక్‌వాటర్‌ను చేరుకోగా.. అర్ధరాత్రి లేదా గురువారం ఉదయం ఆరుగంటల వరకు శ్రీశైలం జలాశయానికి 1,62,444 క్యూసెక్కుల నీళ్లు చేరుకుంటాయని కేంద్ర జల సంఘం అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల ప్రభావం చూస్తుంటే సుమారు వారంపాటు ఆల్మట్టి, నారాయణపుర నుంచి దిగువకు ఔట్‌ఫ్లో ఇదేస్థాయిలో కొనసాగే అవకాశం ఉన్నదని అంటున్నారు. ఆల్మట్టికి గురువారం ఉదయం 8 గంటలకు 2,11,884 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైతే.. నారాయణపురకు 1,94,227 క్యూసెక్కులు వచ్చే అవకాశం ఉన్నదని సీడబ్ల్యూసీ లెక్కవేసింది. బుధవారం ఉదయం జూరాల ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా సాయంత్రానికి అది 1,90,000కు పెరుగడంతో ప్రాజెక్టు పూర్తి నిల్వసామర్థ్యానికి చేరుకున్నది. 318.516 మీటర్ల పూర్తి సామర్థ్యానికిగాను 318.500 మీటర్ల స్థాయిలో నీటిని ఉంచి.. వచ్చిన నీటిని వచ్చినట్టే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాలకు వరద బాగా ఉండటంతో ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన ఎత్తిపోతల పథకాలన్నింటినీ వెంటనే నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నారు. దిగువకు నీటి విడుదల దృశ్యాలను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు సమీపంలో మత్స్యకారుల వద్ద లభించే వివిధ రకాల చేప వంటకాలను ఆరగిస్తున్నారు. ఇదిలా ఉంటే.. కృష్ణాబేసిన్‌లోని డిండి, మూసీ, కోటిపల్లి, పాకాల, వైరా, లంకాసాగర్, బయ్యారం తదితర ప్రాజెక్టులకు కూడా వరద వస్తున్నది. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిన్నగోప్లాపూర్ పంప్‌హౌస్ నుంచి రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం ఫేజ్–1కు కృష్ణానది నుంచి నీటి పంపింగ్ కొనసాగుతున్నది. మరోవైపు తుంగభద్రకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. బుధవారం రాత్రి వరకు 14,613 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. భీమా నది ద్వారా ఉజ్జయిని ప్రాజెక్టుకు 58 వేల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది.

### బుధవారం వివిధ ప్రాజెక్టుల్లో నీటిమట్టాల వివరాలు

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1702.43 | 129.72 | 115.91 | 1,19,850 | 1,76,297 |
| నారాయణపుర | 1615.00 | 1610.79 | 37.64 | 27.44 | 1,93,000 | 1,85,400 |
| జూరాల | 1045.00 | 1044.00 | 9.66 | 9.60 | 2,05,000 | 2,21,532 |
| తుంగభద్ర | 1633.00 | 1605.06 | 100.86 | 25.60 | 14613 | 2067 |
| శ్రీశైలం | 885.00 | 804.10 | 215.81 | 31.04 | 45 | 45 |
| నాగార్జునసాగర్ | 590.00 | 506.90 | 312.05 | 126.47 | 957 | 957 |
| సింగూరు | 1717.93 | 1670.28 | 29.91 | 0.44 | 15 | 15 |
| నిజాంసాగర్ | 1405.00 | 1367.82 | 17.80 | 0.11 | 37 | 11 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1049.00 | 90.31 | 5.66 | 675 | 232 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.10 | 24.07 | 3.33 | -- | 204 |
| కడెం | 700.00 | 693.65 | 7.60 | 6.05 | 20919 | 13483 |
| ఎల్లంపల్లి | 485.56 | 466.34 | 20.18 | 7.63 | 19096 | 596 |



అంతర్గాం మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు జలకళ

# ఉగ్ర గోదావరి

గోదావరి ఉధృతంగానే ప్రవహిస్తున్నది. ప్రాణహిత నుంచి మూడు లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నది. ఇంద్రావతి నుంచి మరో నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో పేరూరు వద్ద 7,06,260 క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదైంది. దీంతో ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో 3,18,277 క్యూసెక్కులు ఉండగా.. దాదాపు అంతే మోతాదులో నీటిని సముద్రంలోకి విడుదలచేస్తున్నారు. ఎగువ నుంచి ఇన్‌ఫ్లోలు అధికంగా ఉన్న నేపథ్యంలో గురువారం నాటికి ధవళేశ్వరం వద్ద గోదావరి జలాలు మరింత పెరుగనున్నాయి. ఇక కడెం దూకుడు కొంత తగ్గినప్పటికీ.. బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉన్నది. కడెం ప్రాజెక్టులోకి బుధవారం సాయంత్రం వరకు 20,919 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. కడెం–ఎల్లంపల్లి మధ్యలో కూడా వరద తోడవటంతో ఎల్లంపల్లి జలాశయానికి 16వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 13,483 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. ఎల్లంపల్లి జలాశయంలో 20.18 టీఎంసీల సామర్థ్యానికి గాను బుధవారం సాయంత్రం వరకు 7.63 టీఎంసీల నిల్వకు చేరుకున్నది.



తమ్మిడిహట్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత

### వరదలతో ఉప్పొంగిన ప్రాణహిత

కౌటాల మండలంలోని తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతున్నది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో వెంకట్రావ్‌పేట్ వద్ద బ్రిడ్జి కింది నుంచి పెన్‌గంగ నది ఉధృతంగా పారుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో మూడురోజులపాటు కురిసిన వర్షాలకు వివిధ ప్రాజెక్టుల్లోకి ఎగువ నుంచి వరద వచ్చి చేరుతున్నది. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులో 2017 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఉన్న లక్ష్మీపూర్ రిజర్వాయర్‌కు 60 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. తాంసి మండలం మత్తడి ప్రాజెక్టులోకి 984 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఈ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 277.5 మీటర్లు కాగా ప్రస్తుతం 273.6 మీటర్ల మేర నీరు నీరు చేరింది.

### కన్నెపల్లిలో మోటర్లకు రెండోరోజూ విశ్రాంతి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంప్‌హౌస్‌లో రెండోరోజు కూడా మోటర్లకు ఇంజినీర్లు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. అన్నారం బరాజ్‌కు మానేరు నది నుంచి 2900 క్యూసెక్కుల వరద వస్తున్నదని ఇంజినీర్లు తెలిపారు. బరాజ్‌లో ప్రస్తుతం 8.65 టీఎంసీ నీరు నిల్వ ఉన్నదని చెప్పారు. ఎగువన మహారాష్ట్రలో గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది పొంగుతూ గోదావరిలో కలిసి ఉరుకులు పెడుతున్నది. బుధవారం ఉదయం వరకు రెండు లక్షల క్యూసెక్కులుగా ఉన్న నీటిప్రవాహం.. సాయంత్రానికి 2,10,000 క్యూసెక్కులకు పెరిగింది. గోదావరి నిలకడగా ఉండటంతో కాళేశ్వరానికి వచ్చిన భక్తులు నదిని చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బుధవారం కుమ్రం భీం ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న వరద నీరు



నీటితో కళకళలాడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

### కుమ్రంభీం ప్రాజెక్టు 3 గేట్ల ఎత్తివేత

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో కుమ్రంభీం ప్రాజెక్టులోకి 5,080 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతున్నది. దీంతో ప్రాజెక్టు అధికారులు బుధవారం మూడు గేట్లను ఎత్తి, 2,430 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. తిర్యాణి మండల కేంద్రంలోని చెలిమెలవాగు ప్రాజెక్టులో నీరు పూర్తిస్థాయికి చేరుకున్నది. చింతలమానేపల్లి బాబాసాగర్ గ్రామ సమీపంలోని అర్కగూడ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నిండి, మత్తడి దుంకుతున్నది.





SREE DATTHA INSTITUTE OF ENGINEERING AND SCIENCE- CODE-SDES
SREE DATTHA GROUP OF INSTITUTIONS- CODE-SDGI
Approved by AICTE & Affiliated to JNTUH, NAAC accredited - Sheriguda(v), Ibrahimpatnam(M), R.R.Dist-501510 PH: 8801099900/ 8686888686
SCHOLARSHIP AVAILABLE FOR ECE/EEE/MECH/CIVIL
MANAGEMENT SEATS AVAILABLE IN CSE/ECE/EEE/MECH/CIVIL
100% PLACEMENT ASSISTANCE
• HOSTEL facility available for Boys & Girls within the campus.
• Transport facility available from all parts of Twin Cities.




బుధవారం విద్యుదుత్పత్తి లోడ్ పెంచే విషయంపై దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రంలో అధికారులతో చర్చిస్తున్న జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం

# జూరాలలో విద్యుత్ జోష్

- ఇప్పటికే 7 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం వెల్లడి

**ఆత్మకూరు, నమస్తే తెలంగాణ:** ఎగువ నుంచి భారీ ఇన్‌ఫ్లో ఉండటంతో జూరాల జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నది. ఎగువ జూరాలలోని ఐదు యూనిట్ల ద్వారా 120 మెగావాట్లు(2.4 మిలియన్ యూనిట్లు), దిగువ జూరాలలోని ఆరు యూనిట్ల ద్వారా 184 మెగావాట్ల (3.8 మిలియన్ యూనిట్లు) విద్యుత్ ఉత్పత్తి చేసినట్టు జెన్‌కో డైరెక్టర్ వెంకటరాజం తెలిపారు. వరద స్థిరంగా కొనసాగితే రోజూ రెండు మిలియన్ యూనిట్లను ఉత్పత్తిచేయగలమని చెప్పారు. బుధవారం దిగువ జూరాల జలవిద్యుత్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరద ఒక్కసారిగా వచ్చిన నేపథ్యంలో నెట్ జనరేషన్‌లో ఉత్ప త్తి తగ్గుతుందని, యూనిట్లపై పూర్తి లోడ్ వేయలేకపోతున్నామని, కొద్దికొద్దిగా లోడ్ పెంచి ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని వివరించారు. ఎగువ జూరాలలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ మొత్తంలో సగం కర్ణాటకకు, సగం తెలంగాణకు చెందేలా ఒప్పందం ఉన్నదని తెలిపారు. స్పిల్‌వే నీరు గురువారానికి శ్రీశైలం చేరే అవకాశం ఉన్నదని, రెండ్రోజుల్లో విద్యుదుత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. హఠాత్తుగా వరదవచ్చినా విజయవంతంగా ఉత్పత్తి ప్రారంభించామని టీఎస్ హైడల్ ప్రాజెక్ట్ సీఈ సురేశ్ తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక పాలన సంచాలకులు
ప్రతిపాదన కోసం అభ్యర్థన
నం. 122955/2019-H2 తేది: 31-7-2019
పురపాలక పాలన సంచాలకులు, TS, హైదరాబాద్ వారు తెలంగాణలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుల కోసం సాంకేతిక సహాయం మరియు ట్రాన్సాక్షన్ సలహా సేవలు కల్పించుట కోసం ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయుటకు "ప్రతిపాదన కోసం అభ్యర్థన" కోరుతున్నారు. ఆసక్తిగల సంస్థలు 21-8-2019న 15.00గం.ల్లోగా RFP దాఖలు చేయాల్సిందిగా కోరబడుచున్నారు. RFP డాక్యుమెంట్‌ను www.cdma.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/– టి.కె. శ్రీదేవి, పురపాలక పాలన సంచాలకులు
DIPR RO. No. 777-DP/CL/Advt/1/2019-20, Dt: 31/07/2019


# కాళేశ్వరం లింక్-1 సక్సెస్

- సుందిల్లలో విజయవంతంగా తొలి మోటర్ వెట్‌రన్
- ఎల్లంపల్లి జలాశయంలోకి దుంకిన జలాలు
- కాళేశ్వరం ప్రాజెక్టులో అద్భుతం ఆవిష్కారం



బుధవారం రాత్రి అంతర్గాం మండలం గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్ వద్ద వెట్‌రన్ సక్సెస్ కావడంతో విజయచిహ్నం చూపుతున్న ఇంజినీరింగ్ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు

**మంథని, నమస్తే తెలంగాణ:** తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు మరో మైలురాయిని అధిగమించింది. అపరభగీరథుడు, సీఎం కేసీఆర్ చేపట్టిన యజ్ఞంలో సరికొత్త అధ్యాయం లిఖితమైంది. మేడిగడ్డ బరాజ్‌నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా బయల్దేరిన ప్రాణహిత జలాలు అన్నారం, సుందిల్ల బరాజ్‌లను చేరుకుని.. ఇప్పుడు గోలివాడ పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోయడంతో ఎల్లంపల్లి జలాశయంలోకి దుంకాయి. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక టవ లింక్ దిగ్విజయంగా పరిపూర్ణమైంది. ఈ ప్రక్రియతో ప్రాణహిత జలాలు 111 కిలోమీటర్లు ప్రయాణం చేసినట్టయింది. మేడిగడ్డ నుంచి వచ్చిన ప్రాణహిత జలాలు నాలుగురోజుల క్రితమే అంతర్గాం మండలం గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్‌కు చేరాయి. దీంతో కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, నీటిపారుదల సలహాదారు పెంటారెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీర్లు బుధవారం రాత్రి వెట్‌రన్ నిర్వహించారు. మోటర్ ఆన్‌చేసిన కొద్దిసేపటికే నిర్దేశిత ఆర్పీఎం(రెవల్యూషన్స్ పర్ మినిట్)కు చేరుకొని జలాలను రెండు కిలోమీటర్ల దూరంలోని డెలివరీ సిస్టర్న్‌ల నుంచి విజయవంతంగా ఎత్తిపోశాయి. లింక్– 1 విజయవంతంకావడంతో ఇన్నాళ్ల శ్రమకు ఫలితం దక్కిందంటూ అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు ఆనందం వ్యక్తంచేశారు. డెలివరీ సిస్టర్న్ వద్ద ఎగిసిపడుతున్న నదీమాతకు పూలు, పసుపు, కుంకుమ సమర్పించారు. జై కాళేశ్వరం..జైకేసీఆర్ నినాదాలు చేస్తూ స్వీట్లు తినిపించుకున్నారు.

**రీడిజైనింగ్ తొలి ఫలితం**

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన లింక్–1 విజయవంతంతో సీఎం కేసీఆర్ చేపట్టిన రీఇంజినీరింగ్, రీడిజైనింగ్ తొలి ఫలితాన్నిచ్చినట్టయింది. చుక్కనీరు లేని గోదావరి నదీగర్భం.. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల నిర్మాణంతో ఈరోజు నిండుకుండలా మారి.. ఎల్లంపల్లి జలాశయానికి దిగ్విజయంగా ఎదురెక్కింది. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా లింక్– 1ను విజయవంతం చేయడంలో కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, నీటిపారుదల సలహాదారు పెంటారెడ్డి కీలక పాత్ర పోషించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల ఈఈలు రమణారెడ్డి, అలకొండ యాదగిరి, బండ విష్ణుప్రసాద్, డీఈఈలు, ఏఈలు విదేశీ ఇంజినీర్లు, ఇరిగేషన్ నిపుణులు, బరాజ్‌ల సిబ్బంది సహకరించారు.

### సీఎం కేసీఆర్ సంకల్పంతోనే పరిపూర్ణ విజయం



వృథాగా గోదావరిలో చేరి సముద్రంలో కలిసిపోతున్న ప్రాణహిత జలాలను ఒడిసిపట్టేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రాణహిత దిగువన మేడిగడ్డ బరాజ్ కట్టి అక్కడి నుంచి బరాజ్‌లు, పంపుహౌస్‌లతో నీటిని ఎదురెక్కించి, ఎల్లంపల్లిని నింపేందుకు లింకు– 1ను రూపొందించారు. ఈ రోజు సుందిల్ల నుంచి ప్రాణహిత నీటిని ఎల్లంపల్లిలోకి ఎత్తిపోయడంతో లింక్–1ను విజయవంతం చేసుకున్నాం. ఇది పూర్తిగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం పర్యవేక్షణ, ఆయన సంకల్ప బలంతోనే సాధ్యమైంది. ఇంజనీర్లు, రైతులు, ప్రజల సహకారంతోనే సత్ఫలితాలను సాధించాం.

- నల్లా వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఈఎన్సీ

### ఇది కాళేశ్వరం సృష్టికర్త సీఎం కేసీఆర్ విజయం..



కాళేశ్వరం ప్రాజెక్టును సృష్టించిందే సీఎం కేసీఆర్. కాళేశ్వరం ప్రాజెక్టు ఆయన బిడ్డ. నిరంతరం పర్యవేక్షిస్తూ సలహాలు, సూచనలు చేస్తూ మమ్మల్ని ముందుకు నడిపారు. ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం. దానికి అనుగుణంగా మేం పని చేసి విజయం సాధించాం. ఈ విజయం పూర్తిగా సీఎంకే దక్కుతుంది. తెలంగాణ రాష్ట్రానికే కాళేశ్వరం ప్రాజెక్టు ఒక గ్రేట్ అచీవ్‌మెంట్.

- పెంటారెడ్డి, ఎత్తిపోతల సలహాదారు

### అందరి సహకారంతోనే విజయవంతం



సుందిల్ల పంపుహౌస్ 1వ మోటార్ వెట్‌రన్‌తో కాళేశ్వరం జలాలను ఎల్లంపల్లిలోకి ఎత్తిపోసే అద్భుత సన్నివేశం నేనెన్నడూ మర్చిపోలేను. ఇది సీఎం కేసీఆర్, ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డి, ఇంజినీర్ల సమిష్టి కృషి ఫలితం.

- బండ విష్ణుప్రసాద్, ఈఈ సుందిల్ల బరాజ్


ప్రాంతీయ కార్యాలయం: తెలంగాణ
కార్మిక రాజ్య బీమా సంస్థ
5–9–23, ఆదర్శ్‌నగర్, హైదరాబాద్–500063
ఫోన్ నెం. 040–23232356/57/58/59, ఫ్యాక్స్ నం. 040–23235048
వెబ్‌సైట్: www.esic.nic.in ఇ–మెయిల్: rd-telangana@esic.nic.in
సవరణ
31–07–2019న eprocure.gov.in/eprocure/appలో మరియు ఈ దినపత్రికలో ప్రచురించబడిన **బ్రాంచ్ కార్యాలయం, రామగుండం కోసం అద్దెపై వసతి** టెండరు ఐడి 2019–ESIC-490744-1 కోసం ఇ–టెండర్లు దాఖలు కోసం మరియు ఆఫ్‌లైన్ దరఖాస్తు చేయుటకు కూడా ఆఖరి తేది 07–08–2019న మధ్యాహ్నం 2.00 గంటలుగా చదువుకోగలరు. అది టెండరు డాక్యుమెంట్‌లో 08–08–2019న ఉదయం 11.00 గంటలుగా తెలుపబడినది. ఇతర నియమ నిబంధనలు యథాతథం.
అడిషనల్ కమిషనర్ & రీజినల్ డైరెక్టర్

J.B. INSTITUTE OF ENGINEERING & TECHNOLOGY (JBIT)
(UGC Autonomous)
(Approved by AICTE, Permanently Affiliated to JNTUH, Accredited by NAAC)
www.jbiet.edu.in
JOGINPALLY B.R ENGINEERING COLLEGE (JOGI)
(Approved by AICTE, Affiliated to JNTUH, Accredited by NAAC)
www.jbrec.edu.in
BHASKAR ENGINEERING COLLEGE (BSKR)
(Approved by AICTE, Affiliated to JNTUH) www.bec.edu.in
Campus: Bhaskar Nagar, Yenkapally (V), Moinabad (M), Hyderabad-75
Ph: JBIET: 958413-235127/235053, JBREC: 958413-235684 www.jbgroup.org.in
ORIENTATION PROGRAMME FOR 1st YEAR B.TECH 2019 - 20 BATCH
JBIET, JBREC & BEC Management, Principals & Staff welcome the students of 1st year B.Tech (Convenor Seats & B.Category Seats) along with their parents on 02-08-2019 for the Orientation Programme, at 9.30 A.M. at respective colleges.
For the convenience of the students & parents, college buses will run from all parts of the city at 7.15 A.M. In addition, exclusive college buses will run from Mehdipatnam (Rythubazar) to the Colleges at 8:30 A.M.
Transport facility available from all parts of the city
For details contact: 9866983606, 8897550082
Separate Hostel Facility for Boys & Girls
For details contact: 9290487259, 9676179192
For further details, contact JBIET-9908058222, 9989623333. JBREC-9676466680, 9704130091. BEC-7702614449, 8008096774.

● వెల్లువలా హరితహారం



మొక్కలు పెంచితే వాతావరణ సమతుల్యత సాధ్యమై వర్షాలు కురుస్తాయని మంత్రి మల్లారెడ్డి చెప్పారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపచేశారు. అంతకుముందు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఇంటింటా ఆరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అనితాలాలయ్య, ఎంపీపీలు ఎల్లూబాయిబాబు, హారిక మురళీగౌడ్, సర్పంచ్ బాలమణి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుర్క కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - శామీర్‌పేట



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు నియోజకవర్గకేంద్రంలోని జేకే5 ఓసీ వద్ద బుధవారం హరితహారం నిర్వహించి 1,700 మొక్కలు నాటారు. మొక్క వృక్షంగా మారేవరకు కాపాడుకోవాలని ఎమ్మెల్యే హరిప్రియానాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ రజత్‌కుమార్‌సైనీ, సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎంలు, డెరెక్టర్లు పాల్గొన్నారు. - ఇల్లెందు నమస్తే తెలంగాణ



పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని మిస్ వరల్డ్ ఆస్ట్రేలియా-2017 ఎస్మా వొలోదర్ సూచించారు. మొక్కలు పెంచితేనే మానవజాతి మనుగడ సాధ్యమని చెప్పారు. యాదాద్రిభువనగిరి జిల్లా లోని భూదాన్‌పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ సందర్శనకు వచ్చిన ఆమె బుధవారం సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో హరితహారంలో పాల్గొన్నారు. ప్రాచీన శివాలయం, బాలుర ఉన్నత పాఠశాల, పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ సికిటమెట్ల శ్రీహరి, ఏసీపీ సత్తయ్య, ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు. - సంస్థాన్‌నారాయణపురం

# ఉద్యమంలా హరితహారం

- సీఎం కేసీఆర్ కలను నిజంచేసిన మల్కాపూర్
- ఐదేండ్లలో నాటిన మొక్కలు లక్షా 62 వేలు
- గ్రామంలో ఎటుచూసినా వృక్షాలే



మెదక్ జిల్లా తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో వృక్షాలుగా మారిన హరితహారం మొక్కలు

**మెదక్ ప్రతినిధి నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్ఫూర్తితో ఓ గ్రామం హరితవనంగా మారింది. గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా నిలుపాలన్న లక్ష్యంతో యువత ఏకమై ఉద్యమంలా హరితహారాన్ని చేపట్టారు. నాటిన మొక్కల్లో 80 శాతం బతికేలా చేపట్టిన చర్యలతో ఇప్పుడు గ్రామంలో ఎటుచూసినా ఏపుగా పెరిగిన వృక్షాలు ఆహ్లాద వాతావరణాన్ని పంచుతున్నాయి. మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామస్థులు గత ఐదేండ్లుగా హరితహారమే శ్వాసగా కదిలారు. ఏటా హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా, ఇంటి ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ రకాల మొక్కలను భారీగా నాటారు. గ్రామాలన్నీ హరితవనాలుగా మార్చాలన్న సీఎం కేసీఆర్ పిలుపుతో ఐదేండ్లలో సుమారు లక్షా 62 వేల మొక్కలను గ్రామంలో నాటారు. వీటిలో లక్షా 20 వేల మొక్కలను సంరక్షించారు. గ్రామంలోని యువకులను మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ ఏకతాటిపై తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి చర్యలుచేపట్టారు. మొక్కల సంరక్షణకు ఎంపీ కొత్తప్రభాకర్‌రెడ్డి వాటర్‌ట్యాంకర్ కొనిచ్చారు. దీంతో టిన మొక్కల్లో 80 శాతానికి పైగా బతికి వటవృక్షాలుగా మారుతున్నాయి.

**ఐక్యంగా కదిలిన యువత**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. గ్రామంలోని ఐదు యువజన సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చారు.వీరంతా కలిసి 'మేక్ ఇన్ మల్కాపూర్ యూత్' ఏర్పడి పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నారు. హరితహారాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

**అభివృద్ధికి చిరునామా.. రాక్‌గార్డెన్**

గ్రామస్థులు సమిష్టి కృషితో రాక్‌గార్డెన్‌ను నిర్మించుకున్నారు.గ్రామంలోని ఖాళీప్రదేశంలో పెద్దపెద్ద బండరాళ్లను వివిధ ఆకారాల్లో అమర్చారు. మొక్కలు పెంచి గార్డెన్‌ను ఏర్పాటుచేసుకున్నారు. 'గ్రామస్థుల సమిష్టికృషితో హరితహారం పథకంలో సత్ఫలితాలు సాధిస్తున్నాం. రాష్ట్రంలోనే ఆదర్శగ్రామంగా నిలుపాలనే లక్ష్యాన్ని సాధించాం'అని మేక్ ఇన్ మల్కాపూర్ యూత్ అధ్యక్షుడు కిష్టాల రవి చెప్పారు.

## మల్కాపూర్ స్ఫూర్తిపై సీఎం కేసీఆర్ సంతృప్తి

**తూప్రాన్ రూరల్:** గత ఏడాది ఆగస్టు 15న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు మల్కాపూర్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ గ్రామస్థులు ఏర్పాటుచేసుకున్న రాక్‌గార్డెన్‌ను చూసి మంత్రముగ్ధులయ్యారు. అక్కడ కదంబం,కొబ్బరి మొక్కలు నాటారు. అనంతరం కిష్టాల స్వామి ఇంటి ఆవరణలో మరో కొబ్బరిమొక్క నాటారు. అవి ప్రస్తుతం ఏపుగా పెరుగుతున్నాయి. మల్కాపూర్‌లోని పలు వీధుల్లో సీఎం కేసీఆర్ కలియతిరిగి హరితహారం మొక్కలు ఏపుగా పెరుగడాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.



గత ఏడాది ఆగస్టు 15న మల్కాపూర్‌లో కొబ్బరి మొక్క నాటిన సీఎం కేసీఆర్(ఫైల్)



మల్కాపూర్ రాక్‌గార్డెన్‌లో సీఎం కేసీఆర్ నాటిన కొబ్బరి మొక్క ప్రస్తుత దృశ్యం



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్క నాటి నీళ్లు పోస్తున్న వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో అటవీశాఖ అధికారులతో కలిసి మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ కృష్ణభాస్కర్

## సిరిసిల్లలో మొక్కల పండుగ

- ఒక్కరోజే నాటిన మొక్కలు.. 12.57 లక్షలు
- మెగా ప్లాంటేషన్ విజయవంతం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఐదో విడత హరితహారంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా మెగాప్లాంటేషన్‌ను బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛందసంస్థలను భాగస్వామ్యం చేసి ఒక్కరోజే పదిలక్షల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని కలెక్టర్ విధించారు. డీఆర్డీఏ 9.81లక్షలు, అటవీశాఖ 80 వేలు, ఉద్యానవనశాఖ 68 వేలు, మైన్స్, జియాలజీశాఖ వెయ్యి, వ్యవసాయశాఖ 1.27 లక్షలు కలిపి మొత్తం లక్ష్యానికి మించి 12.57లక్షల మొక్కలను ఒక్కరోజే నాటారు. రుద్రంగిలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు మొక్కలు నాటారు. నాటిన ప్రతిమొక్కనూ కాపాడాలని పిలుపునిచ్చారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో 29 హెక్టార్లలో అటవీశాఖ ఆధ్వర్యంలో, సారంపల్లిలో అబ్కారీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లాంటేషన్‌లో కలెక్టర్ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెగా ప్లాంటేషన్ విజయవంతమైందన్నారు. మొక్కల సంరక్షణలో రాష్ట్రంలో మొదటిస్థానంలో జిల్లా ఉన్నదని, అదే స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, డీఆర్డీవో పీడీ రవీందర్, అటవీశాఖఅధికారి వేణుగోపాల్, జెడ్పీ సీఈవో గౌతంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సింగరేణి @ 1.94 లక్షల మొక్కలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ ఆదేశాలు, సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచనలతో ఈ ఏడాది హరితహారంలో కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో సింగరేణి సంస్థ ముందుకుపోతున్నది. బుధవారం ఒకే రోజు సింగరేణి ఏరియాలో 1.94 లక్షల లక్షల మొక్కలునాటి రికార్డు సృష్టించింది. ప్రధానంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఇందారం, టేకుమట్ల రిజర్వు ఫారెస్టు భూముల్లో 9,886 మందితో పెద్ద ఎత్తున 1,59,876 మొక్కలు నాటారు. సింగరేణి నర్సరీ మొక్కలను వినియోగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రామగుండం సీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని రిజర్వ్‌ఫారెస్ట్ భూముల్లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావు తదితరులు కూడా ఉన్నారు.

# స్తంభించిన వైద్యసేవలు

- ఎన్‌ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్యుల సమ్మె
- రోగులకు తీవ్ర ఇబ్బందులు





హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ముందు ధర్నా చేస్తున్న వైద్యవిద్యార్థులు

**న్యూఢిల్లీ, జూలై 31:** జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం దేశవ్యాప్తంగా వైద్యులు సమ్మెబాట పట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) 24 గంటల బంద్ పిలుపు మేరకు ఓపీ, సాధారణ వైద్యసేవల్లో పాల్గొనకుండా నిరసన వ్యక్తం చేశారు. దీంతో దేశవ్యాప్తంగా చాలా దవాఖానల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుజరాత్‌లో 28వేల మందికిపైగా వైద్యులు ఈ సమ్మెలో పాల్గొన్నట్టు ఐఎంఏ- గుజరాత్ విభాగం పేర్కొంది. వైద్యులు చేపట్టిన సమ్మెతో పశ్చిమ బెంగాల్‌లో వైద్య సేవలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ఐఎంఏ ఇచ్చిన పిలుపుతో రాష్ట్ర ప్రభుత్వం నడుపుతున్న దవాఖానల్లో పనిచేస్తున్న వైద్యులు కూడా సమ్మెలో పాల్గొనడంతో మాల్దా, ముర్షిదాబాద్, హుగ్లీ జిల్లా దవాఖానల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఎయిమ్స్, సఫ్దర్‌జంగ్ దవాఖాన, ఆర్‌ఎంఎల్ సహా పలు ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు నిలిచిపోయాయి. నిరవధిక సమ్మెలో రెసిడెంట్ వైద్యులు పాల్గొనడంతో అత్యవసర సేవలు సహా పలు వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమ్మె ప్రభావం రాజస్థాన్ రాజధాని జైపూర్ నగరాన్ని కూడా తాకింది. సమ్మెలో జైపూర్‌లోని ప్రైవేటు, నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొన్నారు. భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ సోమవారం ఆమోదించింది. సుమారు మూడు లక్షల మంది వైద్యులు, వైద్య విద్యార్థులు సభ్యులుగా ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. వైద్య రంగానికి హానికలిగించేలా ఈ బిల్లులో నిబంధనలకు మార్పులు చేశారని ఆరోపించింది.

**రోగులకు ఇబ్బంది కలుగకుండా తెలంగాణ వైద్య శాఖ ప్రత్యామ్నాయ చర్యలు**

జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) బిల్లుకు వ్యతిరేకంగా తెలంగాణలోని కార్పొరేట్ దవాఖానల్లోని వైద్యులతోపాటు, జూనియర్ డాక్టర్లు, బోధనాసుపత్రులకు చెందిన వైద్య విద్యార్థులు ఓపీ, సాధారణ వైద్యసేవల్లో పాల్గొనకుండా బుధవారం ఆందోళన చేపట్టారు. నిమ్స్ సహా రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో, కార్పొరేట్ దవాఖానల్లో వైద్యులు ఓపీ సేవలకు దూరంగా ఉన్నారు. కార్పొరేట్ దవాఖానలు, బోధనాసుపత్రులకు చెందిన వైద్య విద్యార్థులు నిరసనలో పాల్గొన్నట్లు ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి సంజీవ్ సింగ్ యాదవ్ తెలిపారు. వైద్యసేవలకు ఆటంకం కలుగకుండా వైద్యశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. రోగులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు ఫోన్‌లో ఆదేశించారు.

## 'ఆనంద జీవనం' పాఠాలు అవసరం

- జ్యుడీషియల్ అకాడమీలో బోధించాలి: గొగోయ్ సూచన

**న్యూఢిల్లీ:** 'ఆనందంగా ఎలా ఉండాలి?' అనే తరగతులను దేశవ్యాప్తంగా అన్ని జ్యుడీషియల్ అకాడమీలలో ప్రారంభించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ ప్రతిపాదించారు. 'ఆనందంగా ఎలా ఉండాలి?' అనే అంశాన్ని ఢిల్లీ ప్రభుత్వం అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది కాలంగా ఒక సబ్జెక్టుగా బోధిస్తున్నది. ఈ కార్యక్రమం చేపట్టి ఏడాది గడిచిన సందర్భంగా బుధవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో గొగోయ్ పాల్గొన్నారు. 'ఆనందంగా ఎలా ఉండాలో తరగతి గదుల్లో బోధించాలనుకోవడం అద్భుతమైన భావన అని అభినందించారు. అందరం సంతోషంగా ఉంటే వివాదాలు తగ్గుతాయని, ఆనందంగా ఎలా ఉండాలో ప్రజలకు నేర్పిస్తే.. కొన్నేండ్లుగా పెండింగులో ఉన్న వ్యాజ్యాలు కూడా పరిష్కారం అవుతాయన్నారు.

## నక్సల్స్ దళాల్లో పిల్లలు.. ఐరాస ఆందోళన

**ఐరాస, జూలై 31:** భారత్‌లో హిజ్బుల్ ముజాహిదీన్, లష్కరే తాయిబా వంటి ఉగ్రవాద సంస్థలతోపాటు నక్సలైట్లు తమ సంస్థల్లో పిల్లలను చేర్చుకోవడంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. నేరగాళ్లను చట్టం ముందు నిలబెట్టాలని భారత ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు 'పిల్లలు, సాయుధ ఘర్షణలపై ప్రధాన కార్యదర్శి వార్షిక నివేదిక' పేరిట 2018 ఏడాదిగానూ రూపొందించిన నివేదికను మంగళవారం విడుదల చేశారు. ప్రభుత్వం, సాయుధ సంస్థల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో బాలలు బలైపోతున్నారని గుటెరస్ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ద్వారా బాలల రక్షణకు భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఆయన ప్రశంసించారు. అయితే జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద సంస్థలు పిల్లలను రిక్రూట్ చేసుకుంటున్నట్లు తమకు నివేదికలు వస్తున్నాయని చెప్పారు. 14 ఏండ్లలోపున్న ఐదుగురు బాలలను హిజ్బుల్ ముజాహిదీన్ (ఇద్దరు), అన్సర్ ఘజ్వత్ ఉల్ హింద్ (ఒకరు), లష్కరే తాయిదా(ఇద్దరు) సంస్థలు నియమించుకున్నట్లు నివేదికలు అందాయని పేర్కొన్నారు. అలాగే మావోయిస్టులు వ్యవస్థీకృతంగా పిల్లలను నియమించుకోవడం కొనసాగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జమ్ము కశ్మీర్‌లోని కతువా జిల్లాలో ఎనిమిదేండ్ల బాలికపై దారుణంగా లైంగికదాడి జరిపి హత్య చేసిన ఘటనను కూడా నివేదికలో ప్రస్తావించారు. కాగా, భారత్‌లో పులుల సంఖ్య పెరుగడం మంచి పరిణామమని గుటెరస్ అధికార ప్రతినిధి వ్యాఖ్యానించారు.

# 'ట్రాఫిక్' ఉల్లంఘిస్తే వాతే!

- నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు
- మోటర్ వాహనాల సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం
- రాష్ట్రాల రెవెన్యూ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోం
- చట్టం అమల్లోకి వస్తే డీలర్ల స్థాయిలోనే వాహనాల రిజిస్ట్రేషన్
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



**న్యూఢిల్లీ:** రోడ్డు భద్రతను మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలను మరింత కఠినతరం చేసేందుకు ఉద్దేశించిన మోటర్ వాహనాల (సవరణ) బిల్లు-2019కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. బిల్లుకు అనుకూలంగా 108, వ్యతిరేకంగా 13 ఓట్లు వచ్చాయి. కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మూడు సవరణలను ప్రతిపాదించారు. జూలై 23నే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా, రాజ్యసభలో పలు సవరణల నేపథ్యంలో మళ్లీ దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. బిల్లుపై జరిగిన చర్చకు గడ్కరీ సమాధానమిస్తూ.. రాష్ట్రాల ఆందోళనలను తోసిపుచ్చారు. అధికారుల పోస్టింగ్‌తోపాటు వాహన రిజిస్ట్రేషన్ చార్జి విధించే హక్కుతో సహా రాష్ట్రాల హక్కులను ఏ ఒక్కటినీ కేంద్రం లాగేసుకోదని స్పష్టం చేశారు. రాష్ట్ర రెవెన్యూ నుంచి ఒక్క రూపాయిని కూడా కేంద్రం తీసుకోదని నొక్కి చెప్పారు. అలాగే డ్రైవింగ్ శిక్షణ సంస్థల ఏర్పాటుకు రాష్ట్రాలకు గల హక్కుల్లో కూడా ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. వివిధ ట్రాఫిక్ సంబంధిత నేరాలకు కఠిన శిక్షలు విధించడంతోపాటు భారీ జరిమానాలు విధించేలా బిల్లులో ప్రతిపాదనలున్నాయి. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబానికి రూ.5 లక్షల పరిహారంతోపాటు తీవ్రంగా గాయపడినవారికి రూ.2.5 లక్షలను నిందితుడు చెల్లించాల్సి ఉంటుంది. అత్యవసర వాహనాలకు దారివ్వకపోయినా, మద్యం సేవించి వాహనం నడిపినా రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడేవారిలో ఈ బిల్లు భయాన్ని ఏర్పరుస్తుందని గడ్కరీ చెప్పారు. దేశంలో 22-25 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని, దీన్ని అధిగమించేందుకు దేశవ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. ఒక్కో కేంద్రానికి రూ.కోటి సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

**ఆన్‌లైన్ టెస్ట్ పాసయితేనే మంత్రికయినా డ్రైవింగ్ లైసెన్స్..**

డ్రైవింగ్ లైసెన్స్ పొందే ప్రక్రియను ప్రస్తుతం కంప్యూటీకరించామని, మంత్రి అయినా, ఎంపీ అయినా ఆన్‌లైన్ టెస్ట్ పాసయితేనే డ్రైవింగ్ లైసెన్స్ వస్తుందని గడ్కరీ స్పష్టం చేశారు. సరకు, ప్రయాణికుల రవాణాకు మార్గదర్శకాల కోసం జాతీయ రవాణా విధానాన్ని రూపొందించాలని బిల్లు ప్రతిపాదిస్తున్నది. రాష్ట్రాలను సంప్రదించాకే దీన్ని రూపొందించనున్నట్లు గడ్కరీ తెలిపారు. ఈ బిల్లు చట్టంగా మారిన తర్వాత, డీలర్ల స్థాయిలోనే వాహనాలు రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, ప్రభుత్వం బిల్లులను సెలెక్ట్ కమిటీలకు పంపకపోవడంపై ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి. రాజ్యసభ విపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. పార్టీలకు విప్ జారీ చేసే అవకాశం కూడా ఉండడం లేదన్నారు. బిల్లుల ఆమోదానికి ప్రభుత్వం తొందరపడడంపై తృణమూల్ కాంగ్రెస్ నేత డెరెక్‌ఓబ్రెయిన్ స్పందిస్తూ.. తాము పిజ్జాలు డెలివరీ చేస్తున్నామా లేక బిల్లులను పాస్ చేస్తున్నామా అని ప్రశ్నించారు.

## బాంబుదాడిలో 32మంది మృతి

ఆఫ్ఘనిస్థాన్‌లో దుర్ఘటన

**కాబూల్:** ఆఫ్ఘనిస్థాన్‌లో రోడ్డు వెంట అమర్చిన బాంబు పేలడంతో ఓ బస్సులోని 32 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు.15 మంది గాయపడ్డారు. మృతుల్లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నారు. హీరట్, కాందహార్ మధ్య ఉన్న రహదారిపై ప్రయాణిస్తున్న బస్సును లక్ష్యంగా చేసుకున్న దుండగులు రోడ్డు వెంట అమర్చిన బాంబును పేల్చారు. ఈ దాడికి తామే బాధ్యులమని ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించనప్పటికీ తాలిబన్లే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.



బాంబుదాడిలో మరణించిన చిన్నారి మృతదేహంతో స్థానికుడు

## ఏడేండ్ల బాలుడి నోటి నుంచి 526 దంతాలు తొలిగింపు

చెన్నైలో అరుదైన శస్త్రచికిత్స

**చెన్నై, జూలై 31:** చెన్నై డాక్టర్లు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఓ బాలుడి నోటిలో నుంచి 526 దంతాలను తొలిగించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్రచికిత్స జరుగడం ఇదే తొలిసారి అని డాక్టర్లు చెబుతున్నారు. సదరు బాలుడికి మూడేండ్ల వయసు ఉన్నప్పుడు కుడి దవడ కిందిభాగం వాచింది. అయితే బాలుడి వయసు మూడేండ్లు ఉండటంతో డాక్టర్లు శస్త్రచికిత్స జరుపలేదు. ఇప్పుడు ఆ బాలుడి వయసు ఏడేండ్లు. వయసుతోపాటు ఆ వాపు కూడా పెద్దదైంది. దీంతో ఇక లాభం లేదనుకున్న డాక్టర్లు ఇటీవల ఐదు గంటలపాటు శ్రమించి శస్త్రచికిత్స చేశారు. దవడ నుంచి దంతాలు తీస్తున్నకొద్దీ వస్తుండటంతో డాక్టర్లు ఆశ్చర్యపోయారు. ఇలా ఏకంగా 526 దంతాలను వెలికితీశారు. ఈ దంతాలు కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా ఉన్నాయి. శస్త్రచికిత్స జరిగిన మూడు రోజుల తర్వాత బాలుడిని డిశ్చార్జి చేశారు. సవీతా డెంటల్ కాలేజీ, దవాఖానకు చెందిన డాక్టర్ రమణి మాట్లాడుతూ '2014లో ముంబైలో ఇలాంటి శస్త్రచికిత్స ఒకటి జరిగింది. అప్పుడు యుక్తవయసులో ఉన్న ఓ బాలుడి నోటి నుంచి 232 దంతాలను తొలిగించారు. ఇప్పుడు మేము 526 దంతాలను తొలిగించాం. నాకు తెలిసి ప్రపంచంలో ఇలాంటి శస్త్రచికిత్స జరుగడం ఇదే తొలిసారి' అని పేర్కొన్నారు.



బాలుడి నోటి నుంచి తీసిన దంతాలు

## కర్ణాటక స్పీకర్‌గా కగేరి

ఏకగ్రీవంగా ఎన్నికైన బీజేపీ నేత.. సుదీర్ఘకాలంగా ఆరెస్సెస్‌తో అనుబంధం



**బెంగళూరు:** కర్ణాటక అసెంబ్లీ నూతన స్పీకర్‌గా బీజేపీ సీనియర్ నేత, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విశ్వేశ్వర్ హెగ్డే కగేరి బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్ప బలపరీక్షలో నెగ్గిన వెంటనే స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ సోమవారం తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో కొత్త స్పీకర్ ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. స్పీకర్ పదవికి మంగళవారం కగేరి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. కగేరికి వ్యతిరేకంగా కాంగ్రెస్, జేడీఎస్‌లు అభ్యర్థులను నిలుపలేదు. స్పీకర్‌గా మాజీ స్పీకర్ కేజీ బోపయ్యను ఎంపికచేస్తారని ప్రచారం జరిగినా ఆరెస్సెస్ నేపథ్యమున్న కగేరీని బీజేపీ అనూహ్యంగా ఎంపికచేసింది.

## 2022 నాటికి అందరికీ ఇండ్లు: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** దేశంలోని ప్రజలందరికీ 2022 నాటికి నివాస సదుపాయాన్ని కల్పించే లక్ష్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈ లక్ష్యసాధనకు ఉన్న అడ్డంకులన్నింటినీ తొలిగించాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మోదీ.. 'ప్రో యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్' (ప్రగతి) సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' తోపాటు పలు పథకాలు, అంశాలపై ఆయన సమీక్షించారు. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో జలసంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ తగిన చర్యలు చేపట్టాలని, దీంట్లో రాష్ట్రప్రభుత్వాలు ప్రధానపాత్ర పోషించాలని ప్రధాని పేర్కొన్నారు.

## బ్యాంకు భవనం పైకప్పు కూలి ఒకరు మృతి

- 20 మందికి గాయాలు
- మహారాష్ట్రలో దుర్ఘటన

**సోలాపూర్, జూలై 31:** మహారాష్ట్రలో ఓ బ్యాంకు భవనం పైకప్పు కుప్పకూలడంతో ఒకరు మరణించారు. 20 మంది గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం సోలాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కర్మలా ప్రాంతంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు చెందిన బ్రాంచ్ ఉన్నది. అయితే మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఈ బ్యాంకు భవనం పై కప్పు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో కొందరు ఉద్యోగులు, వినియోగదారులు బయటికి పరుగులు తీశారు. దాదాపు 20 మంది శిథిలాల కింద చిక్కుకొని గాయాలపాలుకాగా వారిలో ఏడుగురిని రక్షించి దవాఖానకు తరలించారు. మిగిలిన వారిని కూడా సురక్షితంగా బయటికి తీసుకురావడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు పైకప్పు బాగా తడిచి కుప్పకూలినట్లు తెలుస్తున్నది.

# ఆహారానికి మతం లేదు

### మతవివక్ష చూపిన వినియోగదారుడికి జొమాటో జవాబు




**న్యూఢిల్లీ:** తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్టు.. దేశంలో మతోన్మాదం విషం విస్తరిస్తూ చివరికి తినే ఆహారానికీ అంటుకున్నది. తాజాగా ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ 'జొమాటో'కు ఇలాంటి ఓ అనుభవం ఎదురుకాగా.. సంస్థ స్పందన నెటిజన్ల మనసు దోచుకుంటున్నది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో నివాసం ఉంటున్న అమిత్ శుక్లా అనే ఓ వినియోగదారుడు మంగళవారం రాత్రి జొమాటోలో ఫుడ్ ఆర్డర్ చేశాడు. ఆ ఆహారాన్ని ఓ ముస్లిం రైడర్ (డెలివరీ బాయ్) తీసుకొస్తున్నట్టు అతడికి మెసేజ్ వచ్చింది. అమిత్ శుక్లా తనకు 'హిందూ వ్యక్తి' మాత్రమే ఆర్డర్ తీసుకురావాలని, రైడర్‌ను మార్చాలని జొమాటోను కోరాడు. రైడర్‌ను మార్చడం కుదురదని, ఆర్డర్ రద్దు చేస్తే డబ్బు కూడా వాపస్ రాదని సంస్థ సమాధానం ఇచ్చింది. అమిత్ ఆ ఆర్డర్‌ను రద్దు చేశారు. 'నాకు హిందూయేతర రైడర్ ఆహారం తీసుకురావొద్దని చెప్పినా జొమాటో నిరాకరించింది. ఆహారం తీసుకోవాల్సిందేనని చెప్పడంతో నేను ఆర్డర్ రద్దు చేశాను. నాకు కలిగిన అసౌకర్యంపై నా న్యాయవాదులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటా' అని ట్వీట్ చేశాడు. దీనికి జొమాటో సంస్థ ధీటైన సమాధానం ఇచ్చింది. 'ఆహారాన్ని మతానికి ముడిపెట్టొద్దు.. ఆహారమే ఒక మతం' అని ట్వీట్ చేసింది. జొమాటో వ్యవస్థాపకుడు దీపేందర్ గోయల్ తన సంస్థ నిర్ణయానికి మద్దతు పలికారు. కాగా, ఇకపై జొమాటోను మరింత ఇష్టపడుతానని జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు.

# జస్టిస్ శుక్లాపై కేసు నమోదుకు సీజేఐ అనుమతి

**న్యూఢిల్లీ:** అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్ఎన్ శుక్లాపై కేసు నమోదు చేయడానికి సీజేఐ జస్టిస్ రంజన్ గొగోయ్ అనుమతించారు. ఎంబీబీఎస్ ప్రవేశాలకు సంబంధించి ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీకి అనుకూలంగా తీర్పునివ్వడానికి జస్టిస్ శుక్లా లంచం తీసుకున్నట్టు ఆరోపణలున్నాయి. సీబీఐ అధికారులు దర్యాప్తు చేపట్టి, జస్టిస్ రంజన్ గొగోయ్‌కు నివేదిక సమర్పించగా.. ఆయన కేసు నమోదుకు అనుమతి ఇచ్చారు.

# వ్యక్తి ప్రాణాలు కాపాడిన శునకం

- శిథిలాల కింద చిక్కుకున్న వ్యక్తిని గుర్తించడంతో బలగాలు అప్రమత్తం
- సురక్షితంగా వెలికితీత.. జమ్ముకశ్మీర్‌లో ఘటన

**జమ్ము:** జమ్ముకశ్మీర్‌లో ఓ అద్భుతం జరిగింది. కొండ చరియల శిథిలాల కింద చిక్కుకున్న ఓ వ్యక్తిని సీఆర్పీఎఫ్ శునకం గుర్తించడంతో బలగాలు అతడిని వెలికితీశాయి. మంగళవారం రాత్రి రాంబాన్ జిల్లా పరిధిలోని జమ్ము-శ్రీనగర్ రహదారిపై సీఆర్పీఎఫ్ జవాన్లు తనిఖీలు నిర్వహిస్తున్నారు. వారి వెంట 'అజాక్సి' అనే శునకం కూడా ఉన్నది. ఇటీవల కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో అజాక్సి అటుఇటూ కలియతిరిగి.. ఏదో ఉన్నట్లు జవాన్లకు సంకేతాల ద్వారా తెలిపింది. అప్రమత్తమైన జవాన్లు ఆ ప్రాంతాన్ని గాలించగా.. శిథిలాల కింద ఓ మనిషి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే పారలతో మట్టిని తొలిగించి అతడిని బయటికి తీశారు. దవాఖానకు తరలించారు. అతడికి చెవులు సరిగా వినిపించవని, దీంతో కొండ చరియలు విరిగి మీద పడుతున్నా గుర్తించలేకపోయాడని అధికారులు తెలిపారు. బాధితుడు ఇంకా షాక్ నుంచి కోలుకోలేదని, ప్రస్తుతం మాట్లాడలేకపోతున్నాడన్నారు.



శిథిలాల కింద చిక్కుకున్న బాధితుడిని రక్షిస్తున్న జవాన్లు, అజాక్సి (శునకం)

# సిద్ధార్థను బలిచేశారు!

- స్వేచ్ఛాయుత ఆర్థికవ్యవస్థ కోసం ఓటేసినవారికి మోదీ ద్రోహం చేశారు
- ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు.. ఈజ్ ఆఫ్ ఎండింగ్ బిజినెస్
- పారిశ్రామికవేత్తలపై ప్రభుత్వ సంస్థల నుంచి వేధింపులు: విపక్షాల ధ్వజం



వీ జీ సిద్ధార్థ

**న్యూఢిల్లీ:** కేఫ్ కాఫీడే వ్యవస్థాపకుడు, కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ అల్లుడు వీ జీ సిద్ధార్థ మృతిపై పలువురు రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ.. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'సమస్యలు లేని స్వేచ్ఛాయుత బలమైన ఆర్థిక వ్యవస్థను కోరుకొని ప్రధాని మోదీకి ఓటేసిన వాళ్ల నమ్మకానికి ఆయన ద్రోహం చేశారు' అని ట్వీట్ చేశారు. వైఫల్యమైన ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న నిరుద్యోగం, విఫలమైన మౌలిక సదుపాయాల కల్పన, రైతుల ఆత్మహత్యలు, శాంతి భద్రతల వైఫల్యం వంటి అతి ముఖ్యమైన అంశాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మెజారిటీ, మైనారిటీ, కశ్మీర్, పాకిస్థాన్, ముస్లిం మహిళ, రామ్, ఆఖరికి మ్యాన్ వర్సెస్ వైల్డ్ (డిస్కవరీ ఛానల్ కార్యక్రమం) వంటి అంశాలను మోదీ తెరపైకి తీసుకువస్తున్నారని నిప్పులు చెరిగారు. సిద్ధార్థ మరణంపై మరో కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందిస్తూ.. 'బీజేపీ హయాంలో 'సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)' కాస్త 'సులభంగా వ్యాపారాన్ని మూసేసే (ఈజ్ ఆఫ్ ఎండింగ్ బిజినెస్)' స్థాయికి దిగజారింది. ఇందుకు సిద్ధార్థ విషాదమే ఓ ఉదాహరణ. ఇది చాలా ఆందోళనకరం' అని ట్వీట్ చేశారు. మరోవైపు, ప్రభుత్వ వేధింపులతోనే సిద్ధార్థ చనిపోయారని కర్ణాటక కాంగ్రెస్ ఆరోపించింది.

**దర్యాప్తు సంస్థల ఒత్తిడివల్లే.. మమత**

కేఫ్ కాఫీడే యజమాని సిద్ధార్థ విషాద మరణం అత్యంత దురదృష్టకరమని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. 'సిద్ధార్థ మరణం తీవ్రమైన షాక్‌కు గురిచేసింది. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం వివిధ సంస్థల నుంచి ఆయన వేధింపులు ఎదుర్కోవడంతో ఒత్తిడికి గురైనట్లు తెలుస్తున్నది. దేశంలో అనేక పరిశ్రమల యజమానులు ఒత్తిడితో ఉన్నారు. కొంతమంది దేశాన్ని విడిచి వెళ్లిపోతుంటే, మరికొంతమంది ఒత్తిళ్ల నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నారు' అని మమత ట్వీట్లు చేశారు. సిద్ధార్థ మృతిపై ఆయనకు అత్యంత సన్నిహితుడు, శృంగేరి ఎమ్మెల్యే టీడీ రాజే గౌడ స్పందించారు. ఆదాయపు పన్ను శాఖ వేధింపులతోనే ఆయన మరణించినట్టు ఆరోపించారు. ఆయనకున్న ఆస్తులతో పోలిస్తే, అప్పులు తక్కువేనని ఆయన అన్నారు.



"సిద్ధార్థ ఆకస్మిక మరణం విచారకరం. ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసింది. కొన్నేండ్ల క్రితం ఆయనను కలిసే అవకాశం లభించింది. ఆయన స్నేహపూర్వకమైన వ్యక్తి, జెంటిల్‌మెన్. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కేఫ్ కాఫీడే మరింత బలంగా ఉండాలి.

– టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# జల వివాదాలకు రెండేండ్లలో పరిష్కారం!

- నూతన 'అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల బిల్లు'కు లోక్‌సభ ఆమోదం
- సభలో ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్
- వివాదాల పరిష్కారంలో ప్రస్తుత ట్రిబ్యునళ్లు విఫలమయ్యాయని వ్యాఖ్య
- తాజా బిల్లులో వివాద పరిష్కారానికి గరిష్ఠ గడువు రెండేండ్లు
- బిల్లు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించిన ప్రతిపక్షాలు



గజేంద్రసింగ్




**న్యూఢిల్లీ, జూలై 31:** నదీజలాల విషయంలో రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలు రెండేండ్లలోనే పరిష్కారమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు నిర్దిష్ట నిబంధనలను పొందుపరుస్తూ కేంద్ర ప్రభుత్వం 'అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల బిల్లు-2019'ను రూపొందించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 'అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల బిల్లు-1956' స్థానంలో రూపొందించిన ఈ బిల్లును బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ దీనిని సభలో ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటు ద్వారా సభ ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం దేశం మొత్తం ఒకే ట్రిబ్యునల్ ఉంటుంది. దీనికి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చైర్మన్‌గా ఉంటారు. రాష్ట్రాల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా బెంచ్‌లను ఏర్పాటుచేస్తారు. రెండేండ్లలోగా ఆయా బెంచ్‌లు జల వివాదాలను పరిష్కరించాల్సి ఉంటుంది. కాగా బిల్లును రూపొందించేముందు రాష్ట్రాలను సంప్రదించలేదని ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్షాలు తెలిపాయి.

**ప్రస్తుత ట్రిబ్యునళ్లు విఫలం**

బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ.. రాష్ట్రాల మధ్య నదీజలాల వివాదాలను పరిష్కరించడంలో ప్రస్తుతం ఉన్న ట్రిబ్యునళ్లు విఫలం అయ్యాయన్నారు. కొన్ని ట్రిబ్యునళ్లు 33 ఏండ్లు గడుస్తున్నా వివాదాలను పరిష్కరించలేకపోయాయని ఉదహరించారు. ఈ నేపథ్యంలో మార్పు తప్పనిసరి అయ్యిందన్నారు. ఏండ్లుగా నలుగుతున్న వివాదాలను పరిష్కరించడమే నూతన బిల్లు ప్రధాన లక్ష్యమని, అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ప్రతిపక్షాల ఆరోపణలపై స్పందిస్తూ.. 'కేంద్రం 2013లో బిల్లును రూపొందించేముందు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలను సంప్రదించింది. గత ప్రభుత్వం ముసాయిదా బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపింది. బిల్లుకు తుదిరూపు ఇచ్చేముందు వివిధ మార్గాల ద్వారా వచ్చిన సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకున్నది' అని స్పష్టంచేశారు. అయితే 16వ లోక్‌సభ గడువు ముగిసిపోవడంతో బిల్లు రద్దయిందని, ఈ నేపథ్యంలో బిల్లును మరోసారి ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రపంచ జనాభాలో భారతదేశ వాటా 18శాతంగా ఉన్నదని, కానీ తాగునీటి లభ్యత ప్రపంచ సగటుతో పోల్చితే నాలుగు శాతం మాత్రమే ఉన్నదని చెప్పారు. 'వాతావరణ మార్పుల ఫలితంగా జల వివాదాలు పెరుగుతున్నాయి. నీళ్లను కొలిచి వాడుకోవాల్సిన రోజులు వస్తాయి. కాబట్టి వీలైనంత త్వరగా రాష్ట్రాల వాటాలను చట్టబద్ధంగా తేల్చాల్సిన అవసరం ఉన్నది. అదే సమయంలో భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి. 2050 నాటి అవసరాలకు అనుగుణంగా ఇప్పుడు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు. తాజా చట్టం ప్రకారం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ట్రిబ్యునల్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి బెంచ్‌లను ఏర్పాటుచేస్తారు. ఒక్కో బెంచ్‌కు ఒక్కో బాధ్యతను అప్పగిస్తారు. ఇందులో విశ్రాంత న్యాయమూర్తులను, సాగునీటి రంగ నిపుణులను సభ్యులుగా తీసుకుంటారు. వివాదం పరిష్కారం కాగానే ఆ బెంచ్ రద్దవుతుంది. ఒక వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ గరిష్ఠంగా రెండేండ్లలో తీర్పును వెలువరించాలి. తీర్పు వెలువడిన వెంటనే వాటాలను నిర్ణయిస్తూ నోటిఫికేషన్ విడుదలవుతుంది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలు ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంటూ కేంద్రాన్ని కోరాలి. కేంద్రం అవసరం అనుకుంటే ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతం దేశంలో నదీజల వివాదాలకు సంబంధించి తొమ్మిది ట్రిబ్యునళ్లు ఉన్నాయి. కృష్ణా, కావేరి, మహాదాయి, రావి, బియాస్ తదితర ట్రిబ్యునళ్లు ఉన్నాయి.

### రాష్ట్రాలకు ప్రాధాన్యం లేదు

నూతన 'అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల బిల్లు'లో రాష్ట్రాలకు సరైన ప్రాధాన్యం దక్కలేదని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రతిపక్షాలు విమర్శించాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయి. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ ఈ బిల్లులో రాష్ట్రాలతో సంప్రదింపుల ప్రస్తావనే లేదని.. ఇది రాజ్యాంగంపై దాడి చేయడమేనని ఆరోపించారు. జల వివాదాలు సంక్లిష్టంగా ఉంటాయని, వాటిని పరిష్కరించడానికి సమయం పడుతుందని చెప్పారు. తాజా బిల్లులో ట్రిబ్యునల్ బాధ్యతలను పూర్తిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తికి అప్పగించారని, సిట్టింగ్ జడ్జిలకు, ప్రతిపక్ష నేతలకు అవకాశం లేకుండా పోయిందని విమర్శించారు. బీజేపీ ఎంపీ సత్యపాల్ సింగ్ మాట్లాడుతూ సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరించాలనే ఆలోచన కేంద్రానికి లేదని స్పష్టం చేశారు. సాగునీటి రంగ నిపుణులను ట్రిబ్యునళ్లలో భాగస్వాములుగా చేయడం సరైన నిర్ణయమంటూ అభినందించారు. వివాదాలను నిర్ణీత సమయంలో పరిష్కరించడం దేశాభివృద్ధికి ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు. డీఎంకే ఎంపీ దయానిధి మారన్ మాట్లాడుతూ ట్రిబ్యునళ్లు ఇచ్చే తీర్పులకు రాష్ట్రాలు కట్టుబడి ఉండేవరకు సమస్య పరిష్కారం కాదన్నారు. కావేరీ జలాల విషయంలో ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును కర్ణాటక ప్రభుత్వం పదేపదే ఉల్లంఘిస్తున్నదని, ఫలితంగా తమిళనాడు ప్రజలు దీర్ఘకాలంగా అవస్థలు పడుతున్నారని గుర్తుచేశారు. కాబట్టి నదులను జాతీయం చేయాలని సూచించారు.



మనీశ్ తివారీ

# ఆజంఖాన్ కొడుకు అరెస్ట్

**లక్నో:** సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఆజంఖాన్ కుమారుడు ఎమ్మెల్యే అబ్దుల్లా ఆజంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమ కాలేజీ నుంచి దాదాపు 9,000 పుస్తకాలను దొంగిలించి మహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీకి తరలించారని ఆరోపిస్తూ రామ్‌పూర్‌లోని ఓరియంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ జుబేర్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం జౌహర్ యూనివర్సిటీ లైబ్రరీలో తనిఖీలు నిర్వహించారు. విషయం తెలిసిన అబ్దుల్లా ఆజం అక్కడికి చేరుకొని అధికారులను అడ్డుకున్నారు. దీంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎంతో అరుదైన 2,500 పుస్తకాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు అబ్దుల్లాను అదుపులోకి తీసుకున్న విషయం తెలియగానే సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగారు. పోలీసులు మాట్లాడుతూ అబ్దుల్లాను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశామని చెప్పారు. కాగా జౌహర్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడైన ఆజంఖాన్ దానికి చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు.



అబ్దుల్లా ఆజం

# 'సుప్రీం' జడ్జీల సంఖ్య పెంపు

- సల్ఫర్ ఎరువు సబ్సిడీ పెంపునకు ఆమోదం
- చిట్‌ఫండ్స్ సంస్థల నియంత్రణ బిల్లుకు ఓకే
- జమ్ము కశ్మీర్‌లో 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు



**న్యూఢిల్లీ, జూలై 31:** సుప్రీంకోర్టులో నానాటికీ పెండింగ్ కేసులు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగోయ్ విజ్ఞప్తి మేరకు అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీల సంఖ్యను ప్రస్తుతమున్న 31 నుంచి 34కు (సీజేఐతో కలిపి) పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీ అనంతరం కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ మీడియాకు వివరాలను వెల్లడించారు. బిల్లుకు పార్లమెంట్ ఆమోదం అనంతరం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య సీజేఐతో కలిపి 34కు పెరుగనుందని చెప్పారు. జూలై 11న కేంద్ర న్యాయ శాఖ రాజ్యసభలో ఓ ప్రశ్నకు రాతపూర్వక సమాధానమిస్తూ.. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 59,331 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపింది. న్యాయమూర్తుల కొరత కారణంగా ముఖ్యమైన కేసులకు సంబంధించి రాజ్యాంగ ధర్మాసనాలను ఏర్పాటు చేయలేకపోతున్నట్లు సీజేఐ పేర్కొన్నారు. '1988లో సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 18 నుంచి 26కు పెంచారు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు 2009లో ఆ సంఖ్య 31కి చేరుకున్నది. ప్రజలకు సకాలంలో న్యాయాన్ని అందించాలన్న సుదూర లక్ష్యాన్ని చేరుకునేందుకు, సమర్థమైన సేవలు అందించేందుకు వీలుగా న్యాయమూర్తుల సంఖ్యను పెంచే అంశాన్ని ప్రథమ ప్రాధాన్యంగా గుర్తించాలని మీకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని ప్రధానికి రాసిన లేఖలో సీజేఐ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో క్యాబినెట్ సానుకూల నిర్ణయం తీసుకుంది.

**సల్ఫర్ సబ్సిడీ పెంపు**

ఎరువుల వినియోగంలో సమతుల్యతను ప్రోత్సహించడంలో భాగంగా సల్ఫర్‌పై సబ్సిడీని కిలోకు రూ.3.5కు పెంచినట్లు జవదేకర్ తెలిపారు. ఇతర యూరియాయేతర ఎరువుల సబ్సిడీలో మార్పు లేదని చెప్పారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి గానూ యూరియాయేతర ఎరువులపై సబ్సిడీ రూ.22,875.5 కోట్లుగా ఉండనున్నట్లు వెల్లడించారు. 'దేశంలో యూరియాను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే వ్యవసాయానికి ఎన్‌పీకేఎస్ (నైట్రోజన్, ఫాస్ఫేటిక్, పొటాసిక్, సల్ఫర్) ఎరువులు కూడా అంతే అవసరం. సల్ఫర్‌పై సబ్సిడీని కిలోకు రూ.2.72 నుంచి 3.56కు పెంచాం' అని తెలిపారు. నైట్రోజన్‌పై కిలోకు రూ.18.90, ఫాస్పరస్‌పై రూ.15.11, పొటాష్‌పై రూ.11.12 చొప్పున ఇస్తున్న సబ్సిడీలో మార్పు లేదన్నారు.

**చిట్‌ఫండ్ సంస్థలపై తగ్గనున్న భారం**

రిజిస్టర్ అయిన చిట్‌ఫండ్ సంస్థలపై రెగ్యులేటరీ భారాన్ని తగ్గించేందుకు, వినియోగదారుల ప్రయోజనాలను రక్షించేందుకు ఉద్దేశించిన చిట్‌ఫండ్స్ (సవరణ) బిల్లు-2019ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. చిట్ ఫండ్ రంగాన్ని నియంత్రించేందుకు 2018లో ప్రభుత్వం ఓ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, అది మురిగిపోయింది. 2018 మార్చిలో ఆ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా, పరిశీలన కోసం స్థాయీ సంఘానికి పంపారు. వినియోగదారులకు ఇన్సూరెన్స్ కవరేజీ కల్పించడంతోపాటు పలు సవరణలను ఆ కమిటీ సూచించింది.

**రష్యాలో ఇస్రో సాంకేతిక అనుసంధాన విభాగం**

రష్యాలోని మాస్కోలో ఇస్రో సాంకేతిక అనుసంధాన విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ అంగీకరించింది. ఇస్రో పరిశోధనలకు సంబంధించి రష్యాతోపాటు, ఇతర సరిహద్దు దేశాలతో ఎప్పటికప్పుడు సాంకేతిక అంశాలపై సమన్వయం చేసుకునేందుకు ఈ యూనిట్ తోడ్పడనుంది. దీనికి ఏడాదికి రూ.1.5 కోట్లు వ్యయం కానుందని అంచనా.

### జమ్ముకశ్మీర్ రిజర్వేషన్ సవరణ బిల్లుకు ఆమోదం

జమ్ము కశ్మీర్‌లో నివసించే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు జమ్ము కశ్మీర్ రిజర్వేషన్ (రెండో సవరణ) బిల్లు-2019కు అంగీకారం తెలిపింది. ప్రస్తుతమున్న రిజర్వేషన్లకు ఇవి అదనం.

### ఓబీసీ ప్యానెల్ గడువు పెంపు

కేంద్ర జాబితాలోని ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ఉప వర్గీకరణపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన ఐదుగురు సభ్యుల కమిషన్ గడువును క్యాబినెట్ మరో ఆరునెలలు పొడిగించింది. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రోహిణి నేతృత్వంలో 2017 అక్టోబర్‌లో ఏర్పాటైన ఈ కమిషన్ గడువును పొడిగించడం ఇది ఏడోసారి. జూలై 31తో కమిషన్ గడువు ముగియాల్సి ఉండగా, దాన్ని 2020 జనవరి 31 వరకు కేంద్రం పొడిగించింది. గడువు పొడిగింపు వల్ల అన్ని భాగస్వామ్య పక్షాలతో చర్చించి ఉప వర్గీకరణపై సమగ్ర నివేదికను అందించేందుకు కమిషన్‌కు వీలు కలుగుతుందని ప్రభుత్వం పేర్కొంది.

# సబ్సిడీ రహిత సిలిండర్ 62.50 తగ్గింపు

**న్యూఢిల్లీ:** సబ్సిడీ రహిత వంట గ్యాస్ సిలిండర్లను వాడుతున్న వినియోగదారులకు ఐవోసీ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) శుభవార్త చెప్పింది. సబ్సిడీలేని సిలిండర్ ధరను రూ.62.50 మేర తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ధరలు బుధవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్, గ్యాస్ ధరలు తగ్గడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం సబ్సిడీలేని సిలిండర్ ధర రూ.637గా ఉన్నది. తాజా నిర్ణయంతో ఈ ధర రూ.574.50కు తగ్గనున్నది. జూలై ఆరంభంలో సబ్సిడీరహిత సిలిండర్ ధరను రూ.100.50 తగ్గిస్తున్నట్టు ఐవోసీ వెల్లడించింది. తాజా తగ్గింపుతో వరుసగా రెండు నెలల్లో సబ్సిడీలేని సిలిండర్ ధర రూ.163 తగ్గినట్టు అయ్యింది.



కోల్‌కతాలో కుల్దీప్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నిరసనకారులు

# కుల్దీప్ సింగ్‌పై సీబీఐ కేసు నమోదు

- మరో పదిమంది నిందితులపైనా..
- ఉన్నావ్ బాధితురాలి లేఖపై స్పందించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** ఉన్నావ్ లైంగికదాడి బాధితురాలి రోడ్డు ప్రమాదం కేసులో ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెన్‌గర్‌తో పాటు మరో పది మందిపై హత్య ఆరోపణల కింద సీబీఐ బుధవారం కేసులు నమోదు చేసింది. ప్రమాదం జరిగిన రాయ్‌బరేలీ జిల్లాలోని గురుబక్ష్‌గంజ్‌కు చేరుకొన్న సీబీఐ ప్రత్యేక బృందం కేసు దర్యాప్తును ప్రారంభించింది. 'వేగవంతమైన కేసు విచారణ కోసం సీబీఐ ఓ ప్రత్యేక బృందాన్ని నియమించింది' అని సీబీఐ ప్రతినిధి తెలిపారు. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఎఫ్ఐఆర్‌లను తిరిగి నమోదు చేసినట్టు సీబీఐ పేర్కొంది. మరోవైపు, తనకు ప్రాణహాని ఉందంటూ ఉన్నావ్ బాధితురా(19) కుటుంబం రాసిన లేఖను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నది. దీనిపై గురువారం విచారణ జరుపడానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని ధర్మాసనం అంగీకరించింది. లేఖ గురించి బుధవారం పత్రికల్లో చదివేవరకు తనకు తెలియదని గొగొయ్ తెలిపారు. లేఖను ఆలస్యంగా ధర్మాసనం ముందుకు తీసుకురావడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. దీనిపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. బాధితురాలి ఆరోగ్యపరిస్థితిపై నివేదికను గురువారంలోపు సమర్పించాలని ఉత్తర్‌ప్రదేశ్ అధికారులను ఆదేశించారు. కాగా ఆదివారం జరిగిన కారు ప్రమాదంలో మరణించిన ఉన్నావ్ బాధితురాలి చిన్నమ్మ పుష్ప మృతదేహానికి బుధవారం దహన సంస్కారాలు నిర్వహించారు.

**దద్దరిల్లిన లోక్‌సభ**

ఉన్నావ్ బాధితురాలి కేసుపై బుధవారం లోక్‌సభ మళ్లీ దద్దరిల్లింది. ఈ విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని పట్టుబడుతూ విపక్ష పార్టీలు సభ నుంచి వాకౌట్ చేశాయి. మరోవైపు, లక్నో దవాఖానలో చికిత్స పొందుతుతున్న ఉన్నావ్ బాధితురాలిని మెరుగైన చికిత్స కోసం విమానంలో ఢిల్లీకి తీసుకురావాలని ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్‌ను ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్ కోరారు.

# 'ఈడబ్ల్యూఎస్' పిటిషన్లపై తీర్పు రిజర్వ్

- రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై నిర్ణయం వాయిదా
- స్టే ఇచ్చే అంశాన్ని తర్వాత పరిశీలిస్తామన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం తీసుకువచ్చిన 103వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసే అంశంపై సుప్రీంకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ రిజర్వేషన్లపై తాత్కాలిక స్టే ఇచ్చే అంశాన్ని ఆ తర్వాత పరిశీలిస్తామని తెలిపింది. ఈడబ్ల్యూఎస్ కోటాను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం విచారణ జరిపిన జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. కేంద్రం తరపున అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏండ్లు పూర్తయినా ఇప్పటికీ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 20 కోట్ల మంది ప్రజల అభ్యున్నతి కోసం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను తీసుకువచ్చినట్లు కోర్టుకు తెలిపారు. వారికి చేయూతనివ్వొద్దని ఏ ఒక్కరూ అభ్యంతరం తెలుపలేదని, ఈ నేపథ్యంలో పార్లమెంట్ వారి అభ్యున్నతికి ముందడుగు వేసిందని చెప్పారు. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదని పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలు అవాస్తవమని కొట్టివేశారు. తమిళనాడులో 68 శాతం రిజర్వేషన్లు ఉన్నాయని, ఆ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హైకోర్టు కూడా సమర్థించిందని చెప్పారు. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు కూడా స్టే ఇవ్వలేదని గుర్తు చేశారు. ఓ పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్ మంగళవారం వాదనలు వినిపిస్తూ.. ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయని, ఒకటి, రిజర్వేషన్ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయడం, రెండోది, తాత్కాలిక స్టే విధించడం. అలాగే 103 రాజ్యాంగ సవరణ చట్టం రిజర్వేషన్ల ప్రాథమిక స్వరూపాన్ని ఉల్లంఘిస్తున్నదా అన్నది కూడా విచారణ జరుపాల్సి ఉందన్నారు. కాగా, ఈడబ్ల్యూఎస్ కోటాపై స్టే విధించేందుకు ఇంతకుముందు కోర్టు నిరాకరించింది. అయితే సంబంధిత చట్టం చెల్లుబాటుపై విచారణ జరిపేందుకు అంగీకరిస్తూ కేంద్రానికి నోటీసులు జారీచేసింది. ఈడబ్ల్యూఎస్ కోటా బిల్లుకు జనవరి 8న లోక్‌సభ, 9న రాజ్యసభ ఆమోదం తెలిపాయి. అనంతరం రాష్ట్రపతి కూడా ఆమోదముద్ర వేశారు.

# విద్యార్థులకు అత్యుత్తమ నగరం లండన్

### 81వ స్థానంలో బెంగుళూరు..క్యూఎస్ బెస్ట్ స్టూడెంట్ సిటీ ర్యాంకింగ్స్

**లండన్:** 'విద్యార్థులకు అత్యుత్తమ నగరం' జాబితాలో లండన్ అగ్రస్థానంలో నిలిచింది. విద్యారంగ మార్కెటింగ్ సంస్థ క్వాక్వరెల్లి సైమండ్స్ (క్యూఎస్) ఈ జాబితాను విడుదల చేసింది. లండన్ తర్వాత జపాన్ రాజధాని టోక్యో, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. యూనివర్సిటీలు, నగరాల్లో విద్యార్థుల సంఖ్య, జీవన ప్రమాణం, ఉద్యోగాలు, జీవన వ్యయం, విద్యార్థుల అభిప్రాయం ప్రాతిపదికగా క్యూఎస్ ఈ ర్యాంకులు ఇచ్చింది. ఈ జాబితాలో బెంగుళూరు(81వ స్థానం), ముంబయి(85), ఢిల్లీ(113), చెన్నై(115)స్థానాల్లో నిలిచాయి.

# భారతీయులకూ వర్కింగ్ హాలిడే వీసా!

### కార్మికుల కొరతను అధిగమించేందుకు ఆస్ట్రేలియా యోచన

**మెల్‌బోర్న్:** వ్యవసాయ క్షేత్రాల్లో కార్మికుల కొరతను అధిగమించేందుకు ఆస్ట్రేలియా తమ 'వర్కింగ్ హాలిడే మేకర్' వీసా ప్రోగ్రామ్‌ను విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నది. ఈ వీసా జాబితాలో భారత్‌తోపాటు మరికొన్ని దేశాలను చేర్చాలని యోచిస్తున్నట్లు ఆ దేశ ఇమ్మిగ్రేషన్ శాఖ మంత్రి డేవిడ్ కోల్మన్ వెల్లడించారు. వర్కింగ్ హాలిడే మేకర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆస్ట్రేలియా ప్రభుత్వం వర్కింగ్ హాలిడే వీసాను అందిస్తున్నది. దీని ద్వారా యువ పర్యాటకులకు వీసా గడువును పెంచి, తాత్కాలిక ఉపాధి ద్వారా వారు డబ్బును సంపాదించుకునేందుకు వీలు కల్పిస్తున్నది. గత మార్చి నాటికి ఆస్ట్రేలియాలో 1,50,000 మంది వర్కింగ్ హాలిడే వీసాపై నివసిస్తున్నారు.

# రూ.62 లక్షలు చెల్లించండి: సింఘ్వీ

**తిరువనంతపురం:** శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశానికి సంబంధించిన కేసులో వాదనలు వినిపించినందుకు రూ.62 లక్షలు చెల్లించాలంటూ కాంగ్రెస్ నేత, న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు బిల్లు పంపారు. ఈ బిల్లును చూసిన దేవస్థానం యాజమాన్యం ఇంత పెద్ద మొత్తంలో తాము చెల్లించలేమని, తగ్గించాలని విజ్ఞప్తి చేసింది. వాస్తవానికి ఈ కేసులో వాదనలు వినిపించాలని తాము సింఘ్వీని కోరలేదని, న్యాయవాదిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా సింఘ్వీని నియమించిందని గుర్తుచేసింది.



ట్రిపుల్ తలాక్ బిల్లులో నేను సూచించినట్టుగా, నిందితుడిని జైలుకు పంపడాన్ని తొలిగించి, లక్ష జరిమానా విధించడం, భార్యకు నెలకు పదివేల రూపాయల భృతి ఇవ్వడాన్ని చేరిస్తే ఏ వివాదం ఉండకపోయేది. మోదీజీ కోరుకుంటున్నట్టుగా ముస్లింల నమ్మకాన్ని కూడా చూరగొనేవారు.

**దిగ్విజయ్‌సింగ్, కాంగ్రెస్ సీనియర్ నేత**

ట్రిపుల్ తలాక్‌తో పాటు ఇతర బిల్లులను మోదీ ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటిగా ఆమోదింపజేసుకున్నది. పార్లమెంట్ బిల్లులపై చర్చించి, వాటి ప్రయోజనాలను, అవసరాలను నిర్ణయిస్తుంది. కానీ మోదీ మూడురోజుల్లో మూడు బిల్లులను ఆమోదింపజేసుకున్నాడు. ఇది పిజ్జాలను పంచటంలా ఉన్నది.

**డెరెక్ ఓ బ్రియెన్, తృణమూల్ కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



1714

ఇంగ్లాండ్ రాజుగా జార్జ్-1.

1883

గ్రేట్ బ్రిటన్‌లో పోస్టల్ సర్వీస్ ప్రారంభం.





1953

క్యూబాలో అరెస్టయిన ఫిడెల్ కాస్ట్రో.

ఉన్నావ్ లైంగికదాడి బాధితురాలని యాక్సిడెంట్ రూపంలో హత్య చేయటానికి, లైంగికదాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగర్ ప్రయత్నించటం పట్ల యూపీ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. ఎమ్మెల్యే సింగర్ లైంగికదాడి చేశాడన్న ఆరోపణతోనే జైల్లో ఉన్నాడు. ఆ కేసు ఇప్పుడు విచారణకు వచ్చింది. దీంతో అతడు కేసు నుంచి తప్పించుకోవటం కోసం యాక్సిడెంట్ రూపంలో బాధితురాలిని హతమార్చటం కోసం ప్రయత్నించాడు. నేరస్తులు అధికార అందలమెక్కితే చట్టాలను ఎలా చేతిలోకి తీసుకొని ఎంతగా రెచ్చిపోతారో ఈ ఉదంతం చెబుతున్నది.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**

దేశం పులుల సంరక్షణలో గొప్ప ముందడుగు పడింది. నాలుగేండ్లలోనే పులుల సంఖ్య 33 శాతం పెరిగింది. ప్రభుత్వం, అటవీ అధికారులు తీసుకున్న ప్రత్యేక చర్యల కారణంగా 2014లో 2,226 ఉన్న పులులు, 2018 నాటికి 2, 967 అయ్యాయి. ఇవి 2016లో అయితే 1,411 మాత్రమే ఉండేవి. పులుల సంరక్షణ కోసం తీసుకున్న చర్యల ఫలితాలను పరీక్షించటం కోసం ప్రభుత్వం పెద్ద ప్రయత్నమే చేసింది. 3,81,400 చ.కిమీ. పరిధిలో విస్తరించి ఉన్న అడవిలో 26,838 కెమెరాలతో పులుల ఉనికిని గుర్తించటమే కాకుండా కచ్చితంగా లెక్కించటం గమనార్హం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# ట్రిపుల్ తలాక్

తక్షణ ట్రిపుల్ తలాక్‌ను నేరంగా పరిగణించే వివాదాస్పదమైన 'ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) బిల్లును రాజ్యసభ కూడా ఆమోదించడంతో ఇక రాష్ట్రపతి ఆమోదమే మిగిలింది. ముస్లిం వర్గంలోని కొందరు భర్తలు తక్షణం మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా భార్యలను వదిలి పెడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకవచ్చింది. మహిళల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలు తెచ్చినప్పుడు పార్లమెంటులో, బయటా వ్యతిరేకించడానికి ఏ రాజకీయపక్షమైనా జంకుతుంది. కానీ ఈ బిల్లు విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడానికి కారణమేమిటనేది చర్చించాల్సిన విషయం. ప్రతిపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్ దాని మిత్రపక్షాలు వ్యతిరేకించడం వేరు. కానీ యూపీఏ కూటమిలో లేని, ఆయా బిల్లుల మంచి చెడులను బట్టి మద్దతు ఇచ్చే రాజకీయపక్షాలు కూడా ట్రిపుల్ తలాక్ బిల్లుకు మద్దతు ఇవ్వకపోవడం గమనార్హం. ప్రతి మతం వారిలోనూ దురాచారాలు, సామాజిక రుగ్మతలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు సంస్కరించుకోవడం ఆధునికతవైపు అడుగులు వేయడం అభిలషణీయం. కానీ సూత్రప్రాయంగా దురాచారాలను రూపుమాపాలని కోరుకున్న వారు కూడా మోదీ ప్రభుత్వానికి మద్దతుగా నిలువ లేదు. దీనికి అల్పసంఖ్యాక వర్గాల సంతుష్టీకరణ అనే ముద్ర వేయడం చర్చను పక్కదోవ పట్టించడమే. ట్రిపుల్ తలాక్ బిల్లులోని కొన్ని అంశాలు, అసహన రాజకీయాలు పేట్రేగుతున్న నేటి సందర్భం, మోదీ ప్రభుత్వ విశ్వసనీయత ప్రశ్నార్థకం కావడం – మొదలైన అంశాలన్నీ రాజకీయ పక్షాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడానికి దోహదపడ్డాయి.

భార్యాభర్తలు విడిపోవడం అనేది అన్ని మతాలలోనూ ఉన్నది. కలిసి ఉండాలనే అందరూ కోరుకుంటారు కానీ, ప్రభుత్వం బలవంతంగా కాపురం చేయించడం సాధ్యం కాదు. పొరపొచ్చాలను సామరస్యంగా పరిష్కరించుకోవడమే ఎక్కువగా సాగుతుంది. ఇది సాధ్యం కాని పక్షంలోనే విడిపోవలసి వస్తుంది. అయితే ఏదో కొద్ది మంది అనుసరించే తక్షణ తలాక్ మాత్రం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. ఈ విధానం చెల్లుబాటు కాదని చట్టం చేస్తే సరిపోతుంది. కానీ భార్య లేదా ఇరు వైపులా రక్త సంబంధీకులలో ఎవరో ఒకరు ఫిర్యాదు చేస్తే చాలు భర్తపై బెయిల్ లభించని కేసు పెట్టడం, భర్తకు మూడేండ్ల జైలు విధించడమనే నిబంధనల పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాల ఒత్తిడి మేరకు– భార్య వాదన విన్న తరువాత బెయిల్ ఇచ్చే వెసులుబాటు బిల్లులో కల్పించారు. అయినప్పటికీ కుటుంబ వివాదాలను సివిల్ అఫెన్స్‌గా చూడాలె తప్ప క్రిమినల్ చర్యలు చేపట్టడం తగదనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో అల్పసంఖ్యాక, బలహీనవర్గాల మీద దాడులు సాగుతున్న సందర్భమిది. ఈ నేపథ్యంలో కఠిన చట్టాలను ప్రవేశపెట్టడం వేధించడానికేననే ఆందోళన వ్యక్తమవుతున్నది. అన్నిటికి మించి మహిళల హక్కుల కోసమే ఈ చట్టం చేస్తున్నామనే మోదీ ప్రభుత్వ వాదన నమ్మశక్యంగా లేదు. మధ్యయుగాల నాటి విధానాన్ని రూపుమాపినట్టు ప్రధాని మోదీ ఈ బిల్లు ఆమోదం సందర్భంగా వ్యాఖ్యానించారు. కానీ దేశమంతా బజరంగ్‌దళ్ సభ్యులు ప్రేమికులపై దాడులు సాగించడం, మహిళలు ఆధునిక దుస్తులు వేసుకుంటే వేధించడం పెరిగిపోతున్నది. దీంతో మహిళల హక్కులను కాపాడుతామంటున్న మోదీ ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రశ్నార్థకమవుతున్నది.

> **దేశంలో మతపరమైన కేంద్రీకరణ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. దీనికి బీజేపీతో పాటు ఇంతకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కూడా బాధ్యత వహించక తప్పదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లింల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషిచేయడం కన్నా, వారికేదో ఒరగబెడుతున్నట్టు ప్రచారం చేసుకోవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఓట్ల కోసం అల్పసంఖ్యాక, బలహీన వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రచారాన్ని కొన్ని మతవాద పక్షాలు చేపట్టడానికి అవకాశం లభించింది.**

దేశంలో మతపరమైన కేంద్రీకరణ పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. దీనికి బీజేపీతో పాటు ఇంతకాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కూడా బాధ్యత వహించకతప్పదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముస్లింల జీవన ప్రమాణాల మెరుగుదలకు కృషిచేయడం కన్నా, వారికేదో ఒరగబెడుతున్నట్టు ప్రచారం చేసుకోవడం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఓట్ల కోసం అల్పసంఖ్యాక, బలహీనవర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారనే ప్రచారాన్ని కొన్ని మతవాద పక్షాలు చేపట్టడానికి అవకాశం లభించింది. ఈ భావనే మోదీ రెండవసారి అధికారంలోకి రావడానికి కారణమైంది. అల్పసంఖ్యాక వర్గాల మెప్పు పొందాలంటే అనేక మార్గాలున్నాయి. తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న నిర్మాణాత్మక విధానాలు ఇందుకు ఉదాహరణ. బాల బాలికలకు గురుకుల విద్య, షాదీ ముబారక్ మొదలుకొని పండుగలకు దుస్తులు ఇవ్వడం వరకు అనేక విధాలుగా అల్ప సంఖ్యాకవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నది. వారి జీవన పరిస్థితులు మెరుగుపరుచడాన్ని తమ పరిపాలనా విధానంలో భాగం చేసుకున్నది. ఇదేవిధంగా దళితులు, గిరిజనుల అభ్యున్నతికి, సాధికారతకు ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తున్నది. హిందువులతోపాటు మొత్తం సామాజికాభివృద్ధిలో భాగంగా ముస్లింల అభ్యున్నతికి పాటుపడినప్పుడు ఏ వర్గం నుంచి అభ్యంతరం ఉండదు. దానిని సంతుష్టీకరణ విధానంగా కూడా ముద్ర వేయడం సాధ్యం కాదు. ఇదే విధంగా మెజారిటీవర్గాల మెప్పు పొందడానికి అసహన రాజకీయాలను అనుసరించవలసిన అవసరం కూడా ఉండదు.

**జనగళం**

### హ్యాట్సాఫ్ కేసీఆర్

'తలాపున పారుతుంది గోదారి, మన చేను మన చెలుక ఏడారి..' ఓ కవి రాసిన ఈ పాట ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాల పనితీరును తేటతెల్లం చేసింది. తెలంగాణలో ప్రవహిస్తూ గోదావరి పోతున్నా, సుక్క నీరు లేక తెలంగాణ రైతులు తల్లడిల్లిపోయేవారు. విధిలేక ఉపాధి కోసం వలసబాట పట్టేవారు. అసొంటి గోదావరి కడుపు నిండా నీళ్లతో కళకళలాడుతున్నది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, లాంటి బరాజ్‌లు నీటితో నిండుకున్నా యి. దీంతో రాష్ట్రంలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది. యుద్ధ ప్రాతిపదికన కాళేశ్వరం ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువచ్చిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. హ్యాట్సాఫ్ కేసీఆర్ అంటూ జేజేలు పలుకుతున్నారు.

**- జీడిపల్లి లింగారావు, రామకృష్ణకాలనీ, కరీంనగర్**

### బాధితురాలికి న్యాయం చేయాలె

యూపీ ఉన్నావ్ ఘటన జరిగిన తీరు చూస్తుంటే హృదయం ద్రవించిపోతున్నది. అధికార పార్టీ ఎమ్మెల్యే తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎవరూ పట్టించుకోలేదు. తనకు న్యాయం జరిగేదాకా పోరాటం చేస్తానని అత్యాచార బాధితురాలు మొండికేసి కూర్చోవటం ఆమె ప్రాణాల మీదికే తెచ్చింది. ఇటీవల అత్యాచార బాధితురాలు, న్యాయవాది, ఇద్దరు సాక్షులు ప్రయాణిస్తున్న కారును గుర్తుతెలియని లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సాక్షులు అక్కడికక్కడే మరణించారు. కాగా బాధితురాలు, న్యాయవాది మృత్యువుతో పోరాడుతున్నారు. ఇది సాక్షాత్తూ అధికార పార్టీ ఎమ్మెల్యే చేసిన పనేనని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, పౌరసంఘాలు ఆరోపిస్తున్నాయి. కానీ యాక్సిడెంట్‌ను కుట్రకోణంగా చూడటం సరికాదంటూ రాష్ట్ర డీజీపీ ప్రకటించటం సిగ్గుచేటు. నాకు, నా కుటుంబానికి ఎమ్మెల్యే నుంచి బెదిరింపులు వస్తున్నాయని, ప్రాణహాని ఉన్నదని బాధితురాలు భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినా పట్టించుకోలేదు. ఫలితంగా ఇంతటి ఘాతుకం జరిగింది. ఇప్పటికైనా బాధితురాలికి మెరుగైన వైద్యసేవలందించి ఆమె ప్రాణాలను కాపాడి, నిందితులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత భారత సుప్రీం కోర్టు తీసుకోవాలె.

**- నారదాసు రాజేందర్, తార్నాక, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ఆలోకన



**టంకశాల అశోక్**

# కొత్త ఆక్రమణలో ఫెడరలిజం

ఫెడరలిజంపై బీజేపీ ఆక్రమణలు వేగాన్ని పుంజుకుంటున్నాయి. మనది సహకార ఫెడరలిజమని ప్రకటిస్తున్న రాజ్యాంగాన్ని దేశానికి ప్రసాదించింది తామేనని చెప్పే కాంగ్రెస్ పార్టీ తన కాలంలో ఇదే పనిచేసింది. తమ విధానం సహకార ఫెడరలిజమని 2014లో మొదటిసారి అధికారానికి వచ్చినప్పుడు హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సైతం అదే మార్గంలో వెళ్తున్నారు. ఆ పని ఇంకా వేగంగా చేయజూస్తున్నట్లు కన్పిస్తున్నది. ఈ దేశ వైవిధ్యతను, అందుకు అనుగుణమైన ప్రజాస్వామికతను కాపాడుకోవలసిన బాధ్యత గతంలో వలె ఇప్పుడు కూడా ఫెడరల్ శక్తులదే అవుతున్నది.

ఇటీవలి ఫెడరల్ ఉల్లంఘనలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను గమనించండి. మోదీ ప్రభుత్వం పోయిన నెల చివరి వారంలో, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదాన్ని పొందింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను, ఉగ్రవాద చర్యలను ప్రభుత్వాలు నిరోధించాలనటంలో భిన్నాభిప్రాయానికి తావులేదు. ఒకోసారి ఈ కార్యకలాపాల నిర్వచనంపై, వ్యక్తులను గుర్తించటంపై, శిక్షల స్థాయిపై భిన్నాభిప్రాయాలు ఉండవచ్చుగాక. అటువంటి భిన్నాభిప్రాయాన్ని గతంలో అనేక కేసుల విషయంలో సాక్షాత్తు కోర్టులు సైతం కించపరిచాయి. అదే సమయంలో మౌలికంగా ఈ తరహా కార్యకలాపాల నియంత్రణ మాత్రం అవసరం. అందువల్లనే పై బిల్లును పార్లమెంటులో దాదాపు అన్ని పార్టీలు బలపరిచాయి. కానీ అట్లా బలపరుస్తూనే కొందరు తమ విమర్శలను తెలియజెప్పారు. ఉదాహరణకు, ఈ కేసులపై పరిశోధనల కోసమని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ వారు రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం లేకుండా రాష్ట్రాలలో వివిధ చర్యలు తీసుకోవటం. అది ఫెడరలిజానికి విరుద్ధంగా ఈ రాష్ట్రాలలో మితిమీరి జోక్యం చేసుకోవటమేనని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ నాయకుడు కే.కేశవరావు రాజ్యసభలో, బి.వెంకటేశ్ లోక్‌సభలో ఆక్షేపించారు.

ఇదే ఆక్షేపణ ఇతర ప్రతిపక్షాల నుంచి కూడా ఎదురైంది. రాజ్యాంగం ప్రకారం శాంతిభద్రతల అంశం రాష్ట్రాల జాబితాలో ఉంది. కేంద్ర సంస్థల దృష్టికి వచ్చి, అంతర్రాష్ట్ర స్వభావం లేదా జాతీయ స్వభావం గల నేరాలు కొన్ని ఉంటాయి. ఆర్థికనేరాలు లేదా ఉగ్రవాదం నేరాల వంటివి. ఇవి మొదటి నుంచి ఉన్నవే. అటువంటప్పుడు కేంద్ర సంస్థలు సంబంధిత రాష్ట్ర పోలీసుల సహకారం తీసుకుని దర్యాప్తు జరుపటం సంప్రదాయకంగా వస్తున్న విషయం. ఆ పద్ధతిలో కేసుల పరిశోధనకు ఎటువంటి సమస్యలు ఎదురుకాలేదు. అటువంటి స్థితిలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాలతో ఎటువంటి నిమిత్తం లేకుండా రకరకాల చర్యలు తీసుకునేందుకు కొత్త చట్టంలో వీలు కల్పించవలసిన అవసరం ఏమున్నది? సమస్య ఏమంటే ఇటువంటి కేంద్ర సంస్థల చర్యల వల్ల తమ రాష్ట్రంలో ఏమి జరుగుతున్నదో, ఎవరిని అరెస్టు చేస్తున్నారో, ఎవరి ఆస్తులు జప్తు చేస్తున్నారో, ఎవరికి ఏమవుతున్నదో, దానంతటిలోని మంచి చెడులేమిటో రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియకుండా పోతుంది. అట్లా జరిగే వాటికి ఒక్కోసారి పరిస్థితులను బట్టి రాష్ట్ర ప్రభుత్వాలు స్థానికంగా జవాబుదారీ కావలసి వస్తుంది. అనగా, చర్యలు కేంద్ర ఏజెన్సీలవి కాగా, జవాబుదారీతనం రాష్ట్రాలది అవుతుందన్నమాట. ఫెడరలిజం, సహకార ఫెడరలిజం సాగవలసింది ఈ విధంగానేనా?

అంతేకాదు. తమ అధికారాలను కేంద్ర సంస్థలు రకరకాల కారణాలతో దుర్వినియోగపరుచబోవనే హామీ లేదు. సభలో కొందరు ఎత్తిచూపినట్లు కేంద్రంలో గల అధికారపక్షానికి ఈ చట్టం రాజకీయంగానూ ఉపయోగపడవచ్చు. తన పాలనాకాలమంతా కాంగ్రెస్ పార్టీ సీబీఐని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను, ఆదాయం పన్ను శాఖను విచ్చలవిడిగా దుర్వినియోగపరుచటం ఇందుకు తిరుగులేని తార్కాణం. అందుకు కాంగ్రెస్‌ను విమర్శించిన పార్టీలలో బీజేపీ కూడా ఉన్నది. వివిధ సంస్థలు, చట్టాల ప్రయోగంలో రాష్ట్రాలకు ఎంతో కొంత ప్రమేయం ఉండగల సందర్భాలలోనే ఇటువంటి దుర్వినియోగం జరుగగా, అసలు ఏ జోక్యమూ లేనివిధంగా ప్రస్తుత చట్టాన్ని తయారుచేస్తున్నప్పుడు రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? ఫెడరలిజం ఏమయేను?

హోంమంత్రి అమిత్ షా గుర్తు చేసినట్లు ఇది చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధానికి ఇప్పటికే గల చట్టానికి సవరణ బిల్లు మాత్రమే నన్నది నిజమే. చట్టాన్ని చేయటంతో పాటు దానిని కొన్ని సవరణల ద్వారా కఠినతరం చేసింది కాంగ్రెసే. దానిని ఇప్పుడు మరింత కఠినం చేస్తున్నారు. ఇదే విమర్శను కాంగ్రెస్‌పై మజ్లిస్ సభ్యుడు ఒవైసీ చేశారు. ఈ గత చరిత్ర అంతాసరే. ఇక్కడ మనం యథాతథంగా చట్టంలోని మంచి చెడులను చర్చించటం లేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం తెచ్చిన సవరణలు రాష్ట్రాల ఫెడరల్ పాత్రను గతంలో ఎన్నడూ లేనివిధంగా కుంచింపజేస్తున్నాయి. అధికారాలను దుర్వినియోగపరుచటంలో కాంగ్రెస్‌కు బీజేపీ ఎంత మాత్రం తీసిపోవటం లేదు. అట్లా తీసిపోని స్థితిలో రాష్ట్రాల అధికారాలను గతం కన్న అతిక్రమించటమంటే దుర్వినియోగానికి ఆస్కారాన్ని పెంచటమన్నమాట.

రాష్ట్రాల ఫెడరల్ హక్కులు, అధికారాలపై ఏదో ఒక రూపంలో ప్రభావం ఉండటం నదీజలాల బిల్లు, విద్యారంగ ముసాయిదా సమాచార హక్కు చట్టం, కార్మిక చట్టాల వంటి విషయాలలోనూ కన్పిస్తున్నది. ఇవన్నీ ఇటీవలి వారాలకు సంబంధించినవే. నదీ బేసిన్ల అథారిటీ నియామకం, వేర్వేరు ట్రిబ్యునళ్ల రద్దు వంటివి స్థూలంగా చూసినప్పుడు ఉపయోగంగానే కన్పిస్తాయి. వివాదాల పరిష్కారంలో ఆలస్యాల నివారణ, అభివృద్ధిని వేగవంతం చేయటం మంచి ఉద్దేశాలే. అదే సమయంలో తమ సొంత అవసరాల కోసం పట్టుబట్టి నిలిచే ఫెడరల్ అధికారాలు రాష్ట్రాలకు పరిమితమవుతాయి. ప్రస్తుతం సర్క్యులేషన్‌లో గల ఈ బిల్లు రాష్ట్రాల అభిప్రాయాలను కోరుతున్నది. కానీ వాటి అభిప్రాయాలకు ఎంత విలువ ఇచ్చేదీ, చివరికి పార్లమెంటరీ మెజారిటీ సూత్రంతో కేంద్ర అధికార పక్షం తాను కోరుకున్నదానినే ఎంతవరకు నెరవేర్చుకునేదీ ఎవరైనా ఊహించవచ్చు. బిల్లు చట్టరూపం దాల్చి అమలుకు వచ్చినప్పుడు అథారిటీ సంస్థలలో కేంద్రం నియమించే వారిది పైచేయి కానున్నది. అప్పుడు వివిధ నిర్ణయాధికారాలు అన్నీ కేంద్రానికి, మరొకవిధంగా చెప్పాలంటే అక్కడి అధికార పక్షానికి లభిస్తాయి. ఇటువంటివి పలు రూపాలలో ఆ పార్టీ ప్రయోజనాలకు ఉపయోగపడుతాయని వేరుగా చెప్పనక్కరలేదు. అది ఎట్లున్నా, రాష్ట్రాలు ప్రధానంగా ఆలోచించవలసిన విష యం తమ అంతర్రాష్ట్రీయ నదీ ప్రయోజనాల విషయమై తమ వైఖరికి ఇంతకాలం గల విలువ స్పష్టంగా తగ్గిపోనుండటం. ఈ విధంగా ఫెడర ల్ వ్యతిరేక కేంద్రీకరణ వేగం పెరుగుతున్నది.

సమాచార హక్కు సంస్థల నియామకాలు, కమిషనర్ల విధి విధానాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంతగా జోక్యం కల్పించుకోవలసిన అవసరం ఏమిటో కూడా బోధపడటం లేదు. ఆ బాధ్యతలను రాష్ట్రాలు సొంతంగా తమ స్థాయిలో గాక కేంద్రం చట్టం ప్రకారమే నిర్వర్తిస్తున్నాయి.

> సమాచార హక్కు సంస్థల నియామకాలు, కమిషనర్ల విధి విధానాల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంతగా జోక్యం కల్పించుకోవలసిన అవసరం ఏమిటో కూడా బోధపడటం లేదు. ఆ బాధ్యతలను రాష్ట్రాలు సొంతంగా తమ స్థాయిలో గాక కేంద్రం చట్టం ప్రకారమే నిర్వర్తిస్తున్నాయి. అయినప్పుడు రాష్ట్రాలకు గల ఆ మాత్రపు ఫెడరల్ అధికారాలను సైతం మోదీ ప్రభుత్వం హరించబూనింది.

అయినప్పుడు రాష్ట్రాలకు గల ఆ మాత్రపు ఫెడరల్ అధికారాలను సైతం మోదీ ప్రభుత్వం హరించబూనింది. దీనిని బట్టి, దేశ ప్రయోజనాలు, పరిపాలనా సౌలభ్యతలు అనే వేటితోనూ నిమిత్తం లేకుండా అత్యధిక అంశాలను, అధికారాలను తన చేతిలో కేంద్రీకరింపజేసుకోవటం కేంద్ర ప్రభుత్వపు ఫెడరల్ వ్యతిరేకతకు అద్దం పడుతున్నది. విద్యారంగాన్ని కేంద్రీకృతం చేయనుద్దేశించిన విధానం కూడా ఇటువంటిదే. ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో గల ఈ రంగం నిర్వహణకు, నియంత్రణకు ప్రధాని అధ్యక్షతన గల రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ నియామకం ఈ జాతీయ విద్యా విధానం ముసాయిదాలో భాగం. దాని ప్రకారం, ఆ సంస్థ ఏది నిర్ణయిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు దానిని అమలుపరచాలి. అనగా పరోక్షంగా విద్యారంగం కేంద్ర జాబితాలోకి వెళ్లటమే. కేంద్రంలోని అధికారపక్షపు ఆలోచనలు, అవసరాలే రాష్ట్రాల ఆలోచనలు, అవసరాలుగా మార్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉమ్మడి జాబితాతో నిమిత్తం లేకుండా కార్మిక చట్టాల విషయంలోనూ ఇటువంటి ప్రయత్నాలనే కేంద్రం చేస్తున్నది.

విచారకరం ఏమంటే, ఒకవైపు ఇటువంటివి వేగంగా జరుగుతుండగా మరొకవైపు ఫెడరల్ శక్తులు, ప్రజాస్వామికవాదులు ఎక్కువగా ఏమీ చేయలేని పరిస్థితులు దేశంలో నెలకొని ఉన్నాయి. దీనిని మోదీ ప్రభుత్వం అనువుగా ఉపయోగించుకుంటున్నది. ఫెడరలిస్ట్ ఐక్యత నేటి అవసరం.

# 'ఎన్‌ఎంసీ' ఎవరి కోసం?

వైద్యరంగం



**డాక్టర్ రవిశంకర్ ప్రజాపతి**

ఎనుకట.. ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటినే తగులబెట్టాడట ఓ ప్రబుద్ధుడు. సరిగ్గా ఇప్పుడు అదే జరుగుతున్నది. కేంద్రస్థాయిలో దేశంలోని వైద్య విద్యను పర్యవేక్షిస్తున్న మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) అవినీతిలో కూరుకుపోయిందని ఏకంగా దాన్నే రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నది. దానిస్థానంలో సరికొత్తగా నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు మోదీ ప్రభుత్వం చెప్పుకొస్తున్నది. జవాబుదారీతనాన్ని పెంచేందుకు, అవినీతిని నిర్మూలించేందుకే 'ఎన్‌ఎంసీ'ని ఏర్పాటు చేస్తున్నట్లు నమ్మబలుకుతున్నది. మోదీ ప్రభుత్వం చెబుతున్నట్లు అవినీతిని నిర్మూలించి, జవాబుదారీతనాన్ని పెంచేందుకే అయితే దశాబ్దాలుగా వైద్య విద్యాభివృద్ధిలో భాగం పంచుకున్న ఎంసీఐని అవినీతి అక్రమాల నుంచి ప్రక్షాళన చేసి బలోపేతం చేస్తే సరిపోతుంది. కానీ దాన్ని రద్దుచేసి దాని స్థానంలో కొత్తదాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకత ఏమున్నదనేదే అందరి ప్రశ్న.

ఎన్‌ఎంసీ ఏర్పాటు అవసరాన్ని కేంద్రం ఎంత అందమైన పరిభాషలో చెప్పినా, దాని విధివిధానాలను పరిశీలించిన వారికెవరికైనా మోదీ ప్రభుత్వం చెబుతున్నదానికి, అందులో పొందుపర్చిన సారాంశానికి పొంతన లేని విషయాన్ని ఇట్టే గ్రహించవచ్చు. మొత్తంగా చూస్తే.. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న విషయాలే కాకుండా కొత్తగా ఏర్పాటు చేయబోతున్న ఎన్‌ఎంసీ ఏర్పాటులో బయటకు చెప్పని విషయాలెన్నో దాగి ఉన్నాయి. అంతకుమించి దేశంలో ఉన్న సమాఖ్యస్ఫూర్తికి తూట్లు పొడిచి, ప్రైవేటు వైద్యకళాశాల యాజమాన్యాలకు అనుకూలమైన విధానాల రూపకల్పన అసలు విషయంగా అర్థం చేసుకోవచ్చు. మరీ ముఖ్యంగా ఎన్‌ఎంసీలో అధికారపక్షం తనకు అనుకూలురైన వారితో నింపి ఇష్టానుసారంగా వైద్య విద్య రూపురేఖలు మార్చవచ్చు. ఎన్‌ఎంసీ ఏర్పాటులో లోగుట్టు ఇదే.

బ్రిటిష్ కాలంలో దేశంలో వైద్య విద్యాభివృద్ధి కోసం, వైద్య ప్రమాణాల పెంపుదల కోసం ఏర్పాటుచేసిన ఎంసీఐ స్వాతంత్ర్యానంతరం మరింత జవాబుదారీతనంతో అరువైయవ దశకంలో ఒక స్వయంప్రతిపత్తిగల సంస్థగా ఉనికిలోకి వచ్చింది. ఎంసీఐ విధానకర్తలుగా మూడింట రెండొంతుల మంది (160 మందికి పైగా) వివిధ రాష్ట్రాల నుంచి వైద్యకళాశాలల్లో, వృత్తిలో కొనసాగుతూ వైద్య సేవలందిస్తున్నవారు ప్రత్యక్ష ఎన్నికల ద్వారా భారతీయ వైద్య మండలికి ఎన్నికవుతూ వచ్చారు. ఒకరకంగా చెప్పాలంటే వైద్య వృత్తిలోని సాధకబాధకాలు, అవసరమైన నైపుణ్యాలు, అవసరమైన అభివృద్ధి గురించి పూర్తి అవగాహన ఉన్నవారితో భారతీయ వైద్య మండలి ఏర్పాటవుతుంది. అయితే ఈ మధ్యకాలంలో అన్నింటా ప్రైవేటీకరణకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వాల విధానాల కారణంగా వైద్య విద్యలోనూ ప్రైవేట్ వైద్య కళాశాలలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొచ్చాయి. దేశవ్యాప్తంగా 279 ప్రైవేటు వైద్యకళాశాలలు ఏర్పాటయ్యాయి. ఆ క్రమంలో వాటి అనుమతులు, నైపుణ్యాల పెంపుదల విషయంలో భారతీయ వైద్య మండలి బాధ్యులకు డబ్బుల ఎరచూపి అనుమతులు తెచ్చుకోవటంతో అవినీతి బట్టబయలైంది. దీంతో 2010లో ఎంసీఐను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసింది. ఆ తర్వాత కాలంలో నామినేటెడ్ వ్యక్తుల ఆధ్వర్యంలో భారతీయ వైద్య మండలిని నడిపిస్తూ వచ్చారు. ఆక్రమంలోనే ఎంసీఐ విధివిధానాల్లో సమూల మార్పులతో తేదల్చిన సవరణలను భారతీయ వైద్యులు, ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించటంతో ఆ ప్రయత్నాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

గత కొన్నేండ్లుగా వైద్యమండలి ఎన్నిక కాబడిన వ్యక్తులతో కాకుండా, ఎంపిక చేయబడిన వారి చేతిలో ఉండటం కారణంగా ఎంసీఐ ప్రతిష్ఠ మరింతగా దిగజారింది. ఈ నేపథ్యంలో రెండోసారి అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం భారతీయ వైద్యమండలిని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తున్నది. ముఖ్యంగా ప్రజాస్వామ్యయుతంగా వివిధ రాష్ట్రాల నుంచి ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నిక కాబడిన వ్యక్తుల నిర్వహణలో ఉండాల్సిన వైద్యమండలిని నిర్వీర్యం చేస్తున్నారు. దానిస్థానంలో పూర్తిగా నామినేటెడ్ వ్యక్తులతో ఎన్‌ఎంసీని ఏర్పాటు చేసి నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికమే గాక, రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తుంగలో తొక్కటమే.

> ప్రభుత్వం తలపెట్టిన ఎన్‌ఎంసీ విధివిధానాలతో పాటు, దాని స్వరూప, స్వభావాలను దేశవ్యాప్తంగా ఉన్న వైద్య విద్యార్థులతో పాటు, వృత్తి, విద్యా వైద్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా వైద్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎంఏ కూడా తీవ్రంగా నిరసిస్తున్నది. వైద్యవిద్యను వ్యాపారమయం చేయటంలో భాగంగానే ఎన్‌ఎంసీ రూపకల్పన అని విమర్శిస్తున్నది.

ఇప్పటిదాకా రాష్ట్రాల్లోని వైద్యవిద్యా పరిషత్‌లు, కళాశాలల నిర్వహణలో వైద్య విద్యా పరీక్షలు నిర్వహించేవారు. దవాఖానలకు అనుబంధంగా థియరీతో పాటు ప్రాక్టికల్స్‌లో కూడా నాణ్యమైన తర్ఫీదు ఇస్తూ ఎంబీబీఎస్ వార్షిక పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు నాలుగేండ్లు మాత్రమే రాష్ట్రాల వైద్య విశ్వవిద్యాలయాలు పరీక్షలు నిర్వహించాలి, ఎంబీబీఎస్ ఐదో సంవత్సరం తుదిపరీక్షగా 'నేషనల్ ఎక్జిట్ టెస్ట్' నిర్వహించాలని కేంద్రం తలపెట్టింది. అంతే కాకుండా విదేశాల్లో వైద్య విద్యాకోర్సులు చదివి వచ్చిన వారికి కూడా 'నెక్స్ట్' పరీక్ష ద్వారా వైద్యం చేయటానికీ, వైద్యవిద్యలో పీజీ చేయటానికీ అవకాశం కల్పిస్తున్నారు. దీంతో జాతీయంగా నీట్ లాంటి కఠినమైన ప్రవేశపరీక్షలు రాసి ఎంబీబీఎస్ చేసిన వారు కూడా 'నెక్స్ట్' పరీక్ష రాయాలనటం, ఎలాంటి ప్రవేశ పరీక్ష రాయకుండా వైద్య పట్టా పొందినవారితో సమానం చేసినట్లవుతుంది.

అన్నింటికన్నా ముఖ్య విషయమేమంటే.. ఇప్పటిదాకా ప్రైవేటు వైద్య కళాశాలల్లో 85 శాతం సీట్లు ఎంసెట్ లేదా నీట్ పరీక్ష రాసిన వారికి కేటాయించి, కేవలం 15 శాతం సీట్లు మాత్రమే యాజమాన్య కోటగా ఉండేవి. ఎన్‌ఎంసీ చెబుతున్న దానిప్రకారం ఏకంగా 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటాగా యాజమాన్యాలకు అప్పగిస్తారు. అలాగే వైద్యవిద్య ఫీజులను కూడా యాజమాన్యాల ఇష్టాయిష్టాలకు వదిలేశారు. అంటే ప్రభుత్వ విధానం కారణంగా ఎంతోమంది పేద విద్యార్థులు ప్రభుత్వ వైద్యవిద్య కోర్సులకు దూరమవుతారు. మరోమాటలో చెప్పాలంటే పేదలకు వైద్యవిద్యను దూరం చేయటమే. ధనవంతులకు వైద్యవిద్యను అప్పనంగా అందుబాటులోకి తేవటమే.

ఏటా దేశవ్యాప్తంగా 500 మెడికల్ కాలేజీల్లోంచి 68 వేలమంది వైద్య విద్యార్థులు బయటకువస్తున్నారు. వీరిలో కేవలం 23వేల మందికి మాత్రమే పీజీ కోర్సులు వస్తున్నాయి. మిగతా వైద్య విద్యార్థులు వైద్య ప్రాక్టీస్ కోసం 'నెక్స్ట్' పరీక్ష ఉత్తీర్ణత కావాలనటం అసమంజసం. గతంలో విదేశాల్లో వైద్యవిద్య చదివిన వారికి దేశంలో ప్రత్యేక అర్హత పరీక్ష నిర్వహించి మెడికల్ ప్రాక్టీస్ కోసం అనుమతి ఇచ్చేవారు. అలాంటిది ఇప్పుడు దేశంలో నీట్‌ద్వారా వైద్యవిద్యను అభ్యసించిన వారుకూడా 'నెక్స్ట్' పరీక్ష రాయాలనటం ఘోరం. అలాగే గతంలో పీజీ ఎంట్రెన్స్ పరీక్ష వ్యాసరూప ప్రశ్నలతో (ఎస్సే టైప్) ఉండేది. ఇప్పుడు దాన్ని బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో నిర్వహిస్తామంటున్నారు. ఇలాంటి పరీక్షలు విద్యార్థుల సమగ్ర పరిశీలనాశక్తి, అవగాహనలకు ఏ రూపంలోనూ పరీక్షలు కాబోవన్నది విద్యావేత్తలు ఎప్పటినుంచో చెబుతున్నదే.

ప్రభుత్వం తలపెట్టిన ఎన్‌ఎంసీ విధివిధానాలతో పాటు, దాని స్వరూప, స్వభావాలను దేశవ్యాప్తంగా ఉన్న వైద్య విద్యార్థులతో పాటు, వృత్తి, విద్యా వైద్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దేశవ్యాప్తంగా వైద్యులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఎంఏ కూడా తీవ్రంగా నిరసిస్తున్నది. వైద్యవిద్యను వ్యాపారమయం చేయటంలో భాగంగానే ఎన్‌ఎంసీ రూపకల్పన అని విమర్శిస్తున్నది. ఢిల్లీలోని ఎయిమ్స్ విద్యార్థులైతే ఏకంగా 'ఎన్‌ఎంసీ' ప్రతులను దగ్ధం చేసి నిరసనను వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ మినహా దాని మిత్రపక్షాలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎన్‌ఎంసీని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలె. భారత వైద్యమండలిలో ప్రజాస్వామిక విధానాలతో కొనసాగిన ఎంసీఐని కొనసాగించాలి. భారతీయ వైద్యమండలిలో అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రక్షాళన చేయాలి. తద్వారా మాత్రమే మేలైన, నాణ్యమైన వైద్య, విద్యా ప్రమాణాలను నెలకొల్పగలం.

**(వ్యాసకర్త: నేషనల్ జాయింట్ సెక్రటరీ (ఏఎంఎస్.ఐఎంఏ))**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



యాదాద్రిలో ఆకట్టుకుంటున్న గోపురాల సముదాయం

# యాదాద్రి పనుల్లో వేగం

**యాదాద్రి భువనగిరి జిల్లా, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** యాదాద్రి ఆలయ నిర్మాణం సరికొత్త చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలువనున్నది. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు.. దేశంలోనే ఎవరూ చేపట్టని కార్యాన్ని భుజాన వేసుకుని త్రికరణశుద్ధితో చేపట్టిన యాదాద్రి నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రధానాలయంలో శ్రీవారి నిజదర్శనాలు ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కసరత్తు ప్రారంభించడంతో వైటీడీఏ వైస్ చైర్మన్ జీ కిషన్‌రావు, ఇతర అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం యాదాద్రిలో వైటీడీఏ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఇంజినీరింగ్, శిల్పి

**95 శాతం శిల్పిపనులు పూర్తి: వైటీడీఏ వైస్ చైర్మన్**

పనుల కాంట్రాక్టర్లు, స్థపతులు, ఉప స్థపతులతో సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఎప్పుడు యాగం నిర్వహించినా సిద్ధంగా ఉండాలని చెప్పారు. శ్రీసుదర్శన నారసింహ మహాయాగం ఎప్పుడు నిర్వహిస్తే నిజదర్శనాలు కూడా అప్పుడే ప్రారంభమవుతాయని, అధికారులంతా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. పనులు ఆలస్యమైతే కఠిన చర్యలు ఉంటాయని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అనంతరం కిషన్‌రావు మాట్లాడుతూ.. యాదాద్రి ఆలయ నిర్మాణంలో 95 శాతం



యాద్రాద్రిలో అధికారులతో మాట్లాడుతున్న కిషన్‌రావు

శిల్పి పనులు పూర్తయ్యాయని తెలిపారు. నిజ దర్శనాల తేదీని ముఖ్యమంత్రి కేసీఆర్ ఖరారు చేస్తారని చెప్పారు. నిర్మాణాల పూర్తికి అవసరమైన కార్యాచరణను తాము పూర్తిచేసే పనిలో ఉన్నామని పేర్కొన్నారు. సమీక్షలో కూడా ఇదే విషయాన్ని తెలియజేశామని చెప్పారు. ఎక్కడా రాజీలేకుండా పనులు పూర్తిచేయించేందుకు శ్రమిస్తున్నామని ఆయన వివరించారు.





జిల్లాల్లోనూ విమానాశ్రయాలు నిర్మించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండ వద్ద ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎయిర్‌పోర్ట్ కోసం స్థలాన్ని పరిశీలించారు. - మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ



నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద గోదావరికి ఎగువన మహారాష్ట్ర నుంచి వస్తున్న వరద



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి వద్ద మత్తడి దూకుతున్న అర్కగూడ వాగు



బుధవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

# మరో మూడురోజులు వర్షం

## కొనసాగుతున్న అల్పపీడనం

- రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- బుధవారం పలు జిల్లాల్లో కురిసిన వాన

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ :** రుతుపవనాలు చురుకుగా కదులుతున్నందున రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం గ్రేటర్‌హైదరాబాద్‌తోపాటు వికారాబాద్, సిద్దిపేట, నల్గొండ, నిజామాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో గోదావరి నదీ ప్రవేశప్రాంతంలో జలకళ సంతరించుకున్నది. ప్రాణహిత, పెన్‌గంగా నదులు పొంగి పొర్లుతున్నాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో జూరాలప్రాజెక్టు నిండుకుండలా మారగా శ్రీశైలానికి కృష్ణమ్మ ఉరకలెత్తుతున్నది. కాగా, ఉత్తర మధ్యప్రదేశ్ మధ్యప్రాంతం, దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అల్పపీడనానికి అనుబంధంగా 4.5 కి.మీ. ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని.. ఇది ఎత్తుకి వెళ్లే కొద్దీ దక్షిణదిశ వైపునకు వాలి ఉన్నదని అధికారులు తెలిపారు. దక్షిణ ఒడిశా, దాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర కోస్తా ఆంధ్ర ప్రాంతాల్లో 7.6 కి.మీ. ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఆగస్టు 4న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని తెలిపారు. ఉత్తరాంధ్రలోని కొన్నిచోట్ల, యానాంలో రాగల మూడ్రోజులపాటు తేలికపాటినుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని.. రాయలసీమలోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**పలు జిల్లాల్లో మోస్తరు వాన**

వికారాబాద్ జిల్లా తాండూరు, పెద్దేముల్, బంట్వారం, వికారాబాద్, పరిగి, మర్పల్లి మండలాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. మోమిన్‌పేటలో 2.0 మిల్లీమీటర్లు, నవాబుపేట 2.2 మి.మీ., కులకచర్ల 1.0 మి.మీ., దోమ 2.4 మి.మీ., బంట్వారం, కోట్‌పల్లిలో 1.0 మి.మీ., తాండూరు 2.4 మి.మీ., బషీరాబాద్ 1.4 మి.మీ., యాలాల 1.2 మి.మీ., దౌల్తాబాద్ 2.2 మి.మీ. కురిసిందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. నల్లగొండ జిల్లాకేంద్రంతోపాటు కట్టంగూర్, శాలిగౌరారం మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఐదురోజులుగా వర్షం పడుతుండటంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా మంగళవారం 3.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. రెంజల్ మండలంలో అత్యధికంగా 17.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా ధర్పల్లి మండలంలో 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేటలో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వెంకట్రావ్‌పేట్ బ్రిడ్జి దగ్గర ఉప్పొంగుతున్న పెన్‌గంగ



### గ్రేటర్‌లో విస్తారంగా వానలు

**మరో రెండు రోజులు ఇదే పరిస్థితి**

**నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో:** రుతుపవనాలు చురుకుగా కదులుతుండడంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగురోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొదటి రెండ్రోజులు ముసురుతో చల్లబడిన నగరం మంగళ, బుధవారాల్లో తేలికపాటి నుంచి ఓమోస్తరు వర్షం కురిసింది. బుధవారం రామంతాపూర్, నల్లకుంట, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, కార్వాన్, భవానీకాలనీ, మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్, నాంపల్లి, అబిడ్స్, అమీర్‌పేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షంకురిసింది. నగరంలో 1.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణకేంద్రం వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30.8 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 23.0 డిగ్రీలు, గాలిలో తేమ 75 శాతంగా నమోదైననట్టు అధికారులు తెలిపారు. గురు, శుక్రవారాల్లో సైతం ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు.

**కందకుర్తి వద్ద గోదావరికి జలకళ**

తెలంగాణలో గోదావరి తొలి ప్రవేశం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి సమీపంలో మూడు నదులు ఒకేచోట కలిసే త్రివేణి సంగమంలో వరద ఉధృతి పెరిగింది. మహారాష్ట్రలోని నాసిక్, ఇతర ప్రాంతాల్లో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా వరద ఔరంగాబాద్ జిల్లా గైక్వాడ్ ప్రాజెక్టులోకి చేరింది. దీంతో అధికారులు 18 గేట్లు ఎత్తివేశారు. హరిద్ర, మంజీర నదుల నుంచి వరద రావడంతో కందకుర్తి వద్ద గోదావరి జలకళను సంతరించుకుంది.

**ఉప్పొంగుతున్న ప్రాణహిత**

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రాణహిత నదిలోకి వచ్చి చేరుతుండంతో నది ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వర్షాలు తగ్గినప్పటికిని నదిలోకి వరద ప్రవాహం కొనసాగుతుండంతో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రాపనపల్లి గ్రామ వద్ద ఉధృతంగా పారుతోంది. ఈ జలాలు కాళేశ్వరం ప్రాజెక్టు వైపు వెళ్తుండగా, రాపనపల్లి సమీపంలో నిర్మించిన అంతరాష్ట్ర వంతెన వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ప్రవాహాన్ని తిలకిస్తున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి కుమ్రంభీం ఆసిఫాబాద్‌జిల్లా కుమ్రంభీంప్రాజెక్టులోకి భారీగా వరుద నీరు వచ్చి చేరుతోంది. తిర్యాణి మండల కేంద్రంలోని చెలిమెల వాగు ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో పూర్తి స్థాయి నీరు చేరుకోగా మత్తడి పారుతున్నది. చింతలమానేపల్లి బాబాసాగర్ గ్రామ సమీపంలోని అర్కగూడ ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూర్తిగా నిండింది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో మత్తడి దూకుతున్నది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో వెంకట్రావ్‌పేట్ వద్ద బ్రిడ్జి కింది నుంచి పెన్‌గంగ నది ఉప్పొంగి పారుతున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు నది పరవళ్లు తొక్కుతున్నది.



వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని బుధవారం మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, కడియం శ్రీహరి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, ఎడ్మ కిష్టారెడ్డి, మదన్‌లాల్, ఆగ్రోస్‌చైర్మన్ కిషన్‌రావు, సింగిల్‌విండో అధికారులు, టీఎన్జీవో నాయకులు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసగృహంలో పరామర్శించారు. తారకమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. - వనపర్తి, నమస్తే తెలంగాణ

# చెప్పులు కొంటే రూ.1.21 లక్షలు మాయం

- ఖమ్మం జిల్లాలో సైబర్ నేరం

**పెనుబల్లి :** ఖమ్మం జిల్లాలో సైబర్ క్రైం వెలుగు చూసింది. ఆన్‌లైన్‌లో చెప్పులు కొనుగోలు చేసిన ఓ బాధితుడిని ఖాతా నుంచి రూ. 1,21,000 నగదు మాయమయ్యింది. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీయం బంజరుకు చెందిన చిట్లూరి సత్యనారాయణ ఈ నెల 21న స్నాప్‌డీల్ యాప్ ద్వారా రూ.799ల విలువ గల చెప్పులను బుక్ చేశాడు. అవి 26న డెలివరీ అయ్యాయి. చెప్పులు తక్కువ సైజులో ఉండటంతో తిరిగి పంపించేందుకు కంపెనీ అడ్రస్‌కోసం నెట్‌లో వెతికాడు. దీన్ని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరగాడు సత్యనారాయణ ఫోన్‌కు ఓ లింకును పంపాడు. సత్యనారాయణ లింకును ఓపెన్ చేయగానే అకౌంట్ నుంచి రూ.1900 డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు బ్రాంచికి వెళ్లి తన అకౌంట్‌ను స్తంభింపజేయమని బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. మేనేజర్‌తో మాట్లాడుతుండగానే మరోసారి రూ.99,000 డ్రా అయినట్లు మేసేజ్ వచ్చింది. ఖమ్మం సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగా రూ. 21,999 నగదు డ్రా అయినట్లు మేసేజ్ రావడంతో ఖంగుతిన్నాడు. ఆన్‌లైన్‌లో చెప్పులు కొన్న పాపానికి రూ.1,21,993లు పోగొట్టుకోవాల్సి వచ్చిందని బాధితుడు వాపోయాడు.



సీఎస్ ఎస్కే జోషి వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లుకు పంపిన లేఖ.. పెనుగోలు గుట్టలు దిగి వస్తున్న వైద్యాధికారి బృందం(ఫైల్)

# వాజేడు వైద్యాధికారికి సీఎస్ ప్రశంసలు

**వాజేడు(ములుగు) :** వానల్ని లెక్క చేయకుండా వాజేడుకు 20 కిలోమీటర్ల దూరంలో గుట్టల్లో ఉన్న పెనుగోలు గ్రామానికి కాలినడకన వెళ్లి గిరిజనులకు వైద్యసేవలందించిన వాజేడు వైద్యాధికారి మంకిడి వెంకటేశ్వర్లు, సిబ్బందిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి బుధవారం ప్రశంసించారు. ఈ మేరకు వారిని అభినందిస్తూ లేఖ పంపించారు. సీఎస్ లేఖతో తనపై మరింత బాధ్యత పెరిగిందని వెంకటేశ్వర్లు అన్నారు.

# కులవృత్తులకు సర్కారు చేయూత

## వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ చైర్మన్ శంభయ్య

**వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కులవృత్తులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని రాష్ట్ర వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ చైర్మన్ పీ శంభయ్య పేర్కొన్నారు. బుధవారం వరంగల్‌అర్బన్ జిల్లా కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల కోసం చేపట్టిన కార్యక్రమాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులవృత్తి చేస్తున్న వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అధికారులు కార్యదీక్షతో ముందుకు సాగాలని కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అలోక్‌కుమార్ పేర్కొన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టరేట్ సమావేశంలో మాట్లాడుతున్న శంభయ్య



వరంగల్‌లో ముఠా సభ్యుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న సీపీ రవీందర్

# పార్థీ గ్యాంగ్ సభ్యుల అరెస్టు

**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్‌కు చెందిన నలుగురిని బుధవారం అరెస్టు చేసి రూ.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని వరంగల్ సీపీ విశ్వనాథ రవీందర్ తెలిపారు. మధ్యప్రదేశ్ విదిషా జిల్లా గులాంగంజ్‌కు చెందిన పెంటియా పార్థీ, రాజేశ్ మోంగియా, రాజేంద్రసింగ్, చంగిరాం, మ రో బాల నేరస్థుడు వరంగల్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడుతున్నారు. బుధవారం మధ్యప్రదేశ్‌కు చెందిన నగల వ్యాపారి నారాయణ సోనికి నిందితులు ఆభరణాలు విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# యువత సమాజసేవలో పాల్గొనాలి

## తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత

**ఖలీల్ వాడి:** యువతలో సేవాతత్పరత పెరుగడం శుభపరిణామమని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. లక్ష్యసాధనకు కృషి చేస్తూనే సమాజసేవలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన 'ఇందూరు యువత' ఎనిమిదో వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అవమానాలు, పరాజయాలు ఎదురైనా, దెబ్బలు తగిలినా 'ఇందూరు యువత' అసోసియేషన్ తట్టుకొని నిలించిందన్నారు. ఎనిమిదేండ్లుగా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. 'ఇందూరు యువత'తో చాలా రోజుల నుంచి అనుబంధం ఉన్నదని, వారు పలు సందర్భాల్లో మాట్లాడినప్పుడు మేము ఎవ్వరి దగ్గర ఆర్థిక సాయం తీసుకోకుండా, వీలైనంత మేరకు మా డబ్బులతోనే కార్యక్రమాలు చేస్తున్నామని, కొంత మేర ప్రభుత్వం కూడా సహాయం చేస్తుందని చెప్పారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశం మనకు ఏమిస్తుందనేది పక్కనబెట్టి.. దేశానికి ఏం ఇవ్వాలనే ఆలోచన మొదలుపెడితే అంతా మంచే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, ఐసీడీఎస్ ఆర్గనైజర్ బంగారు నవనీత, ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్యగౌడ్, ఇందూరు యువత అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో అవంతిరావును పరామర్శిస్తున్న కల్వకుంట్ల కవిత



నిజామాబాద్‌లో 'ఇందూరు యువత అసోసియేషన్' వార్షికోత్సవంలో మాట్లాడుతున్న నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత

**జాగృతి జిల్లా అధ్యక్షుడికి పరామర్శ**

**ఇందూరు:** తెలంగాణ జాగృతి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అవంతిరావు తండ్రి విఠల్‌రావు ఇటీవల మృతిచెందడంతో బుధవారం మాజీ ఎంపీ కవిత వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. తెలంగాణ ఉద్యమంలో విఠల్‌రావు పాత్రను గుర్తు చేసుకున్నారు. ఆమె వెంట ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్‌కో చైర్మన్ ఎస్ఏ అలీం, మాజీ మేయర్ ఆకుల సుజాత తదితరలు ఉన్నారు.

### రేపు వనపర్తికి సీఎం కేసీఆర్

**వనపర్తి విద్యావిభాగం :** ఈ నెల 2న వనపర్తికి సీఎం కేసీఆర్ రానున్నట్టు ఇన్‌చార్జి ఎస్పీ రెమారాజేశ్వరి తెలిపారు. శుక్రవారం జరిగే మంత్రి నిరంజన్‌రెడ్డి మాతృమూర్తి తారకమ్మ దశదినకర్మ కార్యక్రమానికి సీఎం హాజరవుతారన్నారు. ఈమేరకు బుధవారం పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్షించారు.

### రాజన్న ప్రసాదాల ధర పెంపు

**వేములవాడ కల్చరల్:** వేములవాడ రాజన్న ప్రసాదాల ధర పెరిగింది. 100 గ్రాముల లడ్డూ రూ.15 ఉండగా రూ.20కు, 400 గ్రాముల లడ్డూ ధర రూ.50 నుంచి రూ.100కు, 800 గ్రాముల లడ్డూ ధరను రూ.100 నుంచి రూ.200కు, 250 గ్రాముల పులిహోర ధరను రూ.15కు పెంచినట్టు బుధవారం ఆలయాధికారులు తెలిపారు.



జనగామ జిల్లా పాలకుర్తి మండలం తిరుమలగిరిలో ఓ రైతుకు చెందిన పాడుబడ్డ బావిలో రెండు ఎలుగుబంటి పిల్లలు పడ్డాయి. నిచ్చెన సాయంతో బయటకు తీసేందుకు అటవీ అధికారులు యత్నించి విఫలమయ్యారు. గురువారం ఉదయం వలలసాయంతో బయటకు తీస్తామని అధికారులు తెలిపారు. - పాలకుర్తి రూరల్

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో బుధవారం కాడెద్దులు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన రాథోడ్ సంతోష్ తన ఇంటి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో కాడెద్దులను కట్టేశాడు. వర్షం కారణంగా ఎర్త్ కావడంతో ఎద్దులు మృతిచెందాయి. -భీంపూర్



### మందుపాతర పేలి జవాన్ మృతి

**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో ఘటన**

**కొత్తగూడెం క్రైం:** ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ జవాన్ ప్రాణాలు కోల్పోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ పుష్పల్ 195 క్యాంపునకు చెందిన సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ భద్రత బలగాలు జిల్లా సరిహద్దులోని అటవీప్రాంతంలో మంగళవారం రాత్రి సెర్చ్‌ఆపరేషన్ నిర్వహించి తెల్లవారుజామున వెనుదిరిగాయి. ఉదయం 6 గంటల సమయంలో వారు బోద్దీ గ్రామం మీదుగా వెళ్తుండగా మందుపాతర పేలింది. ప్రమాదంలో బెటాలియన్‌కు చెందిన జవాన్ రౌషన్‌కుమార్ (23) అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పుష్పల్ క్యాంపునకు తరలించారు. రౌషన్‌కుమార్ బీహార్ రాష్ట్రంలోని నలంద జిల్లా వాసి అని పోలీసులు తెలిపారు.



ఎన్‌కౌంటర్ జరిగిన పందిగుట్ట ప్రాంతం, ఇన్‌సెట్లో లింగన్న (ఫైల్)

# భద్రాద్రి జిల్లాలో ఎన్‌కౌంటర్

## ఎన్డీ దళకమాండర్ లింగన్న మృతి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డ సమీపంలోని పందిగుట్టపై బుధవారం ఉదయం పోలీసులు – సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాయలవర్గం మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆ పార్టీకి చెందిన అజ్ఞాత దళకమాండర్ పూనెం లింగన్న (44) మృతిచెందాడు. గ్రేహౌండ్స్ దళాలు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న క్రమంలో న్యూడెమోక్రసీ రాయల వర్గానికి చెందిన లింగన్నదళం తారసపడటంతో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో దళకమాండర్ లింగన్న అక్కడికక్కడే మృతిచెందాడు. లింగన్న మృతదేహాన్ని తరలిస్తుండగా ఆదివాసులు పోలీసులపై దాడిచేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకున్నది.

## బీఈడీ కాలేజీల్లో గరిష్ఠ ట్యూషన్ ఫీజు 36 వేలు

- మూడు విద్యాసంవత్సరాలకు వర్తింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో ట్యూషన్ ఫీజులను పెంచుతూ తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ నిర్ణయం తీసుకున్నది. కనిష్ఠంగా రూ.16 వేలు, గరిష్ఠంగా రూ.36 వేల చొప్పున ట్యూషన్ ఫీజులను పెంచామని టీఏఎఫ్ఆర్సీ అధికారి ఒకరు ధ్రువీకరించారు. పెరిగిన ట్యూషన్ ఫీజులు ఈ విద్యాసంవత్సరం నుంచి మూడేండ్ల వరకు అమలులో ఉంటాయని తెలిపారు. పెరిగిన ఫీజులపై త్వరలోనే ప్రభుత్వం జీవో విడుదల చేయనుందని, కాలేజీలవారీగా ఆదాయ లెక్కలను పరిగణనలోకి తీసుకుని ఫీజులను పెంచాయని వివరించారు.

## నెలాఖరుకల్లా కానిస్టేబుల్ ఫలితాలు?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ఫలితాల విడుదల మరికొంత ఆలస్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) అధికారులు మూల్యాంకన ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆగస్టు చివరికల్లా కానిస్టేబుల్ ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. మొత్తం 16,925 సివిల్ కానిస్టేబుల్, 231 టెక్నికల్ కానిస్టేబుల్ పోస్టుల ఫలితాల కోసం వేల మంది ఎదురుచూస్తున్నారు. తుది ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బోర్డు అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. మూల్యాంకనం తుది దశకు చేరినప్పటికీ ఒకటికి రెండుసార్లు ఫలితాలను సరిచూస్తున్నట్టు తెలిసింది. అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరుగకుండా మూల్యాంకనం చేపడుతున్నారు.

## 7 నుంచి పీజీఈసెట్ కౌన్సెలింగ్

- అడ్మిషన్ కమిటీ చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కాలేజీల్లో ఆగస్టు 7 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పీజీఈసెట్ అడ్మిషన్ కమిటీ చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. బుధవారం అడ్మిషన్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 7 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, 8 నుంచి వెబ్ఆప్షన్ల ఎంపిక ఉంటుందన్నారు. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజును రూ.1,200, ఎస్సీ, ఎస్టీలకు రూ.600 అని నిర్ణయించారని, pgecet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

**త్వరలోనే లాసెట్ కౌన్సెలింగ్**

లాసెట్, పీజీలాసెట్ కౌన్సెలింగ్ తేదీలను త్వరలో విడుదల చేస్తామని కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. బార్ కౌన్సిల్ నుంచి పూర్తిస్థాయిలో కళాశాలలకు అనుమతి వచ్చిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని కన్వీనర్ చెప్పారు.



బుధవారం ఢిల్లీలో ఎన్సీటీతో కలిసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏర్పాటుచేసిన తొలి వార్షికోత్సవానికి తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. హ్యాపినెస్ కరికులం, ఇన్నోవేషన్ కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. - హైదరాబాద్, నమస్తే తెలంగాణ



## ఫార్మాసిటీకి నిమ్జ్ హోదా ఇవ్వండి

- లోక్‌సభలో చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఫార్మాసిటీకి నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్) హోదా ఇవ్వాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయే ఫార్మాసిటీకి నిమ్జ్ హోదా ఇవ్వడానికి ఇప్పటికే కేంద్రం ప్రాథమికంగా అంగీకరించిందని గుర్తుచేశారు. బుధవారం లోక్‌సభలో రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ ఫార్మా జోన్‌గా ఉన్నదని, ఇక్కడ 600 ఫార్మా, 200 బయోటెక్ కంపెనీలు ఉన్నాయని తెలిపారు. రూ.22 వేల కోట్ల విలువైన ఫార్మా, బయోటెక్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని పేర్కొన్నారు. దేశం నుంచి ఫార్మా, బయోటెక్ రంగంలో జరిగే ఎగుమతుల్లో మూడో వంతు హైదరాబాద్ నుంచే ఉన్నాయని చెప్పారు. అందుకే సీఎం కేసీఆర్ ఫార్మాసిటీ ఏర్పాటుకు నిర్ణయించారని తెలిపారు. దీనిద్వారా రూ.60 వేలకోట్ల పెట్టుబడులు వస్తాయని, రూ.50 వేల కోట్ల ఎగుమతులు జరుగుతాయని, 4.2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేసినట్టు చెప్పారు. ఇందుకోసం భూ సేకరణ జరుగుతున్నదని రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు.

# జాతీయ జలవిధానం తేవాలి

- పలు సందర్భాల్లో దీని ప్రాధాన్యాన్ని సీఎం కేసీఆర్ చెప్పారు
- ప్రస్తుత బిల్లు అన్నిరకాల నీటి సమస్యలను పరిష్కరించదు
- కాళేశ్వరంతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు



లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు

**ఖమ్మం, నమస్తే తెలంగాణ:**

నీటి అవసరాలు తీర్చేందుకు జాతీయ జలవిధానం తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు చెప్పారు. జాతీయ జలవిధానం ప్రాధాన్యాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పలు సందర్భాల్లో చెప్పారని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం అయిన కాళేశ్వరం ప్రాజెక్టును తాగు, సాగునీటి అవసరాల కోసం నిర్మించారని, దీనిద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. బుధవారం లోక్‌సభలో అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల సవరణ బిల్లు-2019పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ బిల్లుకు టీఆర్ఎస్ మద్దతిస్తున్నట్టు చెప్పారు. దేశానికి ఈ బిల్లు అవసరం ఉన్నదని, అయితే ఇది దేశంలోని నదీజలాల సమస్యలను పూర్తిగా పరిష్కరించేంతగా లేదన్నారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం దేశంలో ఏటా 70వేల టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తున్నదని, ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా ఇంకా తాగు, సాగునీరు కష్టాలను తీర్చలేకపోతున్నారన్నారు. దేశంలో 40వేల టీఎంసీల నీరు వ్యవసాయానికి సరిపోతాయి, అయితే సరైన ప్రణాళిక లేకపోవడంవల్ల అంతకు రెండింతల నీరు సముద్రంలో కలుస్తున్నదని చెప్పారు. 40 వేల టీఎంసీల నీళ్లు వ్యవసాయానికి, 10 వేల టీఎంసీల నీరు తాగు, పారిశ్రామిక అవసరాలకు సరిపోతాయని, ఈ విషయమై సరైన ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ విషయమై తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. నీటి అవసరాలు తీర్చేందుకు జాతీయ జలవిధానం తీసుకురావాలని పలుమార్లు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

**33 ఏండ్ల నాటి సమస్యను మూడేండ్లలో..**

తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమయిన కాళేశ్వరం ప్రాజెక్టును తాగు, సాగునీటి అవసరాలు తీర్చటానికి నిర్మించారని తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను పలుమార్లు కలిసి అంతర్రాష్ట్ర జలవివాదాన్ని పరిష్కరించారని చెప్పారు. 33 ఏండ్లుగా ఉన్న అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల సమస్యను మూడేండ్లలో పరిష్కరించి చూపటమే కాకుండా.. ముగ్గురు సీఎంలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. భారత తొలి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ తన మొదటి ప్రసంగంలోనే దేశంలోని నదులపై ప్రాజెక్టులు కట్టి సమస్యలు తీర్చాలని సూచించారన్నారు. ఈ విషయమై మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం కూడా నదులను అనుసంధానం చేయాలని సూచించారని నామా తన ప్రసంగంలో పేర్కొన్నారు. 17 వ లోక్‌సభ సమావేశాల్లో రాష్ట్రపతి తన ప్రసంగం సందర్భంగా కూడా 21వ శతాబ్దంలో నీటి కొరత ఏర్పడనున్నదని హెచ్చరించారని, ఏకంగా రాష్ట్రపతులు సూచించినా నీటికష్టాలు తీర్చలేకపోయారని చెప్పారు. డిస్ప్యూట్ రిజల్యూషన్ కమిటీ (డీఆర్సీ)లో పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల ఆరునెలల సమయం అవసరం ఎందుకని, ఆరునెలల్లోనే సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సీడబ్ల్యూసీ, రాష్ట్రాల దగ్గర సమాచారం ఉండగా సింగిల్ ఏజెన్సీ దగ్గర సమాచారం తీసుకోవాలనే దానిగురించి ఆలోచించాలన్నారు. అంతర్రాష్ట్ర నదీ వివాదాలు పరిష్కరించేందుకు కేంద్రం అజమాయిషీ, రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించడంతోపాటు రాష్ట్రాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. దేశంలో ఉన్న నదుల్లోని నీటిని సమర్థంగా వినియోగించేందుకు జాతీయ జలవిధానం తీసుకురావాలని, తద్వారా సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయని నామా చెప్పారు.

## ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ నుంచి.. ప్రైవేటు స్కూళ్లకు మినహాయింపు

- జీవో జారీచేసిన హోంశాఖ ముఖ్య కార్యదర్శి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లకు సర్కారు ఊరట కల్పించింది. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ నుంచి మినహాయిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఫైర్ సేఫ్టీ ఎన్వోసీ లేకపోయినప్పటికీ ప్రైవేటు స్కూళ్లు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రాజీవ్‌త్రివేది జీవో విడుదల చేశారు. జీవో ప్రకారం ఫైర్ సేఫ్టీకి సంబంధించిన అన్నిరకాల పరికరాలు తప్పకుండా ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో 2009 కంటే ముందు ఏర్పాటుచేసిన తొమ్మిది వేల ప్రైవేటు పాఠశాలలకు ప్రయోజనం కలుగుతుందని ట్రస్మా రాష్ట్ర నాయకులు శ్రీనివాసరెడ్డి, యాదగిరి శేఖర్‌రావు చెప్పారు. ఇది ఊరట కలిగించే విషయమని, ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు
- అందుబాటులో అవసరమైన మందులు
- ప్రత్యేక అవసరాలరీత్యా గ్రామీణ వైద్య సిబ్బంది సెలవులు రద్దు
- మీడియాతో మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖలోని అన్ని విభాగాలు అప్రమత్తం కావాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశించారు. వ్యాధులు విస్తరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విషజ్వరాల అదుపునకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సబ్ సెంటర్ స్థాయి నుంచి టీచింగ్ హాస్పిటల్స్ వరకు అప్రమత్తం కావాలని, అత్యవసర వైద్యసేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పామన్నారు. సీజనల్ వ్యాధులకు అవసరమైన మందులు, పరీక్షల కిట్లు, వైద్యులు, సిబ్బందిని సంసిద్ధం చేయాలని, అంటువ్యాధులు, విషజ్వరాలను అదుపుచేసేలా ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉన్నదని, ఇందుకుగాను అన్నిచోట్ల యాంటీవీనమ్ మందులను అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



**వైద్యులు, సిబ్బందికి సెలవులు రద్దు**

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించాల్సిన వైద్యులు, వైద్య సిబ్బందికి సెలవులు రద్దుచేస్తున్నామని, దీనిపై ఆయా విభాగాలకు సర్క్యులర్ జారీచేసినట్టు మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. దవాఖానల్లో మంచాలపై దుప్పట్లను ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున పెచ్చులూడిన గదుల్లో రోగులను ఉంచకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య కేంద్రాల పరిసరాల్లో పిచ్చిమొక్కలు తొలిగించాలని, మూత్రశాలలు, మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, హాస్పిటళ్ల ప్రాంగణంలోకి పందులు, కుక్కలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల వివిధ శాఖలతో సమన్వయం చేసుకొంటూ ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తం కావాలని, జ్వరం వచ్చినట్టు అనిపించగానే వెంటనే సమీప ప్రభుత్వ దవాఖానకు వెళ్లి పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకొంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుందని పేర్కొన్నారు. గత సీజన్‌లో ఏజెన్సీ ప్రాంతాల్లో దోమతెరలు ఉచితంగా పంపిణీ చేశామని, వాటిని వినియోగిస్తే దోమ సంబంధ విషజ్వరాలు పూర్తిగా అదుపులో ఉంచుకోవచ్చని తెలిపారు.

## ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా స్టీఫెన్ రవీంద్ర!

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా స్టీఫెన్ రవీంద్ర నియామకానికి లైన్‌క్లియర్ అయింది. ఇంటర్ స్టేట్ డిప్యుటేషన్‌కు కేంద్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది. రెండు మూడురోజుల్లో డిప్యుటేషన్ లెటర్‌ను తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం పంపనున్నది. అనంతరం స్టీఫెన్‌ను ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్ కింద తెలంగాణ ప్రభుత్వం పంపనున్నది. ప్రస్తుతం స్టీఫెన్‌రవీంద్ర రెండు నెలలుగా సెలవులో ఉన్నారు. ఏపీ సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి స్టీఫెన్‌రవీంద్రను ఇంటెలిజెన్స్ చీఫ్ నియమించాలని భావించారు. స్టీఫెన్‌ను ఏపీకి బదిలీచేయాలని తెలంగాణను ఆయన కోరగా.. తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అయితే, ఇందుకు సంబంధించిన ఫైల్ కొన్ని వారాలుగా కేంద్ర హోంశాఖ వద్ద పెండింగ్‌లో ఉండగా.. దానికి ఇప్పుడు ఆమోదం లభించింది.

## ముస్కాన్‌లో 26,946 మందికి విముక్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆపరేషన్ ముస్కాన్ కింద ఇప్పటివరకు 26,946 మంది చిన్నారులను వెట్టి నుంచి రక్షించామని మహిళా, శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ కేఆర్ఎస్ లక్ష్మీదేవి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని, పోలీసులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, చైల్డ్ వెల్ఫేర్, కార్మిక శాఖల సహకారంతో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నదని అన్నారు. ఐదో విడుతలో భాగంగా ఈ ఏడాది జూలై ఒకటినుంచి 30 వరకు 3,470 మంది చిన్నారులకు వెట్టినుంచి విముక్తి కల్పించామని తెలిపారు. వీరిలో 3,024 మంది బాలురు, 446 బాలికలు ఉన్నట్టు బుధవారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. వారిలో బీహార్‌కు చెందిన 84 మంది, ఒడిశా ముగ్గురు, ఏపీ 25 మంది, అసోం ఒకరు, జార్ఖండ్ 25 మంది, కర్ణాటక 21 మంది, మహారాష్ట్ర నలుగురు, యూపీ 23 మంది, పశ్చిమబెంగాల్ 17 మంది, రాజస్థాన్ 51 మంది, మధ్యప్రదేశ్ 48 మంది, నేపాల్ ఐదుగురు, గుజరాత్ చెందిన ఇద్దరు చిన్నారులు ఉన్నారని వివరించారు. రాష్ట్రానికి చెందిన 309 మంది చిన్నారులను 70 శిశువిహార్లలో సంరక్షిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో పట్టుబడినవారిలో ఇప్పటికే సగానికిపైగా వారి బంధువులు, తల్లిదండ్రులు, రక్త సంబంధీకులకు అప్పజెప్పామన్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం
జోగులాంబ గద్వాల జిల్లా

లేఖ సంఖ్య : ఎ2/43/2015 తేది : 30-04-2019

భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము, 2013 (చట్టము నెం. 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

డి.ఒ. నెం. : 07/2019 తేది : 30-04-2019

ఫారం - 6

ప్రాథమిక ప్రకటన

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం, మిర్జాపురం గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.0.28 సెంట్ల భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా Package No. 104, Right Main Canal & U.T. నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల జిల్లా గారు భావిస్తున్నారు. తెలంగాణ భూసేకరణ చట్టము 2016 (యాక్ట్ నెం. 21/2017) సెక్షన్ 10ఎ క్రింద మినహాయింపు ఇవ్వియున్నారు. కావున నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావము అధ్యయనం వేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

షెడ్యూల్

గ్రామం : కొండాపూర్ మండలము : కె.టి. దొడ్డి జిల్లా : జోగులాంబ గద్వాల

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | [illegible] | [illegible] | [illegible] | 0.28 | [illegible] | | | | | - | - | - | - |
| | మొత్తం విస్తీర్ణం | | | 0.28 | | | | | | | | | |

భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (నెం. 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)కి అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి [illegible] ఈ ప్రకటన జారీ చేయడమైనది.

[illegible]

DIPR No.446/LA/PP-Advt/Agency/2019-20



తెలంగాణ ప్రభుత్వం
పశువైద్య మరియు పశు సంవర్థక సంచాలకుల కార్యాలయం, హైదరాబాద్

పత్రికా ప్రకటన

పశువైద్య మరియు పశు సంవర్థక సంచాలకులు, తెలంగాణ రాష్ట్రం వారు 2019-20 మరియు 2020-21 సంవత్సరానికి రేట్ కాంట్రాక్ట్‌పై పశువైద్య మరియు కృత్రిమ గర్భధారణ పరికరం, పశువైద్య డయాగ్నోస్టిక్ & లేబోరేటరి అవసరాలు మరియు సకలవిధ ల్యాబ్ యానిమల్ అవసరాలు సరఫరా కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం (https://tender.telangana.gov.in) పై బిడ్లు కోరుతున్నారు. ఆసక్తిగల బిడ్డర్లు తదుపరి వివరాల కోసం వెబ్‌సైట్ చూడండి.

సం/- సంచాలకులు, పశువైద్య మరియు పశు సంవర్థక శాఖ, శాంతినగర్, హైదరాబాద్

DIPR RO. No. 772-DP/CL/Advt/1/2019-20, Dt: 31/07/2019


# మహోన్నత కవి సినారె

- పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- గోరటి వెంకన్నకు సినారె పురస్కారం ప్రదానం



సినారె సాహితీ పురస్కారాన్ని గోరటి వెంకన్నకు ప్రదానం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో సారస్వత పరిషత్ చైర్మన్ ఎల్లూరి శివారెడ్డి, సంగీత నాటక అకాడమీ అధ్యక్షుడు బీ శివకుమార్ తదితరులు కూడా ఉన్నారు.

**తెలుగు యూనివర్సిటీ:** మహోన్నత వ్యక్తిగా ఎదిగి.. విశ్వమంతా సాహిత్యస్ఫూర్తిని పంచిన సీ నారాయణరెడ్డి కీర్తి అజరామరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి వీ శ్రీనివాసగౌడ్ అన్నారు. సినారె పేరిట తెలంగాణ సారస్వత పరిషత్ నెలకొల్పిన సాహిత్య పురస్కారాన్ని బుధవారం ప్రఖ్యాత కవి, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు ప్రదానం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాంగణంలోని దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో గోరటి వెంకన్నకు సినారె పురస్కారం కింద రూ.25 వేల నగదు, శాలువా, జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఒకనాడు తెలంగాణలోని కరువు స్థితిగతులను కవులు తమ కవిత్వం ద్వారా వర్ణించేవారని.. ఇప్పుడు సస్యశ్యామలమవుతున్న తెలంగాణను తమ రచనల ద్వారా ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు. సారస్వత పరిషత్ అధ్యక్షుడిగా వ్యవహరించిన సినారె ఆ సంస్థకు పునరుజ్జీవనాన్ని కల్పించారని పరిషత్ ప్రస్తుత అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా గోరటి వెంకన్న.. పాట-ప్రకృతి అన్న అంశంపై ప్రసంగించారు. పాటలు పాడుతూ ఆహూతులను ఊర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సంగీతనాటక అకాడమీ అధ్యక్షుడు బీ శివకుమార్, పరిషత్ కార్యదర్శి చెన్నయ్య, కవి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సినారె వైభవం శీర్షికన నిర్వహించిన కవి సమ్మేళనంలో దాసోజు పద్మావతి, సీహెచ్ సీతాలక్ష్మి, కే చంద్రశేఖర్, ఒద్దిరాజు ప్రవీణ్, పత్తిపాక మోహన్, కే మురళి, ఎం సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

## కొత్త జిల్లాలకు నవోదయ స్కూళ్లు ఇవ్వండి

- కేంద్ర మంత్రికి విన్నవించిన ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి



కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్‌పోఖ్రియాల్‌కు వినతిపత్రం అందిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కొత్త జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలతోపాటు కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటుచేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్‌పోఖ్రియాల్‌కు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. షాద్‌నగర్- దేవరకద్ర మధ్యలో నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటుచేసి గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూడాలని కోరారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం ఒక్కటి కూడా లేదని.. కనీసం ఒక్కటైనా మంజూరు చేయాలన్నారు. అత్యంత వెనకబడిన ప్రాంతాలైన నారాయణపేట, కొడంగల్, మక్తల్ ప్రాంతాల్లో ఏదో ఒకచోట కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటుచేస్తే బాగుంటుందని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు జరుగుతున్నాయని, మరో కేవీ ఏర్పాటుచేయడం వల్ల కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. తాను చేసిన విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## రేపటి సమ్మెలో పాల్గొనడం లేదు

- ఆందోళనతో మాకు సంబంధం లేదు
- టీవీఆర్వోల సంఘం ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శుక్రవారం (ఆగస్టు 2న) నిర్వహించే వీఆర్వోల ఆందోళనతో తమకు సంబంధం లేదని, సమ్మెలో తాము పాల్గొనడం లేదని తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోల్కొండ సతీశ్, ప్రధాన కార్యదర్శి పీ రాజేశ్, అసోసియేట్ ప్రెసిడెంట్ కే భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సంఘ నాయకులు సీసీఎల్ఏ కార్యాలయంలో ప్రధాన సంఘాలతో ట్రేసా (తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం), తాసిల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, వీఆర్ఏ నాయకులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు. రెవెన్యూ ఉద్యోగులు చేస్తున్న సేవలతో ప్రజలకు, ప్రభుత్వానికి మేలు జరుగుతున్నదని తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న తప్పిదాలు, వారి కబ్జా భూములు కాపాడుకునేందుకు రెవెన్యూ ఉద్యోగులపై తప్పుడు ప్రచారంతోపాటు దాడులు చేస్తున్నారని అన్నారు. చరిత్రాత్మకమైన రెవెన్యూశాఖను ఛిన్నాభిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, దీనికి నిరసనగా రెవెన్యూశాఖలోని అన్ని సంఘాల సమ్మేళనంతో భవిష్యత్తులో వినూత్నమైన నిరసనలు చేస్తామని తెలిపారు. ప్రజలవద్దకు వెళ్లి పాలనలో ఉన్న సమస్యలు వివరిస్తూనే, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.

## విధాన నిర్ణయంలో జోక్యం చేసుకోలేం

- ఆయుర్వేదిక్ హాస్పిటల్ తరలింపుపై హైకోర్టు
- ప్రభుత్వ మెమోను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వాలు తీసుకొనే విధాన నిర్ణయాల్లో కోర్టులు జోక్యం చేసుకోలేవని హైకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. ఆయుర్వేదిక్ హాస్పిటల్‌ను తరలిస్తూ ప్రభుత్వం జారీచేసిన మెమోను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు ప్రకటించింది. చార్మినార్‌లోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ దవాఖానను ఎర్రగడ్డకు తరలిస్తున్నట్టు ఈ నెల 19వ తేదీన వైద్య, ఆరోగ్యశాఖ మెమో జారీచేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ మెమోను సస్పెండ్‌చేసి తరలింపును నిలిపేయాలని పిటిషనర్ కోరారు. ఆయుర్వేదిక్ దవాఖాన పునరుద్ధరణ పనుల నిమిత్తం తరలిస్తున్నట్టు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తీసుకొనే పాలసీ డెసిషన్స్‌లో జోక్యం చేసుకోలేమని పేర్కొన్న ధర్మాసనం.. పిటిషన్‌ను కొట్టేసింది.

## తలాక్ నిషేధ చట్టం రాజ్యాంగ విరుద్ధం

- దీనిపై సుప్రీంకోర్టుకువెళ్తాం: అసద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం రాజ్యాంగవిరుద్ధమని, ఉభయసభల్లో ఆమోదంపొందినా దానిపై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తామని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంచేసిన చట్టం ముస్లింల ఆచార వ్యవహారాలకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నదని పునరుద్ఘాటించారు. ముస్లింలను ప్లాన్‌ప్రకారం అణచడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒక కుట్ర అని ఆరోపించారు. ముస్లిం పురుషులను కించపరచడమే కాకుండా మహిళలను కూడా ఇబ్బందుల పాలుచేసేలా కేంద్రం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ట్రిపుల్ తలాక్ చట్టానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముందని చెప్పారు.

## కొత్త అసెంబ్లీ కట్టుకుంటే తప్పేమిటి?

మొదటిపేజీ తరువాయి...

కట్టుకొన్నారు. మధ్యప్రదేశ్ నుంచి విడిపోయిన తర్వాత భోపాల్‌లో కంటే పెద్దదైన అసెంబ్లీ భవనాన్ని జైపూర్‌లో నిర్మించారు. తద్వారా తమ ఉనికి, తాము ఇక్కడ ఉన్నాం.. అనే సందేశాన్ని పంపారు. భారత స్వాతంత్ర్య పోరాటం స్థాయిలో అనలేం కానీ, భారీస్థాయిలో సుదీర్ఘ పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొన్నారు. అలాంటి రాష్ట్రంలో అసెంబ్లీ భవనం కట్టడం తప్పెలా అవుతుంది? ప్రభుత్వం పాలనతో తమ మార్కును చూపించాలనుకోవడంపై అభ్యంతరాలు ఎందుకు ఉండాలి?' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అసెంబ్లీ నిర్మాణంలో తమకు అభ్యంతరం లేదని, ఖాళీ ప్రదేశంలో అసెంబ్లీ నిర్మించుకోవచ్చని పిటిషనర్ల తరపు న్యాయవాది నళిన్‌కుమార్ తెలిపారు. హెరిటేజ్ భవనం కూలగొట్టాలనుకోవడంపైనే తమ అభ్యంతరం అని పేర్కొన్నారు. హెరిటేజ్ భవనాలను రక్షించడం ప్రభుత్వం బాధ్యత అని తెలిపారు. ఈ దశలో జోక్యం చేసుకొన్న ధర్మాసనం.. హెరిటేజ్ భవనాల జాబితాలో మార్పులు చేసే అధికారం హెచ్ఎండీఏకు ఉన్నదా? లేదా? తెలుపాలని ఆదేశించింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

## హాజీపూర్ హత్యకేసుల్లో చార్జిషీట్ దాఖలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాజీపూర్‌లో ముగ్గురు బాలికలపై లైంగికదాడి, హత్య కేసుల దర్యాప్తు బుధవారం పూర్తయింది. భువనగిరి యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం హాజీపూర్‌లో జరిగిన ఈ మూడు కేసుల చార్జిషీట్‌ను నల్లగొండ జిల్లా పోక్సో కోర్టులో దాఖలు చేశారు. 90 రోజుల్లో మొత్తం దర్యాప్తును పూర్తిచేసి నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డికి శిక్ష పడేవిధంగా అన్ని ఆధారాలను సేకరించినట్టు పోలీసులు తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కేసుల విచారణ పూర్తికి కృషి చేస్తున్నామని భువనగిరి జోన్ డీసీపీ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



# గిరిజనుల భూమిని కాజేశారు

## రికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ చేతివాటం

- కాసులకు కక్కుర్తిపడి ఇతరులకు పట్టా
- నల్లగొండ జిల్లా పెద్దవూర మండల రెవెన్యూ అధికారుల లీలలు
- న్యాయం కోసం తిరుగుతున్న కుంకుడుచెట్టుతండావాసులు



పాత పట్టాదారు పాస్‌పుస్తకాలతో రమావత్ లక్పతి, అతడి భార్య లక్ష్మి, బాబాయ్‌లు

**పెద్దవూర:** నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని కుంకుడుచెట్టుతండాకు చెందిన రమావత్ లక్పతికి సర్వే నంబర్ 507లో 2.04 ఎకరాలు, సర్వే నంబర్ 507/1లో 24 గుంటలు, సర్వే నంబర్ 507/2లో 2.05 ఎకరాలు, అతడి భార్య రమావత్ లక్ష్మికి సర్వే నంబర్ 506లో 1.08 ఎకరాలు, సర్వే నంబర్ 508లో 1.08 ఎకరాలు, ఇద్దరికి కలిపి 9.26 ఎకరాల వారసత్వ భూమి ఉన్నది. మరోవైపు ఇదే తండాకు చెందిన రమావత్ గ్యామాకు సర్వే నంబర్ 505/1లో 1.20 ఎకరాలు, అతడి భార్య రమావత్ హాసిలి పేరిట సర్వే నంబర్ 505లో ఎకరం, గ్యామా వదిన రమావత్ ద్వాలి పేరున సర్వే నంబర్ 505లో 1.20 ఎకరాల బంచరాయి భూములున్నాయి. వీరికి 1986లో అప్పటి ప్రభుత్వం గిరిజన రైతులకు భూమికి సంబంధించిన పట్టాలిచ్చింది. రెవెన్యూ అధికారులు కూడా వారి పేరిట పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరుచేశారు. వీళ్లంతా తమ భూముల్లోనే కాస్తులో ఉంటూ పంటలు సాగుచేసుకొంటున్నారు. 2016 వరకు ఆయా భూములన్నీ గిరిజన రైతుల పేరిటే ఉన్నాయి. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో కొందరు రెవెన్యూ అధికారులు తమ చేతివాటం చూపారు. అక్రమార్కుల ఆమ్యామ్యాలకు ఆశపడి గిరిజనులకు చెందిన ఈ భూములను శాగం స్వాతి పేరిట దొంగచాటుగా పట్టాచేశారు. కొత్త పాస్‌పుస్తకాల్లో స్వాతి అనే పేరు రావడంతో బాధిత రైతులంతా ఖంగుతిన్నారు. తమ భూములను ఇతరులకు పట్టాచేయడమేంటని రెవెన్యూ అధికారులను నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తమ పేరిట ఉన్న భూములను ఇతరులకు అక్రమంగా పట్టాచేయడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ రైతులందరూ అప్పటి పెద్దవూర తాసిల్దార్, మిర్యాలగూడ ఆర్డీవో ముత్యంరెడ్డికి అర్జీ పెట్టుకొన్నారు. రికార్డులను సవరించి తమ పేరిట తిరిగి పట్టా చేయాల్సిందిగా వేడుకొన్నారు. అన్ని పత్రాలను పరిశీలించిన ఆర్డీవో గిరిజన రైతులకు అనుకూలంగా ఆదేశాలిచ్చారు. వారి భూములను స్వాతికి పట్టా చేయడం సరికాదని.. దాన్ని వెంటనే రద్దుచేయాలని అధికారులను ఆదేశించారు. అంతలోనే ఆ అధికారి బదిలీ కావడంతో ఆయన ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి. ఆ తర్వాత వచ్చిన తాసిల్దార్లు, ఆర్డీవోలకు దరఖాస్తులు చేసుకొన్నా.. విన్నవించుకొన్నా గిరిజన రైతుల సమస్యలను తీర్చేవారే లేకుండాపోయారు. కొందరు అక్రమార్కులు గిరిజనులు భూములు అమ్మినట్టు ఫోర్జరీ సంతకాలతో సాదాబైనామాలను సృష్టించి అక్రమంగా పట్టా చేసుకొన్నారని, కాసులకు కక్కుర్తి పడిన అధికారులు ఇందుకు సహకరించారని బాధిత రైతు రమావత్ లక్పతి ఆవేదన వ్యక్తంచేశారు. తమకు న్యాయంచేయాలని అధికారులను కలుస్తుండటంతో గమనించిన అక్రమార్కులు తమను భూమి మీదకు రాకుండా అడ్డుకొంటున్నారని.. బెదిరిస్తున్నారని బాధితుడు తెలిపారు. ఉన్నతాధికారులు ఈ విషయమై విచారణ నిర్వహించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకొంటున్నారు.

### ఎవరూ పట్టించుకోవడంలేదు

1986 లో అప్పటి ప్రభుత్వం మాకు బంచరాయి భూమికి పట్టాలిచ్చింది. ఆ భూముల్లో ఇప్పటివరకు మేమే కాస్తులో ఉన్నాం. కానీ రెవెన్యూ అధికారులు డబ్బులకు ఆశపడి మా భూములను అక్రమంగా ఇతరులకు పట్టాచేశారు. అక్రమ పట్టాలను రద్దుచేయాలని కోరుతూ ఏండ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మాకు తగిన న్యాయంచేయాలి.

**- రమావత్ లక్పతి, కుంకుడుచెట్టుతండా**

### దరఖాస్తు చేస్తే పరిశీలిస్తాం

భూములకు సంబంధించిన రైతులు దరఖాస్తు చేసుకొంటే పరిశీలిస్తాం. గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారుల తప్పిదాల కారణంగా గిరిజన రైతుల భూములకు సంబంధించి కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఆయా రైతులు తమ దగ్గర ఉన్న వివరాలతో వస్తే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

**- ప్రేమ్‌కుమార్, తాసిల్దార్**

# భూమి ఒకరిది.. పట్టా వేరొకరికి!

- వారసత్వ భూమి రికార్డుల్లో పేరుమార్పు
- మహబూబాబాద్ జిల్లా జయ్యారం రైతుల ఆవేదన



రైతులు సంపత్, యాకమ్మ

**చిన్నగూడూరు:** భూమి ఒకరిదైతే రెవెన్యూ అధికారులు పట్టా వేరొకరి పేరున ఇచ్చారు. వారసత్వంగా వస్తున్న తమ సొంత భూమి పట్టా పాస్‌పుస్తకాలు పేరుమార్చి మరొకరికి ఇచ్చారని మహబూబాబాద్ జిల్లా జయ్యారం గ్రామానికి చెందిన మహిళా రైతు నరిగె యాకమ్మ రెవెన్యూ అధికారుల తీరుపై విస్మయం వ్యక్తంచేస్తున్నారు. సర్వే నంబర్ 68/ఇలో తన పేరిట 1.20 ఎకరాల భూమి, తన కుమారుడు సంపత్ పేరిట సర్వే నంబర్ 69/ఆ/6లో 3.10 ఎకరాల భూమి ఉన్నది. వారసత్వంగా వస్తున్న భూమిని ఇప్పటికీ వారే సాగు చేసుకొంటున్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొన్నారు. అందులో మహిళా రైతు యాకమ్మ పేరిట ఎకరం, ఆమె కుమారుడు సంపత్ పేరిట రెండెకరాలకు మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారు. వీరిద్దరి పేరిట ఉన్న భూమిలో 1.30 ఎకరాలను రెవెన్యూ సిబ్బంది మరొకరి పేరిట పాస్‌పుస్తకాలు మంజూరుచేశారని యాకమ్మ ఆరోపిస్తున్నారు. తన భర్త యాదగిరి కొన్నేండ్ల కింద చనిపోవడంతో ఇబ్బందుల్లో ఉన్నామని వాపోయారు. ఏడాదిగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ తమకు వారసత్వంగా వచ్చిన భూమికి పాస్‌పుస్తకాలు అందించాలని అధికారుల కాళ్లావేళ్లా పడినా కనికరించడం లేదని 'ధర్మగంట'కు తన గోడు వెల్లబోసుకొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమ భూమికి సంబంధించిన పాస్‌పుస్తకాలు అందించాలని వేడుకొన్నారు.

### పొరపాట్లను సరిచేస్తాం

నరిగె యాకమ్మ తన భూమికి చెందిన సర్వే నంబర్లతో మరో రైతుకు పాస్‌పుస్తకం ఇచ్చారని కొన్నిరోజుల కిందట ఫిర్యాదుచేశారు. ఇరువర్గాలకు నోటీసులు పంపించి గ్రామంలో విచారణ చేపడుతాం. వాస్తవ రైతును గుర్తించి సర్వే నంబర్లలో జరిగిన పొరపాట్లను సరిచేస్తాం.

**- మాధవి, చిన్నగూడూరు తాసిల్దార్**

# అనర్హులకు పట్టాచేశారు

- న్యాయం చేయాలంటున్న ములుగు జిల్లావాసి సుభద్ర



**ములుగు రూరల్:** మాది ములుగు జిల్లా చిన్నగుంటూరుపల్లి. 60 ఏండ్ల క్రితం 37 గుంటలు, 30 ఏండ్ల క్రితం ఎకరం భూమిని నా భర్త తాటికొండ రాజయ్య కొన్నారు. 385/ఏ/1లో 37 గుంటలు, 385/బీ/అ1లో 20 గుంటలు, 385/బీ/ఆ1లో 20 గుంటల భూమి ఉన్నది. గతంలో గ్రామానికి చెందిన ముక్కు సుబ్బారెడ్డి అనే వ్యక్తి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మా భూమిని తన పేరు మీదికి మార్చుకొంటే, అప్పటి జిల్లా కలెక్టర్‌ను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించి న్యాయం కోసం పోరాడాం. అధికారుల విచారణలో భూమి మాదే అని తేలింది. ఆ సమయంలో అధికారులు నా భర్త పేరిట 1.37 ఎకరాలు ఎక్కించారు. అనారోగ్యం వల్ల నా భర్త రెండేండ్ల క్రితం చనిపోయారు. ఉన్న భూమిలో 37 గుంటలను నా కొడుకు ప్రశాంత్ పేరిట ఎక్కించారు. మిగతా ఎకరానికి పట్టా చేయకుండా మళ్లీ ముక్కు సుబ్బారెడ్డి పేరిట ఎక్కించారు. 37 గుంటలకు రైతుబంధు సాయం అందింది. అధికారులు మాదేనని నిర్ధారించిన తర్వాత కూడా ఎకరం భూమిని సుబ్బారెడ్డికి రాసేశారు. ఇదేమని వీఆర్వోను అడిగితే.. తనకేమీ తెలియదని.. తనకంటే ముందున్న వీఆర్వోను అడగాలని అంటున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే నా కొడుకు పేరిట భూమిని చేయాలని ఆదేశించినా స్థానిక వీఆర్వో చేయడం లేదు. ఈ విషయమై తాసిల్దార్‌ను, ఆర్డీవోను సైతం కలిశాం. పోలీసులను ఆశ్రయించాం. అయినా న్యాయం జరుగడంలేదు. పైసలున్నోళ్లదే రాజ్యం అయితున్నది. ప్రభుత్వం స్పందించి నాకు న్యాయం చేయాలి.

**- తాటికొండ సుభద్ర,**
**చిన్న గుంటూరుపల్లి, ములుగు జిల్లా**

# అన్నదమ్ముల మధ్య వీఆర్వో కయ్యం

- వారసత్వ భూమిని వేరొకరికి రాసిచ్చిన రెవెన్యూ సిబ్బంది
- ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోని తలకొండపల్లి అధికారులు



బాధితుడు రాఘవేందర్‌రావు

**తలకొండపల్లి:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకట నర్సింహారావు పేరిట ఉన్న 20.27 ఎకరాల వారసత్వ భూమిని తమకు విరాసత్‌చేయాలని వారసులైన రాఘవేందర్‌రావు, నర్సింహారావు, ప్రభాకర్‌రావు, విజయలక్ష్మి 2017లో దరఖాస్తు చేసుకొన్నారు. అప్పటి తాసిల్దార్ జ్యోతి.. వీరి పేరిట విరాసత్‌చేసి ప్రొసీడింగ్ (61-2017) అందజేశారు. ఈ భూమికి గత ఏడాది ప్రభుత్వం అందించిన రైతుబంధు సాయం పొందారు. ఈ ఏడాది కొంత భూమికి పెట్టుబడి సాయం అందకపోవడంతో అనుమానం వచ్చి ఆరాతీశారు. దాంతో తమ భూమిని మరొకరి పేరిట విరాసత్ చేసిన విషయం వెలుగుచూసింది. సర్వే నంబర్ 338లో ఉన్న 33 గుంటల భూమిని రాఘవేందర్‌రావు పెద్దనాన్న కొడుకులైన వేణుగోపాల్‌రావుకు 17 గుంటలు, సత్యనారాయణరావు పేరిట 16 గుంటలు రికార్డులో ఎక్కించి పాస్‌పుస్తకాలు అందజేశారు. వారసత్వంగా వచ్చిన తమ భూమిని వేరే వారి పేరిట ఎలా నమోదుచేస్తారని రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నిస్తే.. పాస్‌పుస్తకాలు తీసుకురావాలని అప్పటి వీఆర్వో రాంచంద్రయ్య చెప్పారు. పాస్‌పుస్తకాలతో వెళ్లి న్యాయం చేయమని అడిగితే.. రేపు మాపు అంటూ కాలం వెళ్లదీశారని బాధిత రైతు రాఘవేందర్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. వీఆర్వో ఉద్దేశపూర్వకంగానే తమ భూమిని వేరే వారి పేరిటచేయడంతో ఎన్నో ఏండ్లుగా కలిసి ఉన్న తమ అన్నదమ్ముల మధ్య చిచ్చురేపాడని వాపోయారు. అవినీతికి పాల్పడుతూ తమ వారసత్వ భూమిని ఇతరులకు పట్టా చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని, న్యాయంచేయాలని బాధితుడు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

### న్యాయంచేస్తాం

గత వారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బాధితుడు తమ 33 గుంటల భూమి మరొకరి పేరిట నమోదైన విషయం మా దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పూర్తి విచారణ జరిపి న్యాయంచేస్తాం. తాసిల్దారే భూమిని పట్టాలో నమోదుచేస్తారు. ఒక తాసిల్దార్ చేసిన పట్టాను మరో తాసిల్దార్ తొలగించడానికి వీలులేదు. గ్రామానికి చెందిన పాత రికార్డులు నా వద్ద లేవు. ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి దరఖాస్తు చేసుకొంటే న్యాయం జరుగుతుంది.

**- కవిత, వీఆర్వో**

# నమ్ముకున్న భూమిపై హక్కులేదట!

- ప్రభుత్వం ఇచ్చింది.. అధికారులు కాదుపొమ్మంటున్నారు
- ధర్మగంటను ఆశ్రయించిన భూపాలపల్లి జిల్లావాసి చిలువేరు పెద్దులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** పేదలకు ప్రభుత్వం భూమి ఇస్తే రెవెన్యూ అధికారులు వచ్చి కాదుపొమ్మంటున్నారు. మూడు దశాబ్దాల కిందట ఇచ్చిన అసైన్డ్ భూమిని దున్నుకోవద్దని అభ్యంతరం చెప్తున్నారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం దమ్మన్నపేటకు చెందిన రైతు చిలువేరు పెద్దులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. 30 ఏండ్ల కిందట సర్వే నంబర్ 155/53లో 1.10 ఎకరాలను ప్రభుత్వం తమకు కేటాయించిందని తెలిపారు. నాలుగేండ్ల కింద రెవెన్యూ అధికారులు వచ్చి.. ఈ భూమిలో వ్యవసాయం చేయొద్దని చెప్పారని బాధితుడు బోరుమన్నారు. 2017 వరకు పహణీలో తమ పేరే ఉన్నదన్నారు. ఆ తర్వాత రికార్డుల్లోంచి పేరు తొలగించారని, న్యాయంచేయాలని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ నాలుగేండ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. ఈ విషయమై రేగొండ తాసిల్దార్‌ను వివరణ కోరగా తమ దృష్టికి భూ సమస్య రాలేదని తెలిపారు. వారంరోజుల్లో సర్వే చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

# పట్టా భూమి రికార్డులో మాయం

- బొమ్మలరామారం రెవెన్యూ అధికారుల నిర్వాకం
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన మల్యాలవాసి ఆనంద్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు జమాల్‌పూర్ ఆనంద్. మాది యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల. గ్రామంలో సర్వే నంబర్ 201/ఉలో నాకు 18 గుంటల భూమి ఉన్నది. ఈ భూమిని 2007లో పొలగాని నారాయణ వద్ద కొన్నాను. అప్పటినుంచి భూమిని సాగుచేసుకొంటున్నాను. ఈ భూమికి రెవెన్యూ అధికారులు అప్పట్లోనే పాస్‌పుస్తకం జారీచేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో కొత్త పాస్‌పుస్తకం అందజేశారు. కానీ కొద్ది రోజులకు పరిశీలిస్తే పాస్‌పుస్తకంలో ఉన్న భూమి రికార్డులో లేదు. దీనిపై ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ సమస్యపై అప్పటి వీఆర్వో వెంకట నర్సింహారెడ్డిని ప్రశ్నించగా.. నారాయణ తండ్రి ఆ భూమిని గతంలోనే ఇతరులకు అమ్మారని చెప్తున్నారు. కావాలనే రెవెన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయంచేయాలి.

### మల్యాలకు ప్రస్తుతం వీఆర్వో లేరు

మల్యాల వీఆర్వో బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన వీఆర్వోకు సరైన అవగాహన లేకపోవడంతో విధుల్లోకి తీసుకోలేదు. కొత్త వీఆర్వో కోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకొన్నాం. వీఆర్వో రాగానే సమస్యను పరిష్కరిస్తాం.

**- పద్మసుందరి, బొమ్మలరామారం తాసిల్దార్**

# నా భూమి ఇప్పించండి



**ముథోల్:** నా పేరు వెంకట్రాంరెడ్డి. మాది నిజామాబాద్ జిల్లా బోధన్. 2004లో నిర్మల్ జిల్లా ముథోల్ మండలం పిప్రి గ్రామ శివారుల్లో రాజేశ్వర్ అనే వ్యక్తి వద్ద సర్వే నంబర్ 230లో 5.5 ఎకరాల భూమి కొన్నాను. ఈ భూమిని 2006లో నా పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకొన్నాను. అదే ఏడాది చించాల గ్రామానికి చెందిన కన్నోల్ల శోభకు రెండెకరాలు విక్రయించాను. మిగిలిన 3.5 ఎకరాల భూమి నా పేరిట ఉండాలి. కానీ భూరికార్డుల ప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు భూమిని కన్నోల్ల శోభ పేరిట మార్చారు. దీంతో పలుమార్లు రెవెన్యూ అధికారులను సంప్రదించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి, 3.5 ఎకరాల భూమిని నా పేరిట మార్చాలని కోరుతున్నాను.

# ఆలయ భూమికే ఎసరు

- రూ.లక్షకు ఎకరం చొప్పున అమ్మేందుకు వీఆర్వో కుట్ర
- గ్రామస్థులకు తెలియడంతో ఆగిన పట్టా



**భీమ్‌గల్:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామంలో సర్వే నంబర్ 165 పక్కనే 'శుక్రవారం దేవి' ఆలయం ఉన్నది. గుడిని ఆనుకొని ఆలయానికి సంబంధించిన పదహారెకరాల భూమి ఉన్నది. ప్రభుత్వం చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని అనుకూలంగా మలచుకొన్న వీఆర్వో.. ఆలయానికి చెందిన భూమిలో కొంత ఇతరుల పేరిట మార్చాలని ప్రయత్నించాడు. ఎకరానికి రూ.లక్ష చొప్పున ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.6 లక్షలకు బేరం కుదుర్చుకొన్నాడు. ఒక్కొక్కరికి మూడెకరాల చొప్పున పట్టా చేస్తానని ఒప్పందంచేసుకొన్నాడు. పాస్‌బుక్‌లు ఇప్పించేలోగానే విషయం బయటకు పొక్కింది. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ సమావేశమై.. స్థానిక తాసిల్దార్‌తోపాటు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ పరిణామంతో ఖంగుతిన్న వీఆర్వో తాను తీసుకొన్న సొమ్ములో కొంత వెనుకకు ఇచ్చినట్టు తెలిసింది. ఈ వీఆర్వోపై ఇప్పటికే చాలా ఆరోపణలు వచ్చాయని, ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపితే మరిన్ని వ్యవహారాలు బయటకు వస్తాయని పిప్రి గ్రామస్థులు అంటున్నారు.

# 13 గుంటలకోసం పడరాని పాట్లు

- కొన్న భూమి క్రమబద్ధీకరణకు కనాకష్టం
- గిర్దావర్ పంచనామా బేఖాతరు
- డిప్యూటీ తాసిల్దార్ ఆదేశాలు బుట్టదాఖలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నాగర్‌కర్నూల్ జిల్లా బండోన్‌పల్లి రైతు సత్తురి గణేశ్



**వెల్దండ:** నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం బొల్లంపల్లి పరిధిలోని బండోన్‌పల్లికి చెందిన సత్తురి అంజయ్య (తండ్రి వెంకటయ్య).. గ్రామంలోనే తన పేరుతోనే ఉన్న సత్తురి అంజయ్య(తండ్రి ముత్తయ్య) నుంచి సర్వే నంబర్ 311/23లో 13 గుంటల అసైన్ భూమిని 1991లో కొన్నారు. అసైన్ చట్టం గురించి తెలియక దాన్ని కొన్నారు. ఆ భూమిని క్రమబద్ధీకరించాలని అధికారులను అనేకమార్లు వేడుకొన్నా ఫలితం లేకుండా పోయింది. 2012లో భూమిని కొన్న అంజయ్య చనిపోయారు. ఆయన కొడుకు గణేశ్ తన తండ్రి కొన్న భూమిని క్రమబద్ధీకరించాలని అధికారుల చుట్టూ తిరిగారు. అసైన్ భూముల క్రమబద్ధీకరణకు సీఎం కేసీఆర్ ఆదేశించిన తర్వాత అధికారులు భూమిని అమ్మినవారికి నోటీసులు జారీచేశారు. అమ్మిన వ్యక్తి, అతని వారసులు అధికారుల వద్దకు వచ్చి తాము భూమిని అమ్మినట్టు అంగీకరించి.. కొన్నవారికి పట్టాచేయాలని లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారు. గిర్దావర్ పంచనామా చేసి గణేశ్ తండ్రి ఆ భూమిని కొన్నట్టుగా నిర్ధారించారు. వీఆర్వో మాత్రం భూమిని క్రమబద్ధీకరించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. ఈ భూములు పార్ట్-బీలో ఉన్నాయని.. తిరకాసు పెడుతున్నట్టు గణేశ్ ఆరోపించారు. తాసిల్దార్ వెంకటరమణ.. వీఆర్వోను పిలిపించి గణేశ్ తల్లి పేరిట పట్టా చేయాలని ఆదేశించారు. అయినా వీఆర్వో మాత్రం గణేశ్‌ను తిప్పించుకొంటున్నారు.

### వీఆర్వో కనికరించట్లేదు

నా తండ్రి అంజయ్య మృతి చెందడంతో కొన్న భూమి నా తల్లి సుగుణమ్మ పేరిటచేయాలని ఏండ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని జరుగడం లేదు. డీటీ సారు దృష్టికి తీసుకెళ్తే వెంటనే అమలు చేయాలని ఆదేశించినా చేయడంలేదు.

**- సత్తూరి గణేశ్, బాధితుడు**

### తక్షణమే న్యాయం చేస్తా

ఈ సమస్య నా దృష్టికి వచ్చింది. పరిష్కారం చేయాలని వీఆర్వోకు సూచించా. విచారణ నిర్వహించి వెంటనే రైతుకు న్యాయం జరిగేలా కృషిచేస్తా.

**- వెంకట్‌రమణ,**
**డిప్యూటీ తాసిల్దార్**

# మోఖాలో ఉన్నా.. రికార్డులో మాయం

- మొత్తం భూమికి పాస్‌పుస్తకం అందక రైతు అవస్థలు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన జగిత్యాల జిల్లా మేడిపల్లివాసి తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డి



**మేడిపల్లి:** పాత పాస్‌పుస్తకం ఉండటంతోపాటు మోఖాలో ఉండి వ్యవసాయం చేస్తున్నా.. రెవెన్యూ అధికారులు రికార్డులో తన భూమిని తక్కువగా నమోదుచేశారని జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన ఓ రైతు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డికి గ్రామ శివారులోని సర్వే నంబర్లు 40అలో 1.09 ఎకరాలు, 55అలో 2.29 ఎకరాలు, 24లో 15 గుంటలు, 39లో 1.05 ఎకరాలు, 353ఇలో 38 గుంటల భూమి ఉన్నది. రెవెన్యూ అధికారులు పాస్‌బుక్ నంబర్ 435906, ఖాతా (1బీ) నంబర్ 860లో ఈ భూములను నమోదుచేసి 1995లో రైతు తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డికి పాస్‌బుక్ అందజేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో రైతు తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డికి కొత్త పాస్‌పుస్తకం రాకపోవడంతో వీఆర్వోను సంప్రదించారు. అయితే వీఆర్వో రేపు మాపు అంటూ కాలం వెళ్లదీశారు. పాస్‌బుక్ రాకపోవడంతో రైతుబంధు సాయం అందలేదు. ఈ నేపథ్యంలో బాధితుడు మీ సేవ ద్వారా తన భూమి సర్వే నంబర్లవారీగా 1-బీ నమూనాను తీసుకొన్నారు. ఇందులో సర్వే నంబర్లు 40/అ/2/1 (40అ)లోని 1.09 ఎకరాలకు బదులు.. 38 గుంటలు, 55/అ/2 (55అ)లోని 2.29 ఎకరాలకు బదులు.. 2.0250 ఎకరాలుగా నమోదైంది. భూమి తక్కువగా నమోదుచేశారని వీఆర్వో, తాసిల్దార్‌కు సదరు రైతు వినతిపత్రం అందజేశారు. ఎన్నిసార్లు కలిసినా ఇంతవరకు రెవెన్యూ అధికారులు స్పందించలేదు. భూమిని తాను ఎవరికీ అమ్మలేదనీ, 30 ఏండ్లుగా తన ఆధీనంలోనే ఉన్నదని, మోఖాలో ఉండి వ్యవసాయం చేస్తున్నానని రైతు తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి మోఖాపై విచారణచేసి న్యాయంచేయాలని బాధితుడు కోరుతున్నారు.

### సరిచేస్తాం

తిప్పిరెడ్డి ప్రతాపరెడ్డికి సంబంధించి సర్వే నంబర్ 40/అ/2/1 (40అ)లోని 10 గుంటలు ఇతరుల పేరిట తప్పుగా నమోదైంది. తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకొంటే విచారణచేసి సరిచేస్తాం. సర్వే నంబర్ 55/అ/2 (55అ)లోని 0.2650 గుంటలు ఎస్సారెస్పీ కాల్వ నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న భూముల అవార్డు ప్రకారం రికార్డులో తొలగించారు. కొత్త పాస్‌పుస్తకాలు కొంతమంది రైతులకు రాలేదు. వారికి త్వరలో వస్తాయి. పాస్‌పుస్తకాలు అందనివారిలో ప్రతాపరెడ్డి కూడా ఉన్నారు. రైతుబీమా, రైతుబంధు పథకాలు వర్తించేందుకు ప్రతాపరెడ్డికి ఆన్‌లైన్ 1-బీ నమూనా అందజేశాం.

**- రాజయ్య, వీఆర్వో**

నమస్తే తెలంగాణ

# ఆట

10

[ కరీంనగర్ ]
గురువారం 1 ఆగస్టు
2019

WWW.NTNEWS.COM

# యాషెస్ సిరీస్‌లో దుమ్మురేపేదెవరో..!




ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య నేటి నుంచి యాషెస్ తొలి టెస్టు

- ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో ఆతిథ్య జట్టు
- సమస్యలు పక్కనపెట్టి సత్తాచాటాలని కంగారూలు
- ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ప్రారంభం
- మధ్యాహ్నం 3.30 గం. నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

**సంప్రదాయ క్రికెట్‌లో సనాతన కాలం నాటి సమరంగా అభివర్ణించే యాషెస్ సిరీస్‌కు వేళైంది. 141 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ సిరీస్‌కు నేడే తెర లేవనుంది. తొలిసారి వన్డే ప్రపంచకప్ నెగ్గి ఊపులో ఉన్న ఇంగ్లండ్.. విజయంతో హోమ్ సీజన్‌ను ప్రారంభించాలని అనుకుంటుంటే.. దాదాపు రెండు దశాబ్దాల నుంచి ఇంగ్లిష్ గడ్డపై యాషెస్ సిరీస్ చేజిక్కించుకోలేకపోయిన ఆస్ట్రేలియా పటిష్ట జట్టుతో బరిలో దిగుతున్నది. ఐసీసీ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) కూడా ఈ సిరీస్‌తోనే ప్రారంభమవుతుండటంతో అందరి కండ్లు యాషెస్‌పైనే ఉన్నాయి. మరి పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దుమ్మురేపుతున్న ఇంగ్లిష్ జట్టు.. సుదీర్ఘ ఫార్మాట్‌లో కంగారూలను ఓ పట్టు పడుతుందా..! లేక ఐర్లాండ్‌తో తొలి ఇన్నింగ్స్‌లో కుప్పకూలినట్లు కుదేలవుతుందా అనేది ఎడ్జ్‌బాస్టన్ మైదానమే నిర్ణయించాలి.**

**బర్మింగ్‌హామ్:** తొలిసారి వన్డే ప్రపంచకప్ నెగ్గిన ఉత్సాహంలో ఉన్న ఇంగ్లండ్ జట్టు.. ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను కూడా సొంతం చేసుకొని ఆ ఆనందాన్ని రెట్టింపు చేసుకోవాలని తహతహలాడుతున్నది. గురువారం నుంచి ఇక్కడ ప్రారంభం కానున్న యాషెస్ సిరీస్ తొలి టెస్టుతోనే ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌కు కూడా తెరలేవనుంది. వన్డేలు అందుబాటులోకి రాకముందు దశాబ్దాల క్రితం నుంచే అమితమైన ఆసక్తి ఉన్న ఈ సిరీస్‌లో చిరకాల ప్రత్యర్థులు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా అమీతుమీ తేల్చుకోనున్నాయి. తమతమ దేశాల్లో ఈ సిరీస్‌కు విపరీతమైన క్రేజ్ ఉండటంతో ఇక్కడ సత్తా చాటాలని ప్రతీ ఆటగాడు ఉవ్విళ్లూరుతుంటాడు. 2001 అనంతరం ఇంగ్లండ్ గడ్డపై యాషెస్ గెలువలేకపోయిన కంగారూలు ఈ సారి పట్టు వదలకూడదని కృతనిశ్చయంతో ఉన్నారు. మరి జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించి హీరో అయ్యేదెవరో నేటి నుంచి తేలనుంది. సాధారణంగా యాషెస్ సిరీస్ ప్రతిసారి జూలై నెలలోనే ప్రారంభమవుతుంది. 2001 నుంచి ఇదే సంప్రదాయ కొనసాగుతూ వస్తున్నది. కానీ ఈ సారి వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో ఒక నెల ఆలస్యంగా ఆగస్టులో ప్రారంభవుతున్నది. మెగాటోర్నీ మత్తు నుంచి బయటపడ్డ క్రికెట్ ప్రేమికులకు మళ్లీ నేటి నుంచి పండుగే.

### జెర్సీలపై నంబర్లతో..




సంప్రదాయ క్రికెట్‌లో తొలిసారి ఆటగాళ్ల జెర్సీలపై నంబర్లు దర్శనమివ్వనున్నాయి. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాదిరిగా ఇకపై టెస్టుల్లో కూడా ఆటగాళ్లు తమ నంబర్లతో బరిలో దిగనున్నారు. అయితే దుస్తులు మాత్రం తెలుపు, గోధుమ రంగులోనే ఉంటాయి.

#### ఆర్చర్‌కు నో చాన్స్

నాలుగు దశాబ్దాల పోరాటం అనంతరం వరల్డ్‌కప్ నెగ్గిన ఇంగ్లండ్ జట్టు అదే ఉత్సాహంతో బరిలో దిగాలనుకుంటుంది. ఒకరిద్దరు మినహా మిగిలిన వారందరూ మెగాటోర్నీలో ఆడిన వారే కావడం ఆతిథ్య జట్టుకు జోష్‌నిస్తున్నది. కెప్టెన్ జో రూట్ తిరిగి మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రానుండటం కూడా వారికి కలిసొచ్చే అంశం కాగా.. మ్యాచ్ ఆరంభానికి ఒకరోజు ముందే ఇంగ్లండ్ తుదిజట్టును ప్రకటించింది. వరల్డ్‌కప్‌లో అదరగొట్టిన జాసన్ రాయ్‌తో పాటు రోరీ బర్న్స్ ఓపెనింగ్ చేయనున్నారు. ఆ తర్వాత డెన్లీ, బట్లర్, బెన్‌స్టోక్స్, బెయిర్‌స్టో, మొయిన్ అలీతో హోమ్ టీమ్ బ్యాటింగ్ శత్రు దుర్భేద్యంగా కనిపిస్తున్నది. ప్రపంచకప్‌లో మెరిసిన పేసర్ జోఫ్రా ఆర్చర్ తుది జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. బౌలింగ్‌లో సీనియర్ పేసర్, ఇంగ్లండ్ తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన అండర్సన్‌పైనే ఆ జట్టు ఎక్కువ ఆశలు పెట్టుకుంది. సహచరుడు స్టువర్ట్ బ్రాడ్‌తో కలిసి జిమ్మీ కొత్త బంతి పంచుకోనున్నాడు. ఆల్‌రౌండర్లు బెన్ స్టోక్స్, క్రిస్ వోక్స్ వారికి సాయం తోడ్పాటు అందిస్తారు. లోకల్ బాయ్ మొయిన్ అలీ స్పిన్ భారాన్ని మోయనున్నాడు. ప్రపంచకప్‌లో అద్వితీయ ప్రదర్శనతో తిరిగి వైస్ కెప్టెన్‌గా ఎన్నికైన బెన్‌స్టోక్స్‌పైనే అందరి కండ్లు ఉంటాయనడంలో సందేహం లేదు. అయితే ఇటీవల ఐర్లాండ్‌తో జరిగిన ఏకైక టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 85 పరుగులకే ఆలౌట్ కావడం ఆ జట్టును కలవరపెడుతున్నది.

**4** ఇంగ్లండ్ వేదికగా జరిగిన గత నాలుగు యాషెస్ సిరీస్‌ల్లోనూ ఆస్ట్రేలియా పరాజయం పాలైంది. 1890 తర్వాత ఆసీస్ ఇలా వరుసగా నాలుగు సిరీస్‌లు ఎప్పుడూ కోల్పోలేదు.

#### పైన్‌కు పరీక్షే..

ప్రపంచకప్ సెమీఫైనల్లో ఇంగ్లండ్ చేతిలో ఇదే మైదానంలో ఓడిన ఆస్ట్రేలియా నెల రోజుల వ్యవధిలో తిరిగి దాదాపు అదే జట్టుతో తలపడేందుకు రెడీ అవుతున్నది. గత 19 ఏండ్లలో ఈ వేదికపై ఆస్ట్రేలియా ఏ ఫార్మాట్‌లోనూ ఆతిథ్య జట్టుపై ఒక్క విజయం కూడా నమోదు చేయలేకపోయింది. బౌలింగ్‌లో ఇరు జట్లు సమఉజ్జీలుగానే కనిపిస్తున్నా.. ఇంగ్లండ్ బ్యాటింగ్‌తో పోల్చుకుంటే కంగారూలు కాస్త వెనుకబడే ఉన్నారని చెప్పొచ్చు. బాల్ ట్యాంపరింగ్ ఉదంతం అనంతరం స్మిత్, వార్నర్, బాన్‌క్రాఫ్ట్ ఆడుతున్న తొలి టెస్టు ఇదే కావడం కూడా ఆసీస్‌పై ఒత్తిడి పెంచనుంది. ఇంగ్లండ్ అభిమానులు వారిని ఎలా రిసీవ్ చేసుకుంటారనేది కూడా ముఖ్యమే. వన్డే ప్రపంచకప్‌లో వార్నర్, స్మిత్ సత్తాచాటగా.. బాన్‌క్రాఫ్ట్ మాత్రం నిషేధం ముగిసిన తర్వాత తొలిసారి ఆస్ట్రేలియా తరఫున బరిలో దిగనున్నాడు. కష్టకాలంలో ఆసీస్ జట్టు పగ్గాలు చేపట్టిన వికెట్‌కీపర్ పైన్‌కు ఈ సిరీస్ కత్తిమీద సాము అనే చెప్పొచ్చు. బ్యాటింగ్‌లో వార్నర్, స్మిత్, ఖవాజ, బాన్‌క్రాఫ్ట్, వేడ్ కీలకం కానుండగా.. బౌలింగ్ కమిన్స్, ప్యాటిన్సన్‌పైనే కంగారూలు ఆశలు పెట్టుకున్నారు.

### జట్లు

**ఇంగ్లండ్ తుదిజట్టు:** బర్న్స్, రాయ్, రూట్ (కెప్టెన్), డెన్లీ, బట్లర్, స్టోక్స్, బెయిర్‌స్టో (వికెట్ కీపర్), మొయిన్ అలీ, వోక్స్, బ్రాడ్, అండర్సన్.

**ఆస్ట్రేలియా (అంచనా):** వార్నర్, బాన్‌క్రాఫ్ట్, ఖవాజ, స్మిత్, హెడ్/మిషెల్ మార్ష్, వెడ్, పైన్ (కెప్టెన్, వికెట్ కీపర్), కమిన్స్, ప్యాటిన్సన్, లియాన్, సిడిల్/హాజల్‌వుడ్.

### పిచ్, వాతావరణం

గత కొన్ని రోజులుగా ఇక్కడ వర్షం కురుస్తుండటంతో పిచ్‌పై అంచనాకు రావడం కష్టంగా మారింది.వాతావరణం పొడిగా ఉండే అవకాశాలున్నాయి. ప్రపంచకప్ విజయంతో ఇంగ్లండ్‌లో క్రికెట్‌కు మరింత క్రేజ్ ఏర్పడిన నేపథ్యంలో తొలి మూడు రోజులకు టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. తొలి రెండు రోజులు వర్ష సూచన లేదు.

> ప్రేక్షకులు, అభిమానులు ఎలా ఆలోచిస్తున్నారో తెలియదు కానీ.. వన్డే ప్రపంచకప్ విజయంతో వారు ఏం కోరుకుంటున్నారనేది అర్థమైంది. కానీ అలాంటి అంశాలను పట్టించుకోకుండా.. చక్కటి ప్రదర్శన చేయాలని భావిస్తున్నాం. ఈ సిరీస్‌ను మరుపురానిదిగా మార్చుకోవడానికి శాయశక్తులా కృషిచేస్తాం.
>
> **- రూట్, ఇంగ్లండ్ కెప్టెన్.**

> ఎడ్జ్‌బాస్టన్‌లో ఆడుతున్నామా.. చంద్రుడిపై ఆడుతున్నామా అన్నది మాకు ముఖ్యం కాదు. మా ప్రణాళికలను సక్రమంగా అమలు చేయడమే ముందున్న కర్తవ్యం. మా అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు ప్రయత్నిస్తాం.
>
> **- పైన్, ఆస్ట్రేలియా కెప్టెన్**

### టెస్టు చాంపియన్‌షిప్‌కు అంకురార్పణ




సుదీర్ఘకాలంగా ఆలోచనలో ఉన్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)నకు ఈ మ్యాచ్‌తో అంకురార్పణ జరుగనుంది. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న 9 దేశాలు పోటీలో ఉండగా.. చిరకాల ప్రత్యర్థులు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ తొలి టెస్టు పాయింట్లను తమ ఖాతాలో వేసుకోనున్నాయి. ఈ సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లు ఉండటంతో మొత్తం 120 పాయింట్లలో ఒక్కో మ్యాచ్‌కు 24 చొప్పున కేటాయించారు. గెలిచిన జట్టుకు 24 పాయింట్లు లభించనుండగా.. టెస్టు 'డ్రా'గా ముగిస్తే 3:1 పద్ధతిలో అంటే ఇరు జట్లకు ఎనిమిదేసి పాయింట్లు కేటాయిస్తారు. ఒకవేళ మ్యాచ్ టై అయితే చెరో 12 పాయింట్లు దక్కుతాయి. అంతేకాక గతంలో మాదిరిగా.. స్లో ఓవర్‌రేట్‌కు కెప్టెన్, ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో కోత విధించడం కాకుండా.. పాయింట్లలో కోత పడనుంది. నిర్ణీత సమయంలో వేయాల్సిన ఓవర్ల కంటే ఒక్క ఓవర్ తక్కువగా వేసినా.. 2 పాయింట్లు కట్ చేస్తారు. కెప్టెన్లూ తస్మాత్ జాగ్రత్తా..!

## ఆబిద్ అలీకి స్వర్ణం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** సర్దార్ సజ్జన్ సింగ్ సేథీ స్మారక మాస్టర్స్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ర్టానికి చెందిన ఆబిద్ అలీ స్వర్ణంతో మెరిశాడు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ జూనియర్ విభాగంలో ఆబిద్ అలీ ఖాన్ 620.5 పాయింట్లతో పసిడి సొంతం చేసుకున్నాడు. హర్షరాజ్ (617.4), ప్రతాప్ సింగ్ తోమర్ (614.7) వరుసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు.

## దేశం కోసం బరిలోకి దిగుతా : రోహిత్



**న్యూఢిల్లీ:** ఓపెనర్ రోహిత్ శర్మతో తనకు విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని విరాట్ కోహ్లీ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ అంశంపై ఇంతవరకు మౌనం వహించిన రోహిత్ శర్మ.. బుధవారం చేసిన ఓ ట్వీట్ చర్చనీయాంశమైంది. 'నేను జట్టు కోసం మాత్రమే కాదు... దేశం కోసం బరిలోకి దిగుతా' అని రోహిత్ ట్వీట్ చేశాడు. విండీస్ టూర్‌కు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో కోహ్లీ.. రోహిత్‌తో విభేదాల అంశంపై వివరణ ఇచ్చాడు. అవన్నీ అవాస్తవాలని, జట్టులో అందరం కలిసే ఉన్నామని స్పష్టం చేశాడు. అయితే కోహ్లీ తప్ప మరెవరూ ఈ విషయంపై మాట్లాడని నేపథ్యంలో రోహిత్ చేసిన ట్వీట్ మరిన్ని వాదనలకు దారి తీసే అవకాశముంది.

## కోచ్ పదవికి లాల్‌చంద్ దరఖాస్తు



**ముంబై:** టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ పదవికి మాజీ క్రికెటర్ లాల్‌చంద్ రాజ్‌పుత్ చివరి నిమిషంలో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రస్తుతం జింబాబ్వే జాతీయ జట్టుకు కోచ్‌గా పనిచేస్తున్న రాజ్‌పుత్.. ఆ జట్టుపై ఐసీసీ నిషేధం విధించడంతో భారత జట్టుకు కోచ్‌గా పనిచేయాలని కోరుకుంటున్నాడు. దరఖాస్తు గడువు (జూలై 30) ముగిసే సమయంలో కెనడాకు వెళ్తూ మార్గమధ్యలో దుబాయ్ విమానాశ్రయం నుంచి లాల్‌చంద్ బీసీసీఐకి దరఖాస్తు పంపించాడు. దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన తొలి టీ20 ప్రపంచకప్ (2007) నెగ్గిన టీమ్‌ఇండియాకు రాజ్‌పుత్ మేనేజర్‌గా వ్యవహరించాడు. గతంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు కోచ్‌గా పనిచేసిన రాజ్‌పుత్.. దేశవాళీ క్రికెట్‌లో అస్సాం జట్టుకు శిక్షణ ఇచ్చాడు.

**రేసులో ఆరుగురు**

ఇప్పటికే కోచ్‌గా పనిచేస్తున్న రవిశాస్త్రితో పాటు ఆస్ట్రేలియాకు చెందిన టామ్‌మూడి, న్యూజిలాండ్ మాజీ కోచ్ మైక్ హెస్సన్, శ్రీలంక దిగ్గజ ఆటగాడు మహేళా జయవర్ధనే, భారత మాజీ ఆటగాడు రాబిన్ సింగ్ ఆ పదవికి దరఖాస్తు చేసుకోగా.. తాజాగా లాల్‌చంద్ కూడా బరిలో నిలువడంతో ఆశావాహుల సంఖ్య ఆరుకు పెరిగింది.

## శ్రీలంక క్లీన్‌స్వీప్




**కొలంబో:** బంగ్లాదేశ్‌తో జరిగిన మూడో వన్డేలోనూ ఘన విజయం సాధించిన శ్రీలంక 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. వన్డే సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు నెగ్గడం మూడేండ్ల తర్వాత లంకకు ఇదే తొలిసారి. మొదటి రెండు మ్యాచ్‌ల్లో నెగ్గి ఇప్పటికే సిరీస్ చేజిక్కించుకున్న లంకేయులు బుధవారం జరిగిన నామమాత్రమైన మూడో వన్డేలో 122 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుచేశారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన లంక నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లకు 294 పరుగులు చేసింది. సీనియర్ బ్యాట్స్‌మన్ ఎంజెలో మాథ్యూస్ (87; 8 ఫోర్లు, 1 సిక్స్), కుశాల్ మెండిస్ (54) అర్ధశతకాలు సాధించారు.అనంతరం లక్ష్య ఛేదనలో బంగ్లా 36 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. సర్కార్ (69) మినహా మిగిలిన వారంతా విఫలమయ్యారు. మాథ్యూస్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు దక్కాయి.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు మయాంక్ మార్కండే

**ముంబై:** ఐపీఎల్లో అంచనాలకు మించి రాణిస్తున్న యువ లెగ్‌స్పిన్నర్ మయాంక్ మార్కండేను ముంబై ఇండియన్స్ జట్టు వదలుకుంది. అతడిని ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇచ్చి... ఆ జట్టు నుంచి వెస్టిండీస్ ఆల్‌రౌండర్ షెర్ఫానే రూథర్‌ఫర్డ్‌ను తీసుకుంది. ఈ విషయాన్ని ముంబై ఇండియన్స్ యజమాని ఆకాశ్ అంబానీ వెల్లడించాడు. 'మయాంక్ చాలా ప్రతిభావంతుడు. అతడిని ముందుగా గుర్తించడం మా అదృష్టం. మార్కండేను వదులుకోవాలన్న నిర్ణయం కష్టమైనదే. అతనెప్పుడూ ముంబై ఇండియన్స్ కుటుంబంలో సభ్యుడే. అలాగే యువ ఆటగాడు రూథర్‌ఫర్డ్‌ను సంతోషంగా జట్టులోకి ఆహ్వానిస్తున్నాం. ఆల్‌రౌండ్ ప్రతిభతో అతడు మమ్మల్ని ఆకట్టుకున్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున గొప్ప ప్రదర్శన చేస్తాడని నమ్ముతున్నాం' అని ఆకాశ్ పేర్కొన్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున 2018 ఐపీఎల్‌లో 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసిన మార్కండే.. ఈ ఏడాది మూడు మ్యాచ్‌లు ఆడి ఒక్క వికెటే పడగొట్టాడు.






## పాంథర్స్ 'జై'త్రయాత్ర

### హర్యానాపై గెలుపు

**ముంబై:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ అజేయ యాత్రను కొనసాగిస్తూ విజయాల హ్యాట్రిక్ నమోదు చేసింది. బుధవారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో పాంథర్స్ 37-21తో హర్యానా స్టీలర్స్‌పై గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. జైపూర్ కెప్టెన్ దీపక్ హుడా(14 రైడ్ పాయింట్లు), సందీప్ ధుల్(6 ట్యాకిల్ పాయింట్లు) అదరగొట్టగా.. జట్టు యజమానులు అమితాబ్, అభిషేక్ బచ్చన్ ఆటగాళ్లను ఉత్సాహరుస్తూ కనిపించారు. వరుస విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగిన జైపూర్ మ్యాచ్ మొత్తం పైచేయి సాధించగా.. రెండు పరాజయాలతో డీలాపడ్డ హర్యానా ఈ పోరులోనూ చతికిలపడింది. తొలి నిమిషంలోనే రైడ్‌కు వచ్చిన హర్యానా ఆటగాడు నవీన్‌ను పట్టేసిన సందీప్ ధుల్ పాంథర్స్ ఖాతాను తెరిచాడు. ఆ తర్వాత జైపూర్ ఆటగాళ్లు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. రైడింగ్‌లో దీపక్ రెచ్చిపోవడంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి జైపూర్ 13-8తో ముందంజలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ ఆధిక్యం కొనసాగించిన జైపూర్ అలవోకగా గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యూపీ యోధా 27-23తో అతిధ్య యూ ముంబాపై విజయం సాధించింది.

**పీకేఎల్‌లో నేడు**

గుజరాత్ X ఢిల్లీ -7.30గం.

స్టార్ స్పోర్ట్స్‌లో

## కోహ్లీకి ఆ హక్కు ఉంది

**కోల్‌కతా:** ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రి కొనసాగితే సంతోషిస్తామని టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్న మాటలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విరాట్‌కు మాజీ సారథి సౌరభ్ గంగూలీ మద్దతు తెలిపాడు. కోచ్ ఎంపికపై అభిప్రాయాన్ని తెలిపే అన్ని హక్కులు కెప్టెన్‌గా కోహ్లీకి ఉంటాయని బుధవారం దాదా అన్నాడు. 2017లో క్రికెట్ సలహా కమిటీ (సీఏసీలో)లో సభ్యులుగా ఉన్న సమయంలో రవిశాస్త్రిని ప్రధాన కోచ్‌గా గంగూలీ, సచిన్, వీవీఎస్ లక్ష్మణ్ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సీఏసీకి దిగ్గజ క్రికెటర్ కపిల్ దేవ్ నేతృత్వం వహిస్తుండగా.. అన్షుమాన్ గైక్వాడ్, శాంతా రంగస్వామి సభ్యులుగా ఉన్నారు. వీరే టీమ్‌ఇండియా తదుపరి కోచ్‌ను ఎంపిక చేయనున్నారు.



## ఆరంభం అదుర్స్




- ముందడుగేసిన సైనా, శ్రీకాంత్, కశ్యప్
- అశ్వినీ-సాత్విక్ జోడీ అద్భుత విజయం

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. బుధవారమిక్కడ జరిగిన తొలి రౌండ్ పోటీల్లో సైనా నెహ్వాల్, కిందాబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, పారుపల్లి కశ్యప్ విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా నెహ్వాల్ 21-17, 21-19తో పిట్టాయపార్న్ చైవాన్(థాయ్‌లాండ్)పై గెలుపొందింది. 39 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో వేగంగా కదులుతూ చైవాన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సైనా గాయం నుంచి పూర్తిగా కోలుకున్నట్టుగానే కనిపించింది. మరోవైపు పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఐదో సీడ్ కిడాంబి శ్రీకాంత్ గంటా ఏడు నిమిషాల పాటు పోరాడి 21-13, 17-21, 21-19తో అన్‌సీడెడ్ రెన్ పెంగ్ బో(చైనా)పై గెలిచాడు. హెచ్‌ఎస్ ప్రణయ్ 21-16, 22-20తేడాతో వరుస సెట్లలో కీ విన్సెంట్(హాంకాంగ్)ను ఓడించాడు. పారుపల్లి కశ్యప్ 18-21, 21-8, 21-14 తేడాతో మిషా జిల్‌బెర్‌మాన్ (ఇజ్రాయిల్)పై గెలుపొందాడు. ఇక టాప్ సీడ్ కెంటో మొమొటా(జపాన్) వాక్ ఓవర్ కారణంగా అదృష్టం కలిసి వచ్చి శుభంకర్ డే రెండో రౌండ్‌కు అర్హత సాధించగా... సౌరభ్ వర్మ మాత్రం 21-23, 21-19, 5-21 తేడాతో సునేయామా(జపాన్) చేతిలో ఓడి నిరాశపరిచాడు.

**అదరగొట్టిన సాత్విక్, అశ్వినీ జోడీ**

మిక్స్‌డ్ డబుల్స్‌లో అన్ సీడెడ్ సాత్విక్ సాయి రాజ్ రాంకీరెడ్డి-అశ్వినీ పొన్నప్ప జంట అదరగొట్టింది. ఐదో సీడ్, ఒలింపిక్ రజత పతక విజేత మలేషియా జోడీ చెన్ పెంగ్ సూన్-లీ యింగ్‌ని భారత ద్వయం 21-18, 18-21, 21-17తో గెలిచి సత్తా చాటింది. ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి ద్వయం 21-16, 21-13తో కోహీ గొండో-కుహిహరా(జపాన్)పై సునాయాస విజయం సాధించింది.



## ధోనీ @ ఆర్మీ

**శ్రీనగర్:** వెస్టిండీస్ పర్యటన నుంచి విరామం తీసుకున్న మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ దేశ రక్షణలో నిమగ్నమయ్యాడు. టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న ధోనీ బుధవారం నుంచి దక్షిణ కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. తోటి జవాన్లతో కలిసి పెట్రోలింగ్, గార్డ్ డ్యూటీలు చేస్తున్నాడు. ఈ నెల 15 వరకు మహీ అక్కడే సేవలందించనున్నాడని ఓ అధికారి తెలిపారు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,481 | 11,118 |
| ↗84 | ↗33 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 65.18 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 35,780 |
| 22 క్యారెట్లు | 35,610 |
| వెండి (కిలో) | 42,120 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.10 | 71.60 |
| యూరో | 73.60 | 80.10 |
| బహ్రెయిన్ దినార్ | 174.50 | 188.50 |
| కువైట్ దినార్ | 217.80 | 229.80 |
| సౌదీ రియాల్ | 16.90 | 18.70 |
| యూఏఈ దిర్హామ్ | 17.90 | 19.60 |

## మ్యాజిక్‌పిన్ విస్తరణ బాట

**హైదరాబాద్, జూలై 31:** ఆఫ్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో సేవలు అందించే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన మ్యాజిక్‌పిన్.. రాష్ట్రంలో తన వ్యాపారాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ కో-ఫౌండర్, సీఈవో అన్షు శర్మ మాట్లాడుతూ.. ప్రస్తుతం హైదరాబాద్‌లో 80 వేల రిటైల్ అవుట్‌లెట్లతో ఒప్పందం కుదుర్చుకొని సేవలు అందిస్తుండగా, వచ్చే 6 నెలల్లో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్‌తోపాటు వైజాగ్, విజయవాడలకు విస్తరించనున్నట్లు చెప్పారు.

# కాఫీ డే సిద్ధార్థ మృతి



నేత్రావతి నదిలో మృతదేహం లభ్యం • గుర్తించిన జాలర్లు • ఆత్మహత్యగానే భావిస్తున్న పోలీసులు





సిద్ధార్థ పార్థివదేహం వద్ద విషణ్ణ వదనంతో కర్ణాటక మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ, అంతిమయాత్రలో పాల్గొన్న జనవాహిని

**మంగళూరు/బెంగళూరు, జూలై 31:**

కేఫ్ కాఫీ డే (సీసీడీ) వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ (59) మృతి చెందారు. సిద్ధార్థకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం రాత్రి అదృశ్యమైన ఆయన బుధవారం ఉదయం నేత్రావతి నదిలో నిర్జీవుడై కనిపించారు. స్థానిక జాలర్లు, పెట్రోలింగ్ పోలీసులు సిద్ధార్థ మృతదేహాన్ని గుర్తించి బయటకు తెచ్చారు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవచ్చన్న అనుమానాల మధ్య మంగళవారం ఉదయం నుంచి పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ముమ్మర గాలింపు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నది తీర ప్రాంతంలో సిద్ధార్థ మృతదేహం లభించగా, దీన్ని ఆయన స్నేహితులు ధ్రువీకరించినట్లు దక్షిణ కన్నడ జిల్లా డిప్యూటీ కమిషనర్ శశికాంత్ సెంథిల్ తెలిపారు. ప్రాథమిక సమాచారం, ఇప్పటిదాకా ఉన్న పరిస్థితులనుబట్టి సిద్ధార్థది ఆత్మహత్యగానే భావిస్తున్నామని, అయినప్పటికీ దర్యాప్తు పూర్తయితేగానీ స్పష్టత రాదని అన్నారు.



నేత్రావతి నది నుంచి సిద్ధార్థ మృత దేహాన్ని తీసుకొస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



సిద్ధార్థ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కర్ణాటక సీఎం యెడియూరప్ప

**చిక్మగలూరులో ముగిసిన అంత్యక్రియలు**

మంగళూరులోని వెన్‌లాక్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడి నుంచి సిద్ధార్థ స్వస్థలం చిక్మగలూరుకు తరలించగా, సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, సిద్ధార్థ భార్య మాళవిక కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ కూతురే. దీంతో సిద్ధార్థ మృతిపట్ల అటు వ్యాపార, పారిశ్రామిక రంగాలు, ఇటు రాజకీయ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. కాఫీ డే డైరెక్టర్లతోపాటు తమ యజమానిని కడసారి చూసేందుకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'సిద్ధార్థ మృతి బాధాకరం. అప్పుల కంటే ఆయనకున్న ఆస్తుల విలువే ఎక్కువ' అని ఈ సందర్భంగా సిద్ధార్థ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారన్న వార్తలపై యెడియూరప్ప స్పందించారు. సోమవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి సక్లేశ్‌పూర్‌కు కారులో బయలుదేరామని, మార్గమధ్యంలో మంగళూరుకు వెళ్లమని చెప్పడంతో ఆ దిశగా వెళ్లానని డ్రైవర్ బసవరాజ్ పాటిల్ మంగళవారం పోలీసులకు చెప్పిన సంగతి విదితమే. నేత్రావతి నది వంతెన మీద సిద్ధార్థ దిగారని, వంతెన చివరకు వెళ్లి ఆగమని చెప్పడంతో కారులో వెళ్లిపోయానని, ఎంతకీ రాకపోవడం.. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలిపానని పాటిల్ వివరించారు. మరోవైపు ఓ వ్యక్తి వంతెన మీది నుంచి నదిలో దూకడం తాను గమనించానని ఓ జాలరి చెప్పినది తెలిసిందే.

**కామత్, జార్జ్ చదువుకున్న కళాశాలలోనే..**

ప్రముఖ బ్యాంకర్ కేవీ కామత్, మాజీ రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండేజ్ చదువుకున్న మంగళూరులోని సెయింట్ అలాయ్‌సియస్ కాలేజీలోనే వీజీ సిద్ధార్థ బీకాం చదువుకున్నారు. కాలేజ్ వెబ్‌సైట్‌లో ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది.

## ప్రముఖుల నివాళి

**న్యూఢిల్లీ:** కేఫ్ కాఫీ డే (సీసీడీ) వ్యవస్థాపక అధిపతి వీజీ సిద్ధార్థ మృతిపట్ల దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగం దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆయన మరణం విచారకరమని సంతాపం వెలిబుచ్చింది. సిద్ధార్థ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

'సిద్ధార్థ మృతి విచారకరం. ఆయన కుటుంబ సభ్యులకు నా సంతాపం'

**-కిరణ్ మజుందార్ షా, బయోకాన్ సీఎండీ**

'బాధాకరం. వ్యాపారంలో విఫలమైనంత మాత్రాన చావాలనుకోవడం సరికాదు'

**-ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూపు చైర్మన్**

'మాటలు రావడం లేదు. సిద్ధార్థ మృతి విచారకరం. ఆయన ఆత్మకు శాంతి కలుగాలి'

**-విజయ్ శేఖర్ శర్మ, పేటీఎం వ్యవస్థాపకుడు**

'సిద్ధార్థ ఓ ఆదర్శనీయమైన వ్యాపారి, మదుపరి. ఎప్పుడూ ఆశాజనకంగా కనిపిస్తారు'

**-సచిన్ బన్సల్, ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు**

'ఇదో దుర్దినం. సిద్ధార్థ మరణం బాధాకరం. వ్యాపారంలో ఆయన శైలికి వందనం'

**-సీపీ గుర్నాని, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో**

## మృతదేహం అన్వేషణలో హైదరాబాదీ టెక్నాలజీ సాయం

**సిద్ధార్థ** మృతదేహాన్ని హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ రూపొందించిన టెక్నాలజీ సహాయంతోనే గుర్తించడం విశేషం. నేత్రావతి నదిలో దూకి సిద్ధార్థ ఆత్మహత్య చేసుకున్నారన్న అనుమానాలతో మంగళవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రారంభించిన గాలింపు చర్యలకు వర్షం, పెరుగుతున్న నదీ ప్రవాహం ప్రధాన అడ్డంకిగా మారాయి. 200 మందికిపైగా పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, స్థానిక జాలర్లతోపాటు నౌక దళ సాయం తీసుకున్న ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీవోఐఎస్) అభివృద్ధిపరిచిన ఓ విధానం రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా నిలిచింది. ఈ విధానంతోనే మృతదేహాన్ని గుర్తించామని దక్షిణ కన్నడ జిల్లా డిప్యూటీ కమిషనర్ శశికాంత్ సెంథిల్ తెలిపారు. అలల ఉధృతి ఆధారంగా నీటి లోపల, ఉపరితలంపై నిర్దేశిత వస్తు, జీవ పరిమాణాల ఉనికికి సంబంధించిన సమాచారాన్ని ఇది అందిస్తుంది. ఈ క్రమంలోనే అధికారులకు సిద్ధార్థ మృతదేహం ఉన్న పరిసరాల సమాచారం లభించింది. దీంతో మృతదేహం ఎక్కడ ఉన్నది? అన్నదానిపై ఓ అంచనాకు వచ్చామని సెంథిల్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి గల సంస్థగా ఉన్న ఐఎన్‌సీవోఐఎస్.. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్‌లో భాగంగా పనిచేస్తున్నది.



**మూతపడ్డ కేఫ్ కాఫీ డేలు**

కేఫ్ కాఫీ డే వ్యవస్థాపక చైర్మన్ వీజీ సిద్ధార్థ మృతిచెందడంతో దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ అవుట్‌లెట్లు మూతపడ్డాయి. ఆయన మృతికి సంతాపంగా యాజమాన్యం సెలవు ప్రకటించింది. చాలా మంది ఉద్యోగులు సిద్ధార్థ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

## కోమాలో సిద్ధార్థ తండ్రి



తండ్రి గంగయ్యతో సిద్ధార్థ (ఫైల్)

**కొడుకు** మరణం గురించి తెలుసుకోలేని స్థితిలో ప్రస్తుతం సిద్ధార్థ తండ్రి గంగయ్య ఉన్నారు. 96 ఏండ్ల గంగయ్య హెగ్డే మైసూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కోమాలో ఉండి ప్రాణాలతో పోరాడుతున్నారు. తల్లి వాసంతి కొద్ది రోజుల క్రితమే తమ స్వగ్రామం చీతనహళ్లికి వెళ్లగా, మూడు రోజుల క్రితం గంగయ్యను ఆసుపత్రిలో చూసి సిద్ధార్థ కంటతడి పెట్టినట్లు సమీప బంధువు ఒకరు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇంత ఘోరం జరిగిపోయిందని ఆయన ఇప్పుడు విలపిస్తున్నారు. తండ్రిని చూడటం సిద్ధార్థకు అదే ఆఖరు అవుతుందని తాను ఊహించలేకపోయానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సంతానం కోసం ఎన్నో నోములు, పూజలు చేసిన గంగ య్యా, వాసంతి హెగ్డే దంపతులకు సిద్ధార్థ జన్మించారు. లేకలేక పుట్టిన కొడుకు కావడంతో చిన్నప్పటి నుంచి సిద్ధార్థను అతి గారాబంగా పెంచారు. ముఖ్యంగా తండ్రి గంగయ్యకు కొడుకు సిద్ధార్థ అంటే ఎంతో ఇష్టం. అలాంటి కొడుకు ఆఖరి చూపును కూడా నోచుకోలేకపోయిన గంగయ్య పరిస్థితిని తలుచుకుని అంతా కంటతడి పెడుతున్నారు.

## కాఫీ డే తాత్కాలిక చైర్మన్‌గా రంగనాథ్



**న్యూఢిల్లీ, జూలై 31:** కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ తాత్కాలిక చైర్మన్‌గా ఎస్వీ రంగనాథ్ నియమితులయ్యారు. కంపెనీ వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ ఆత్మహత్య చేసుకోవడంతో కంపెనీలో ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రంగనాథ్‌కు ఈ పదవి బాధ్యతలు అప్పగించారు. బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది. కంపెనీ బోర్డులో సిద్ధార్థ భార్య మాళవిక హెగ్డే, డాక్టర్ అల్బర్ట్ హైరోనిమన్, సంజయ్ ఓంప్రకాశ్ నాయర్, సులక్షన్ రాఘవన్‌లు ఉన్నారు. ఎస్వీ రంగనాథ్ తాత్కాలిక చైర్మన్‌గా నియమితులవగా, నితిన్ బాగ్మానే తాత్కాలిక చీఫ్ ఆపరేటింగ్ అధికారి(సీవోవో)గా నియమించుకున్నట్లు కంపెనీ స్టాక్ మార్కెట్‌కు సమాచారం అందించింది. 1975 ఐఏఎస్ అధికారి అయిన రంగనాథ్..కర్ణాటక ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహించారు.

**సిద్ధార్థ లేఖపై దర్యాప్తు: బోర్డు సభ్యులు**

సిద్ధార్థ రాసినట్లు పేర్కొంటున్న లేఖపై దర్యాప్తు చేయనున్నట్లు బోర్డు సభ్యులు ప్రకటించారు. బ్యాంకులు, పెట్టుబడిదారులు, పన్ను అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి చేసినట్లు సిద్ధార్థ పేర్కొన్న విషయంపై ప్రధానంగా దృష్టి సారించనునన్నట్లు బుధవారం సమావేశమైన బోర్డు ప్రకటించింది. తాను నిర్వహించిన లావాదేవీల గురించి బోర్డు సభ్యులకు, బోర్డు, సీనియర్ ఉన్నతాధికారులకు తెలియదని సిద్ధార్థ పేర్కొన్న విషయం తెలిసిందే. కంపెనీపై వినియోగదారులు, సిబ్బంది పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవహరించాలని సిద్ధార్థ భార్య మాళవిక సూచించినట్లు బోర్డు సభ్యులు వెల్లడించారు. ఆగస్టు 8న జరుగనున్న బోర్డు సమావేశంలో ఆడిట్ కమిటీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేసేదానిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

## మోదీ సర్కారుది విష సంస్కృతి: మాల్యా



**లండన్:** కేంద్ర ప్రభుత్వం వ్యాపారులపట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నదని, విష సంస్కృతిని అవలంబిస్తున్నదని లిక్కర్ వ్యాపారి విజయ్ మాల్యా దుయ్యబట్టారు. సిద్ధార్థ మృతికి విచారం వ్యక్తం చేసిన మాల్యా.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యాపారులను మోదీ సర్కారు ఆదుకోవడం లేదని మండిపడ్డారు. సిద్ధార్థ ఓ గొప్ప వ్యక్తి అని, తెలివైన వ్యాపారి అంటూ కీర్తించారు. వ్యాపారులకు బాసటగా నిలువాల్సిన ప్రభుత్వం.. వేధింపులకు పాల్పడుతున్నదని, అందుకు సిద్ధార్థ మరణమే నిదర్శనమని విమర్శించారు. అప్పులు చెల్లిస్తానని చెబుతున్నా.. బ్యాంకులు వినడం లేదని, ప్రభుత్వం కూడా స్పందించడం లేదన్న మాల్యా.. దీన్ని కక్ష్య సాధింపు చర్యగానే అభివర్ణించారు. సిద్ధార్థ రాసిన లేఖతో బ్యాంకులు ఎవరినైనా నాశనం చేయగలవని రుజువైందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాగా, బ్యాంకులకు రూ.9 వేల కోట్లకుపైగా బకాయిపడి లండన్‌కు పారిపోయిన మాల్యా.. భారత్‌కు అప్పగింత విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

## మందగమనంలో 'మౌలికం'

జూన్‌లో 0.2 శాతం స్వల్ప వృద్ధి

**న్యూఢిల్లీ, జూలై 31:** గడిచిన కొన్ని నెలలుగా ఆశాజనక పనితీరు కనబరుస్తున్న కీలక రంగాల్లో మళ్లీ నిస్తేజం ఆవరించింది. చమురు, సిమెంట్ ఉత్పత్తి మందగించడంతో జూన్ నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 0.2 శాతానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో వృద్ధి 7.8 శాతంగా ఉన్నది. గత నెలలో క్రూడాయిల్ ఉత్పత్తి 6.8 శాతంగా ఉండగా, రిఫైనరీ విభాగం 9.3 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నది. వీటితోపాటు సిమెంట్ ఉత్పత్తి కూడా 1.5 శాతానికి జారుకోగా, ఎరువుల ప్రొడక్షన్ ప్రతికూలానికి పడిపోయింది. కానీ, స్టీల్, విద్యుత్ ఉత్పత్తిలో గణనీయ పెరుగుదల కనిపించింది. ఈ రంగాల్లో 6.9 శాతంగాను, 7.3 శాతం చొప్పున పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో) కీలక రంగాల్లో వృద్ధి 3.5 శాతంగా ఉన్నది.

## ఆర్బీఐ మాజీ డిప్యూటీ గవర్నర్ సుబీర్ గోకర్ణ్ కన్నుమూత



**న్యూఢిల్లీ, జూలై 31:** రిజర్వు బ్యాంక్ మాజీ డిప్యూటీ గవర్నర్ సుబీర్ విఠల్ గోకర్ణ్ మృతిచెందారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం అమెరికాలో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆయన మృతికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రగాఢ సంతాపం వ్యక్తంచేసింది. అక్టోబర్ 3, 1959లో జన్మించిన గోకర్ణ్..నవంబర్ 24, 2009 నుంచి డిసెంబర్ 31, 2012 వరకు రిజర్వు బ్యాంక్ డిప్యూటీ గవర్నర్‌గా విధులు నిర్వహించారు. మూడు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో పనిచేసిన ఆయనను అతి తక్కువ వయస్సులోనే ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ పదవి వరించింది. ప్రఖ్యాత ఆర్థికవేత్త అయిన గోకర్ణ్..ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో భారత్ తరపున ఈడీగా విధులు నిర్వహిస్తున్నారు. అంతకుముందు ఆయన బ్రోకింగ్ ఇండియా రీసర్చ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో మార్కెట్‌కు సరికొత్త ఎలక్ట్రిక్ టూ వీలర్‌ను పరిచయం చేస్తున్న కేఎస్ఎల్ క్లీన్‌టెక్, హువాయి హోల్డింగ్ గ్రూప్ ప్రతినిధులు

## ప్రీమియం స్మార్ట్‌ఫోన్లకు భలే గిరాకీ

ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 33 శాతం వృద్ధి



**న్యూఢిల్లీ, జూలై 31:** ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశీయ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ 33 శాతం వృద్ధి చెందింది. వన్‌ప్లస్, యాపిల్, సామ్‌సంగ్ తదితర సంస్థలు మార్కెట్‌కు కొత్త ఉత్పత్తులను పరిచయం చేసిన నేపథ్యంలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల సెగ్మెంట్ వినియోగదారులను ఆకట్టుకున్నది. వన్‌ప్లస్ నుంచి వన్‌ప్లస్ 7 సిరీస్, యాపిల్ నుంచి ఐఫోన్ ఎక్స్ ఆర్, సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎస్10 సిరీస్ మొబైల్ ఫోన్లు పరిచయమయ్యాయి. ఈ క్రమంలోనే రూ.30 వేల శ్రేణిలో స్మార్ట్‌ఫోన్లకు గిరాకీ పెరిగిందని ఓ ప్రకటనలో కౌంటర్‌పాయింట్ రిసెర్చ్ తెలిపింది. సకల ఫీచర్లున్న మొబైల్స్‌నే నేడు వినియోగదారులు ఇష్టపడుతున్నారని, దీంతో కాస్త ధర ఎక్కువైనా ఫర్వాలేదన్న భావన వచ్చిందని నిపుణులు తాజా మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల దిగుమతి మునుపెన్నడూ లేనివిధంగా ఆల్‌టైమ్ హైకి చేరిందని కౌంటర్‌పాయింట్ తెలియజేసింది. కాగా, షియామీ, ఒప్పో, వివో, హువావీలు సైతం ఈ ప్రీమియం మొబైల్ ఫోన్ల విభాగంలోకి ప్రవేశించడంతో పోటీ పెరిగింది. ఈ ఏడాది ద్వితీయార్థం (జూలై-డిసెంబర్)లో సరికొత్త మోడల్స్ రాకతో ఈ పోటీ మరింత పెరుగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏప్రిల్-జూన్ వ్యవధిలో దేశీయ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వన్‌ప్లస్, సామ్‌సంగ్, యాపిల్‌ల వాటా 85 శాతంగా ఉన్నది.

## రూ.4.32 లక్షల కోట్లకు ద్రవ్యలోటు

**న్యూఢిల్లీ, జూలై 31:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ముగిసేనాటికి ద్రవ్యలోటు రూ.4.32 లక్షల కోట్లకు చేరుకున్నది. 2019-20 ఏడాదికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంచనావేసిన దాంట్లో 61.4 శాతానికి చేరుకున్నది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో ద్రవ్యలోటు 68.7 శాతంగా ఉన్నది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం, ఖర్చుల మధ్య వ్యత్యాసాన్ని ద్రవ్యలోటుగా వ్యవహరిస్తారు. గత త్రైమాసికంలో రూ.2.84 కోట్ల ఆదాయం రాగా, ఇదే సమయంలో రూ.7.21 లక్షల కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాదికిగాను ద్రవ్యలోటును రూ.7.03 లక్షల కోట్లు కట్టడి చేయాలనుకుంటున్న కేంద్రం.. జీడీపీలో లోటును 3.4 శాతానికి నియంత్రించాలనుకుంటున్నది. అలాగే బడ్జెట్ అంచనావేసిన ఆదాయంలో 14.4 శాతం వివిధ రూపాల్లో సమకూరింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వసూలైన 15.5 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. ఈ ఏడాది మొత్తానికి రూ.19.77 లక్షల కోట్లు ఆదాయం రావచ్చునని అంచనావేసిన కేంద్రం..ఖర్చు కూడా రూ.27.84 లక్షల కోట్ల స్థాయిలో ఉండవచ్చునని పేర్కొంది.

# క్యూ-సిటీ టెక్ పార్క్ జప్తు

ఫెమా నిబంధనల ఉల్లంఘన కేసులో సీజ్ చేసిన ఈడీ



క్యూ-సిటీ టెక్ పార్క్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'క్యూ-సిటీ టెక్ పార్క్'ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోగల నానక్‌రామ్‌గూడాలో ఉన్న రూ.86 కోట్లకుపైగా విలువైన ఈ పార్క్‌ను విదేశీ మారకద్రవ్యం నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన కేసు దర్యాప్తులో భాగంగా అధికారులు సీజ్ చేశారు. ఈ పార్కు మ్యాక్ సాఫ్ట్ టెక్ ప్రైవేట్ (ఎంఎస్‌టీపీ) లిమిటెడ్‌కు చెందినది. 2,500లకుపైగా చదరపు గజాల్లో 2 లక్షల 45 వేల చదరపు అడుగుల్లో ఈ టెక్ పార్క్ నిర్మితమైంది. కాగా, విదేశాల్లో అక్రమాస్తులు కూడబెట్టిందన్న ఆరోపణలను ఎంఎస్‌టీపీ లిమిటెడ్ ఎదుర్కొంటున్నది. సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌ల కొనుగోలు, లీగల్ సర్వీసుల పేరిట భారత్ నుంచి పెద్ద మొత్తంలో నిధులను పలు దేశాలకు తరలించిందన్న ఆరోపణలున్నాయి. దీనిపై నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్న ఈడీ.. క్యూ-సిటీ టెక్ పార్క్‌ను సీజ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఈడీ అధికార వర్గాలు తెలియజేశాయి. ప్రస్తుతం లేని, నకిలీ సాఫ్ట్‌వేర్ లైసెన్సుల కొనుగోలు పేరిట హాంకాంగ్‌కు చెందిన ఓరియంట్ గైడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌కు 1.25 కోట్ల డాలర్లు (రూ.62.08 కోట్లు) అక్రమంగా బదిలీ చేసింది. అలాగే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన సెనట్ లీగల్ కన్సల్టెన్సీ ఎఫ్‌జెడ్ ఎల్ఎల్‌సీ, క్రెస్కో లీగల్ కన్సల్టెన్సీ ఎఫ్‌జెడ్ ఎల్ఎల్‌సీలకూ 2011 నవంబర్ నుంచి 2016 డిసెంబర్ మధ్య 39.80 లక్షల డాలర్ల (రూ.24.30 కోట్లు)ను పంపిందని ఈడీ చెబుతున్నది. దీనిపై ఫెమాలోని సెక్షన్ 37 కింద కేసు నమోదు చేసిన ఈడీ.. తాజాగా క్యూ-సిటీ టెక్‌పార్క్‌ను జప్తు చేసింది.

# ఐవోసీ లాభాల్లో క్షీణత

**న్యూఢిల్లీ, జూలై 31:** ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ నికర లాభం 47 శాతం క్షీణించింది. రిఫైనరీ మార్జిన్లు తగ్గుముఖం పట్టడం, ఇన్వెంటరీ తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో గండి పడిందని పేర్కొంది. సమీక్షకాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.3,737.50 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.4.07 ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికిగాను రూ.7,092.42 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.7.48 నమోదైంది.

**దెబ్బతీసిన ఇన్వెంటరీ గెయిన్స్**

దేశంలో అతి పెద్ద ఇంధన సంస్థకు రూ.2,362 కోట్ల ఇన్వెంటరీ లాభాలు వచ్చాయి. 2018-19 ఏడాది ఇదే సమయంలో రూ.7,065 కోట్లుగా ఉన్నది. కంపెనీ ఆదాయం రూ.1.53 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రతి బ్యారెల్‌ను శుద్ధి చేయడం ద్వారా వచ్చే ఆదాయం 10.21 డాలర్ల నుంచి 4.69 డాలర్లకు పడిపోవడంతో కంపెనీ లాభాలపై ప్రభావం చూపింది. విదేశీ ఎక్స్ఛేంజ్ ద్వారా సంస్థకు రూ.91.75 కోట్ల నిధులు సమకూరాయి. గతేడాది ఇది రూ.1,804.85 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఐవోసీ చైర్మన్ సంజీవ్ సింగ్ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో 22.66 మిలియన్ టన్నుల చమురు ఉత్పత్తులను విక్రయించినట్లు చెప్పారు. వీటిలో 17.28 మిలియన్ టన్నులను ప్రాసెసింగ్ చేసింది. మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు కిరోసిన్‌ను విక్రయించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.656 కోట్లు చెల్లించగా, అలాగే వంటగ్యాస్‌ను విక్రయించినందుకుగాను రూ.3,997 కోట్లు లభించాయి.

### ఆహా.. ఏమి రుచి!





బుధవారం జూరాల ప్రాజెక్టు 24 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేయడంతో సందర్శకుల తాకిడి పెరిగింది. దీంతో మత్స్యకారులు అక్కడే చేపలు పట్టి, అక్కడే వండి, వేడివేడిగా వడ్డిస్తూ పర్యాటకుల జిహ్వాచాపల్యం తీరుస్తున్నారు.



బుధవారం హైదరాబాద్ బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఖాళీ అయిన ఓ కార్యాలయంలో మరమ్మతులు చేస్తున్న దృశ్యం



## అగ్రికల్చర్ బీఎస్సీ ఆనర్స్‌లో ఎన్నారై కోటా ప్రవేశాలు

- ఆగస్టు 29 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సు ఎన్నారై లేదా ఎన్నారై స్పాన్సర్ కోటా ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఆగస్టు 29 వరకు పొడిగిస్తున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు.

**అగ్రికల్చర్ డిప్లొమా రెండోవిడుత కౌన్సెలింగ్ ప్రారంభం**

వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి బుధవారం నుంచి రెండోవిడుత కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఆగస్టు 3 వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్ తెలిపారు.

## ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో రిపోర్టింగ్‌కు గడువు రేపటివరకు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో తుది విడుత ఎంసెట్ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో రిపోర్ట్ చేయడానికి రెండురోజుల గడువు పొడిగించామని ఎంసెట్ అడ్మిషన్ కమిటీ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. గురువారం నుంచి నెలాఖరు వరకు రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు బీఎల్వోలు ఇంటింటికి తిరిగి తనిఖీ చేయనున్నారు. అక్టోబర్ 15న ఓటర్ల ముసాయిదాను ప్రకటించి, అభ్యంతరాలకు నవంబర్ నెలాఖరువరకు, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 15 వరకు గడువు విధించారు. 2020 జనవరి 15 లోగా ఓటర్ల తుది జాబితాను ప్రకటించనున్నారు. 2020 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండేవారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. నవంబర్ 30 వరకు ఆన్‌లైన్‌లో www.nvsp.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

# సాగురైతుకే మద్దతు ధర

- ఇక మధ్య దళారులకు చెల్లుచీటీ
- ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సిద్ధంచేస్తున్న మార్కెటింగ్‌శాఖ
- తెలంగాణ బ్రాండ్ పేరుతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించే వ్యూహం
- పంట ఎగుమతులపై మానిటరింగ్ కమిటీ అధ్యయనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాణ్యమైన ఆహార ఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ బ్రాండ్‌తో అందించడం ద్వారా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించేలా సర్కారు ప్రణాళికలు రూపొందిస్తున్నది. పంట సాగుచేసిన రైతులకే మద్దతు ధర కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. పంట ఉత్పత్తుల వారీగా కొనుగోళ్లకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) సాయంతో మార్కెటింగ్‌శాఖ రూపొందిస్తున్నది. ఇందులో సీజన్లవారీగా క్షేత్రస్థాయిలో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు పొందుపరుస్తారు. రాష్ట్రంలోని ఏ జిల్లా, ఏ మండలం, ఏ గ్రామంలో ఏ రైతు ఎంత విస్తీర్ణంలో, ఏ పంట సాగుచేస్తున్నారో పూర్తి సమాచారం ఉంటుంది. అర్థగణాంకశాఖ ఇచ్చే దిగుబడి వివరాలను ఆధారంగా చేసుకొని, కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తీసుకొచ్చే పంట ఉత్పత్తులను మద్దతు ధరకు సేకరిస్తారు. మధ్యలో దళారీకి అవకాశం లేకుండా పకడ్బందీగా ఆధార్ వివరాలు సైతం అనుసంధానిస్తారు. పంట కొనుగోలుచేసిన వెంటనే రైతుల ఖాతాకు నగదు జమచేస్తారు. వరి, పత్తితోపాటు పప్పుధాన్యాలను కూడా గ్రామాల్లో వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. వాటిని మార్కెట్‌కు తరలించి మద్దతు పొందుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా క్షేత్రస్థాయిలో ఏ రైతు.. ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగుచేశాడో పూర్తి గణాంకాలు ఉంటాయి. వారు నేరుగా మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముకొనే అవకాశం ఉంటుంది. కానీ, వ్యాపారుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలుచేసే అవకాశమే ఉండదు.

**ఎగుమతులపై అధ్యయనం**

తెలంగాణలో పండుతున్న ఉత్పత్తులకు ఏయే రాష్ట్రాల్లో, దేశాల్లో డిమాండ్ ఉన్నదనే అంశాన్ని మానిటరింగ్ కమిటీ ద్వారా తెలుసుకొని వారితో ఒప్పందాలు కుదుర్చుకుంటూ ప్రభుత్వమే మార్కెటింగ్‌శాఖ తరఫున ఎగుమతులు చేయనున్నది. దీంతో రైతులకు మద్దతు ధర లభించడంతోపాటు మార్కెటింగ్‌శాఖకు నష్టాలు కూడా ఉండవు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెడుతున్నందున నాణ్యమైన ఆహార ఉత్పత్తులను రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ బ్రాండ్‌తో అందించడం ద్వారా అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించవచ్చని సర్కార్ భావిస్తున్నది.

### ఇప్పటికే ఆదేశాలిచ్చిన సీఎం కేసీఆర్

ప్రస్తుతం ఎక్కువ పంట ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తున్నది. తొలుత ఆ సంస్థకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ తయారుచేస్తున్నారు. తర్వాత మిగతా హాకా, పౌరసరఫరాలశాఖ వంటి వాటికి అనుసంధానం చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వానకాలం నుంచే అన్నిరకాల పంటలను రైతుల నుంచి మద్దతు ధరకు పూర్తిస్థాయిలో కొనుగోలుచేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంలో సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీచేశారు. అన్నిశాఖల అధికారులకు వ్యవసాయోత్పత్తుల కొనుగోళ్లలో భాగస్వామ్యం కోసం ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు. రైతులు ఏ పంట అమ్ముకున్నా.. దళారుల, వ్యాపారుల దోపిడి లేకుండా ఉంటుందని సీఎం కేసీఆర్ భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన పంటలకే కాకుండా రాష్ట్రంలోని ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధంచేస్తున్నారు. పెద్దమొత్తంలో పంట ఉత్పత్తుల కొనుగోలుకు ప్రభుత్వమే మార్కెటింగ్‌శాఖకు హామీగా ఉండనుంది.



బుధవారం బీసీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల అధికారులతో సమావేశమైన బీసీ కమిషన్

## సంచారజాతుల విద్యార్థుల వివరాలివ్వండి

**గురుకుల విద్యాసంస్థల అధికారులతో సమావేశంలో బీసీ కమిషన్ సూచన**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాసంస్థల అధికారులతో తెలంగాణ బీసీ కమిషన్ సమావేశమైంది. బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు ఆంజనేయగౌడ్, జూలూరు గౌరీశంకర్ బుధవారం బీసీ కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. సంచారజాతుల విద్యార్థుల సమగ్ర వివరాలు అందజేయాలని గురుకుల విద్యాసంస్థల అధికారులకు సూచించారు. గురుకులాల్లో విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలు, వసతిగృహాల్లోని మౌలిక వసతులు, బోధిస్తున్న పాఠ్యాంశాలు, ఇతర వివరాలను బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు సేకరించారు. బీసీ జాబితాలో చేర్చాలని బీసీ కమిషన్‌ను కోరిన 18 సంచార కులాలపై చేపట్టిన అధ్యయనంలో భాగంగా ఆయా కులాలకు చెందిన చిన్నారులు, ఉద్యోగుల వివరాలను సమగ్రంగా సేకరించి బీసీ కమిషన్‌కు అందించాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాసంస్థల అధికారులు సత్యనారాయణరెడ్డి, జగన్నాథం, ఫణికుమార్, భరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# 'క్యూనెట్' బాధితుడి ఆత్మహత్య

- సంస్థలో రూ.20 లక్షల వరకు పెట్టుబడులు
- డబ్బులు పోయాయనే మనస్తాపంతో ఉరి

**మాదాపూర్:** గొలుసుకట్టు మార్కెటింగ్ వ్యాపార మాయాజాలానికి ఓ యువకుడి బలయ్యాడు. క్యూనెట్ సంస్థలో పెట్టుబడిపెట్టి నష్టపోయిన ఆడవు అరవింద్ (31) అనే యువకుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని శ్రీకాకుళానికి చెందిన అరవింద్ గచ్చిబౌలిలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంచేస్తూ.. మాదాపూర్ చందానాయక్ తండాలోని సీఎస్ఆర్ రెసిడెన్సీ 206 రూంలో ఐదుగురు స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. క్యూనెట్ గొలుసుకట్టు సంస్థలో రూ.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. ఏడుగురు స్నేహితులకు క్యూనెట్ గురించి చెప్పివారితో కూడా అరవింద్ పెట్టుబడులు పెట్టించాడు. ఇటీవల క్యూనెట్ సంస్థ బోర్డు తిప్పేయడంతో స్నేహితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని అరవింద్‌ను ఒత్తిడిచేశారు. దీంతో తన తండ్రి రాంచందర్ వద్ద రూ.20 లక్షలు తీసుకొచ్చి వారికిచ్చాడు. అప్పులుచేసి క్యూనెట్‌లో పెట్టిన డబ్బులు తిరిగిరావని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. స్నేహితులంతా విధులకు వెళ్లడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం డ్యూటీ ముగించుకొని వచ్చిన స్నేహితుడు ఎంతసేపు తలుపు కొట్టిన తీయకపోవడంతో తలుపును పగులగొట్టి చూడగా ఆత్మహత్య చేసుకున్న అరవింద్‌ను చూసి షాకయ్యాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న తండ్రి రాంచందర్ చిన్నకొడుకుతో కలిసి మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అరవింద్ అవివాహితుడు. కాగా, ఇప్పటికే క్యూనెట్ సంస్థపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. సంస్థ యజమానులతోపాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టుచేశారు.



ఆత్మహత్య చేసుకున్న అరవింద్ (ఫైల్)

## ఎంఎఫ్ఏ సదస్సుకు తెలంగాణ ఎన్నారై అధికారి చిట్టిబాబు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రవాసీ కార్మికుల కోసం వివిధ దేశాల్లో అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలపై అధ్యయనం చేసేందుకు మైగ్రంట్ ఫోరం ఇన్ ఏసియా (ఎంఎఫ్ఏ) ఆగస్టు 3, 4 తేదీల్లో సంప్రదింపుల సమావేశం నిర్వహించనున్నది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై విభాగం అధికారి ఈ చిట్టిబాబు పాల్గొననున్నారు. ప్రవాసీ కార్మికులకు అందుబాటులో ఉన్న సహాయక వ్యవస్థలు, ఉత్తమ పద్ధతుల గురించి ఈసమావేశంలో పాల్గొనే ప్రతినిధులు తమ అనుభవాలను పంచుకొనే వీలు కలుగుతుంది. అంతర్జాతీయస్థాయి సమావేశానికి చిట్టిబాబు హాజరుకానుండటంపై ఎంఎఫ్ఏ ఇండియా సభ్యులు పీ నారాయణస్వామి, మంద భీంరెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

## ఈ-పాస్‌తో ఇక అక్రమాలకు చెక్!

- మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా
- నేటినుంచి రాష్ట్రంలోని 28,623 పాఠశాలలకు పంపిణీ
- హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ
- వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అక్రమాలను అరికట్టేందుకు ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యాన్ని సరఫరా చేయబోతున్నామని వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం (ఆగస్టు 1) నుంచి 28,623 ప్రభుత్వ పాఠశాలలకు సెప్టెంబర్ కోటాను ఈ-పాస్ ద్వారానే సరఫరా చేస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని 3,965 సంక్షేమ హాస్టళ్లలోని 8.76 లక్షల మంది విద్యార్థులకు, అంగన్‌వాడీలకు ఇప్పటికే ఈ-పాస్ ద్వారా సరఫరా చేస్తుండగా.. కొత్తగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 23,87,751 మంది విద్యార్థులకు ప్రతినెలా 12 వేల మెట్రిక్ టన్నులు, ఏడాదికి దాదాపు 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఈ-పాస్ ద్వారా సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. ఈ విధానం ద్వారా ఏ రోజు, ఎంత మంది, ఎన్ని క్వింటాళ్ల బియ్యం తీసుకెళ్లారు, ఇంకా ఎంత తీసుకెళ్లాల్సి ఉందో తెలుసుకోవడంతోపాటు ప్రారంభ, ముగింపు నిల్వల వంటి వివరాలనూ ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి వీలు ఉందని తెలిపారు. మొత్తం సరఫరా ప్రక్రియ సులువుగా ఉంటుందని, హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

# అల్ఫాజియోలో ఐటీ సోదాలు!

- పలు కీలకపత్రాలు స్వాధీనం చేసుకొన్నట్టు సమాచారం
- అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ చాపర్ కుంభకోణంతో లింకులు?

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని అల్ఫాజియో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో ఆదాయం పన్నుశాఖ అధికారులు సోదాలు జరిపి కీలకపత్రాలను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ కుంభకోణం కేసుతో సంబంధం ఉన్నట్టు అనుమానించిన ఐటీ అధికారులు.. ఈ మేరకు దాడులు చేసినట్టు సమాచారం. అగస్టా వెస్ట్‌ల్యాండ్ చాపర్ కుంభకోణంలో కొంత డబ్బు అల్ఫాజియో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి మళ్లినట్టు వచ్చిన ఆరోపణల క్రమంలో ఈ తనిఖీలు జరిగాయని తెలుస్తున్నది. దుబాయ్ ఆధారిత ఆపరేటర్ ద్వారా దిగుమతులు చేసుకొన్నట్టుగా పెద్ద ఎత్తున ఇన్వాయిస్‌లను కంపెనీ డైరెక్టర్ రాజీవ్‌సక్సేనా నుంచి స్వాధీనపరుకొన్నట్టు తెలుస్తున్నది. హైదరాబాద్ కేంద్రంగా 1987లో ఏర్పాటైన అల్ఫాజియో కంపెనీ.. సెస్మిక్ సర్వే చేపట్టి ప్రకృతి వైపరీత్యాలను పసిగట్టడం, డాటా తయారుచేయడంలో పేరొందింది. కుంభకోణంలో అల్ఫాజియో లింకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతున్నది. మరోవైపు ఆదాయం పన్నుశాఖ అధికారులు తనిఖీలు జరుపడం చర్చనీయాంశంగా మారింది. అల్ఫాజియోలో సోదాల సమాచారాన్ని ఐటీ అధికారులు ఇంకా వెల్లడించలేదు.

# విశ్వరహస్య ఛేదనలో భారత్ కీలకపాత్ర

- ఈసీఐఎల్ నుంచి జర్మనీకి 67 అల్ట్రాస్టేబుల్ హై పవర్ కన్వర్టర్లు సరఫరా
- ఫెయిర్ టెక్నికల్ మేనేజింగ్ డైరెక్టర్ జోర్గ్‌బ్లౌరాక్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విశ్వరహస్యాలను ఛేదించేందుకు జరుగుతున్న ప్రపంచ విజ్ఞాన పరిశోధనలో భారత్ కీలకపాత్ర పోషిస్తున్నదని జర్మనీలోని ఫెసిలిటీ ఫర్ యాంటీ ప్రోటాన్ అండ్ అయాన్ రీసెర్చ్ (ఫెయిర్) టెక్నికల్ మేనేజింగ్ డైరెక్టర్ జోర్గ్ బ్లౌరాక్ అన్నారు. 16 దేశాలకుపైగా కలిసిచేస్తున్న పరిశోధనకు స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అల్ట్రాస్టేబుల్ హై పవర్ కన్వర్టర్లను అందించిన ఘనత భారత్‌కు దక్కిందని కితాబిచ్చారు. భౌతికశాస్త్ర పరిశోధనలో పవర్ కన్వర్టర్లది ముఖ్యపాత్ర అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో తయారైన 67 అల్ట్రా స్టేబుల్ పవర్ కన్వర్టర్లను బుధవారం జర్మనీకి తరలించారు. పవర్ కన్వర్టర్ల లోడు లారీలను జోర్గ్ బ్లౌరాక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పవర్ కన్వర్టర్ల తయారీకి ఈసీఐఎల్‌ను ఎంచుకున్నందుకు ఆనందంగా ఉందని చెప్పారు. జర్మనీలో జరుగుతున్న పరిశోధనలకు భారత్ ఈసీఐఎల్ ద్వారా ఎక్విప్‌మెంట్‌ను అందిస్తున్నదని అన్నారు. సైన్స్ ప్రయోగాలు చాలా క్లిష్టంగా ఉంటాయని, అయినా ఎంతో సహనంతో ఈసీఐఎల్ అల్ట్రా పవర్ కన్వర్టర్స్‌ను ప్రయోగానికి సరిపడే విధంగా అందించిందని ప్రశంసించారు. జర్మనీలో జరిగే అంతర్జాతీయ ప్రయోగాలకు భారత్ సహాయం చాలా అవసరమన్నారు. ఈసీఐఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ చూబే మాట్లాడుతూ.. గతంలో ఎనిమిది అల్ట్రా పవర్ కన్వర్టర్లను జర్మనీకి అందించామని చెప్పారు. జర్మనీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం 550 పవర్ కన్వర్టర్లను అందించాలని, మిగిలినవి సాధ్యమైనంత తొందరగా అందిస్తామని తెలిపారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటోమిక్ ఎనర్జీ సెక్రటరీ ఓఎస్డీ, ఈసీఐఎల్ మాజీ చైర్మన్ పీ సుధాకర్ మాట్లాడుతూ.. ఈ అల్ట్రా హై పవర్ కన్వర్టర్లను జర్మనీకి అందించి.. ఈసీఐఎల్ తన పరిశోధన సామర్థ్యాన్ని పెంచుకున్నదని తెలిపారు.



పదవీ విరమణ పొందిన డాక్టర్ వీ విజయలక్ష్మిని సన్మానిస్తున్న వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రవీణ్‌రావు

## 'ఫుడ్స్, న్యూట్రిషన్'కు దేశవ్యాప్త ప్రఖ్యాతి

**అగ్రి వర్సిటీ డీన్ విజయలక్ష్మి పదవీ విరమణలో వీసీ ప్రవీణ్‌రావు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని ఫుడ్స్ అండ్ న్యూట్రిషన్ విభాగానికి దేశవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు వచ్చేందుకు అదే విభాగంలో డీన్ కమ్యూనిటీ సైన్స్‌గా పనిచేసిన డాక్టర్ వీ విజయలక్ష్మి కృషి ఉన్నదని ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు అన్నారు. బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఏర్పాటుచేసిన విజయలక్ష్మి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ప్రవీణ్‌రావు.. ఆమెను సన్మానించారు. అప్పగించిన బాధ్యతలను డాక్టర్ విజయలక్ష్మి సమర్థంగా నిర్వహించారని ప్రవీణ్‌రావు పేర్కొన్నారు. 1977లో విద్యార్థిగా అడుగుపెట్టి.. చదువుకొన్న వర్సిటీలోనే డీన్ కమ్యూనిటీ సైన్సుగా పదవీ విరమణ చేయడం సంతోషంగా ఉన్నదని విజయలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ సుధీర్‌కుమార్, వర్సిటీ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్జరీ పత్రాలతో ప్లాట్ రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రార్, పోలీసులకు ఫిర్యాదుచేసిన బాధితుడు
- షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ సతీశ్‌పై కేసు నమోదు

**షాద్‌నగర్, నమస్తే తెలంగాణ:** యజమానికి సమాచారం లేకుండానే ఓ ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు దొంగపత్రాలు సృష్టించి విక్రయించిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుడు జీ రాఘవరావు, షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ సతీశ్ కథనం ప్రకారం.. షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో సర్వే నంబర్ 717/ఆ లేఔట్‌లో ప్లాట్ నంబర్ 147,148లోని 236 చదరపు గజాల స్థలాన్ని 2011లో కొత్తూరు మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన జీ రాఘవరావు కొనుగోలు చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇటీవల నందిగామ మండల నర్సప్పగూడ గ్రామానికి చెందిన శ్రీనివాస్.. రాఘవరావుకు తెలియకుండానే ఆ స్థలాన్ని షాద్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితుడు రాఘవరావు షాద్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ సతీశ్, షాద్‌నగర్ పట్టణ సీఐ శ్రీధర్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. నకిలీ దస్త్రాలతోపాటు రాఘవరావు సంతకం ఫోర్జరీ, నకిలీ ఆధార్ కార్డును సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, బాధితుడికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షాద్‌నగర్ పోలీసులు ఫోర్జరీ పత్రాలను సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సబ్ రిజిస్ట్రార్ సతీశ్‌పై బాధితుడు రాఘవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. రాఘవరావుకు చెందిన ఇంటి స్థలాన్ని శ్రీనివాస్ నకిలీ దస్త్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, స్థలం యజమాని ప్రమేయం లేకుండా సబ్ రిజిస్టార్ సతీశ్ రిజిస్ట్రేషన్ చేయడంతో అతనిపైనా కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

# ఐదువేల ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కారం

- బీఆర్ మీనా అభినందన సభలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్
- తెలంగాణ ఏర్పడ్డాకే బలహీనవర్గాలకు న్యాయం: బీఆర్ మీనా




ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా, కమల దంపతులను సన్మానిస్తున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/బషీర్‌బాగ్:** తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పడినప్పటి నుంచి ఐదువేల కేసులు పరిష్కారమయ్యాయని, ఆయా కేసుల్లో బాధితులకు రూ.33 కోట్ల మేర పరిహారం అందించామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరుగలేదని, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పాటైన తర్వాతనే పెండింగ్ కేసులు సత్వర పరిష్కారానికి నోచుకొన్నాయని తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పదవీ విరమణ పొందిన బీఆర్ మీనా అభినందన సభ జరిగింది. బీఆర్ మీనా, కమల దంపతులను ఎర్రోళ్ల శ్రీనివాస్ సహా రెవెన్యూ, సచివాలయం, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చెందిన పలువురు ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. కమిషన్ కార్యకలాపాల్లో బీఆర్ మీనా అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బీఆర్ మీనా మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాకే బలహీనవర్గాలకు న్యాయం జరిగిందని చెప్పారు. కమిషన్ సభ్యులు సుంకపాక దేవయ్య, విద్యాసాగర్, రాంబాల్‌నాయక్, నీలాదేవి, చిలకమర్రి నరసింహ, కమిషన్ డీడీ లావణ్య, విజయ్‌కుమార్, కమిషన్ సిబ్బంది భరత్‌కుమార్, రాంశంకర్, నరేందర్, సందీప్ పాల్గొన్నారు.

## దక్షిణ మధ్య రైల్వేకు అవార్డుల పంట

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తమ పనితీరుతో దక్షిణ మధ్య రైల్వే జాతీయస్థాయిలో నాలుగు విభాగాల్లో ఎఫీషియెన్సీ షీల్డులను సాధించింది. ట్రాఫిక్ ట్రాన్స్‌పోర్టేషన్, పర్సనల్ మేనేజ్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్, స్టోర్స్ విభాగాల్లో అవార్డులు దక్కాయి. ముంబైలోని ఎన్సీపీఏ ఆడిటోరియంలో జరిగిన 64వ రైల్వే వారోత్సవాల సందర్భంగా అవార్డులను రైల్వే బోర్డు చైర్మన్ వినోద్‌కుమార్‌యాదవ్ ప్రదానం చేశారు. అవార్డులు అందుకున్న వారిలో శివప్రసాద్, ఎన్వీ రమణారెడ్డి, వీఆర్ మిశ్ర, కే శివప్రసాద్ ఉన్నారు. ఉత్తమ పనితీరుతో విజయవాడ డివిజన్‌కు చెందిన సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ వీ ఆంజనేయులు, సికింద్రాబాద్ డివిజన్‌కు చెందిన సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ ఎం మనోజ్, సికింద్రాబాద్ డివిజన్‌కే చెందిన సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఏ కోటేశ్వరరావు వ్యక్తిగత అవార్డులు పొందారు. ఉత్తమ పనితీరుతో అవార్డులు పొందినవారిలో ట్రాక్ మెయింటేనీర్ సంజిత్‌కుమార్, టెక్నీషియన్ జీవీఎస్ రాజు, జూనియర్ ఇంజినీర్ జే కిశోర్ సైతం ఉన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు జాతీయస్థాయిలో, వ్యక్తిగత క్యాటగిరీల్లో అవార్డులు రావడంపై దక్షిణ మధ్యరైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్‌థామస్ అవార్డు గ్రహీతలను అభినందించారు.




నమస్తే తెలంగాణ
జిందగీ
గురువారం 1 ఆగస్టు 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

# మంచి ఆలోచనలతో లాభాలు



**ఇతరులకు మంచి చేస్తేనే మంచి జరుగుతుంది అనుకోనవసరం లేదు. మంచిని తలుచుకున్నా మంచే జరుగుతుంది. ఇది నిజమని అధ్యయనాలు చెబుతున్నాయి. అదెలాగంటే..?**

- మంచి అనుభవాలను తరచూ తలుచుకోవడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని ఓ పరిశోధనలో వెల్లడైంది. అందులో ఒత్తిడి తగ్గడం మొదటిది. మంచిని తలుచుకోవడం వల్ల కూడా మానసిక ఒత్తిడి బాగా తగ్గుతుంది. దీంతో భావోద్వేగాలు మెరుగుపడతాయి.
- ఎప్పుడూ మంచి గురించే ఆలోచించే వారికి గుండె జబ్బు సమస్య బాగా దూరంగా ఉంటుందట. ఒత్తిడి, డిప్రెషన్, దుఃఖం ప్రభావాలు గుండె ఆరోగ్యంపై పడుతాయి. ఎన్నో ఎమోషన్స్‌కు గుండె కేంద్రం. ప్రతికూల భావాలు గుండె ఆరోగ్యాన్ని ఎంతో దెబ్బతీస్తాయి.
- అందుకే, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఎప్పుడూ మంచి విషయాలే ఆలోచిస్తూ ఉండాలి. మంచి అనుభవాలను నెమరువేసుకుంటూ ఉండాలి.
- ప్రతికూల భావాలు అధికంగా ఉంటే త్వరగా ఆరోగ్యం దెబ్బతింటుంది. తద్వారా కొన్ని వ్యాధుల బారిన పడే ప్రమాదాలున్నాయి. కొన్నిసార్లు ఇవి దీర్ఘకాల అనారోగ్య సమస్యలుగా బాధపెట్టవచ్చు కూడా. ఇలా ప్రతికూల భావాలు రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం చూపుతాయి.
- రోగనిరోధక వ్యవస్థను కాపాడుకోవాలన్నా మంచి గురించే ఆలోచించాలి. ఎంత వీలైతే అంత సంతోషంగా ఉండడానికి ప్రయత్నిస్తూ ఉండాలి.

# శ్రావణ వేళ.. కమ్మని వంటకాలు



**వచ్చేది శ్రావణమాసం.. ఇంటింటా పూజలు.. పురస్కారాలు మొదలవుతాయి.. అమ్మలగన్న అమ్మను ఆరాధిస్తూ.. ఆడవాళ్లు భక్తి పారవశ్యంలో మునిగిపోతారు.. మరి ఆ అమ్మకు నైవేద్యంగా పెట్టాలంటే.. తియ్యని.. కమ్మని వంటకాలు చేయాల్సిందే! అందుకే చిరుధాన్యాలతో చేసిన.. ప్రత్యేకమైన వంటకాలు మీకోసం..**

## కొర్రల గారెలు



**కావాల్సినవి :** **కొర్రలు :** 200 గ్రా., **ఉల్లిపాయ ముక్కలు :** ఒక కప్పు, **అల్లం ముక్కలు :** ఒక టీస్పూన్, **సోంపు పొడి :** అర టీస్పూన్, **కరివేపాకు :** 2 రెమ్మలు, **పసుపు :** పావు టీస్పూన్, **జీలకర్ర :** పావు టీస్పూన్, **పచ్చిమిర్చి :** 3, **ఆలుగడ్డలు :** 100 గ్రా., **కొత్తిమీర :** చిన్న కట్ట, **ఉప్పు, నూనె :** తగినంత

**తయారీ :**

కొర్రలు శుభ్రం చేసి మూడు గంటల పాటు నానబెట్టాలి. ఆలుగడ్డలను ఉడకబెట్టి, పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. నానిన కొర్రలను మరీ మెత్తగా కాకుండా చూసుకోవాలి. దాంట్లో ఆలుగడ్డలను మెత్తగా చేసి అందులో కలుపాలి. దీంట్లోనే పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, కొత్తిమీర, పసుపు, జీలకర్ర, అల్లం ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి కలిపి ఒక పావుగంట అలా ఉంచాలి. ఈ లోపు కడాయిలో నూనె పోసి వేడి చేయాలి. నూనె వేడయ్యాక.. పిండిని గారెల్లా చేసి నూనెలో వేయాలి. గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చే వరకు వేయించి తీయాలి. ఇలా పిండి మొత్తం చేసుకోవాలి. పై నుంచి సోంపు పొడి చల్లి సర్వ్ చేయాలి. టేస్టీ కొర్ర గారెలు రెడీ!

## అవిసెల అన్నం



**కావాల్సినవి :**

**అవిసెలు :** ఒక కప్పు
**జీలకర్ర :** ఒక టీస్పూన్
**ధనియాలు :** 1 1/2టీస్పూన్స్
**ఎండుమిర్చి :** 5
**కరివేపాకు :** 4 రెమ్మలు
**పసుపు :** పావు టీస్పూన్
**బియ్యం :** 200 గ్రా.
**ఇంగువ :** పావు టీస్పూన్
**వెల్లుల్లి :** 6 రెబ్బలు
**నూనె :** 2 టేబుల్‌స్పూన్స్
**ఉప్పు :** తగినంత

**తయారీ :**

బియ్యం కడిగి మరీ మెత్తగా కాకుండా వండాలి. ఆ తర్వాత అన్నాన్ని ఒక ప్లేట్‌లో వేసి చల్లార్చాలి. ఈలోపు అవిసెలు, జీలకర్ర, ధనియాలు, ఎండుమిర్చి దోరగా వేయించాలి. అదే కడాయిలో కొద్దిగా నూనె పోసి వెల్లుల్లి రెబ్బలను కూడా వేయించాలి. వీటన్నింటినీ మిక్సీలో వేసి మెత్తటి పొడిలా చేసుకోవాలి. ఆ తర్వాత కడాయిలో మరికొద్దిగా నూనె పోసి కరివేపాకు, ఇంగువ, పసుపు, ఎండుమిర్చి వేసి పోపు పెట్టాలి. అన్నంలో అవిసెల మిశ్రమం వేసి కలిపి.. ఈ పోపు అందులో పోయాలి. అంతా సరిగా కలిసేలా చూసుకోవాలి. పై నుంచి కాస్త నెయ్యి వేసుకొని తింటే టేస్ట్ అదిరిపోతుంది.



**జి.యాదగిరి**
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్

## కేసరి పూర్ణాలు



**కావాల్సినవి :**

**బొంబాయి రవ్వ :** 200 గ్రా., **చక్కెర :** 100 గ్రా., **నెయ్యి :** 3 టేబుల్‌స్పూన్స్, **యాలకుల పొడి :** ఒక టీస్పూన్, **జీడిపప్పు :** 10 గ్రా., **కిస్మిస్ :** 10 గ్రా., **మినపపప్పు :** 100 గ్రా., **బియ్యం :** 50 గ్రా., **ఉప్పు, నూనె :** తగినంత

**తయారీ :**

బొంబాయి రవ్వ నెయ్యిలో దోరగా వేయించుకోవాలి. మినుపపప్పు, బియ్యం కడిగి నీళ్లు పోసి మూడు గంటల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత మరీ మెత్తగా కాకుండా ఈ పిండిని రుబ్బుకోవాలి. జీడిపప్పు, కిస్మిస్‌లను నెయ్యిలో వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో నీళ్లు పోసి మరిగించాలి. అందులో రవ్వ పోస్తూ ఉండలు కట్టకుండా కలుపుతుండాలి. దీంట్లోనే చక్కెర, యాలకుల పొడి, నెయ్యి వేసి దగ్గర అయ్యేంత వరకు కలుపుతుండాలి. పక్కన కడాయిలో నూనె పోసి వేడి చేయాలి. రవ్వ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసి పెట్టుకోవాలి. ఒక్కో ఉండను మినుపపప్పు మిశ్రమంలో ముంచి నూనెలో వేసి వేయించాలి. నెయ్యితో పాటు ఈ పూర్ణాలు తింటే మరింత టేస్టీగా ఉంటాయి.

## అల్లం భక్షాలు



**కావాల్సినవి :**

**బెల్లం :** 100 గ్రా.
**అల్లం :** 25 గ్రా.
**మైదాపిండి :** 300గ్రా.
**శనగపప్పు :** 250 గ్రా.
**నెయ్యి, ఉప్పు :** తగినంత

**తయారీ :**

అల్లం చెక్కు తీసి సన్నగా, పొడవుగా కట్ చేసి పెట్టుకోవాలి. బెల్లం తురిమి, కొన్ని నీళ్లు పోసి నానబెట్టాలి. శనగపప్పులో నీళ్లు పోసి రెండు గంటల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత శనగపప్పును ఉడికించి, ఉడికిన తర్వాత మెత్తగా మెదిపి పెట్టుకోవాలి. ఇందులో బెల్లం వేసి బాగా దగ్గర అయ్యే వరకు ఉడికించాలి. దీంట్లో అల్లం ముక్కలు వేసి కొంచెం సేపు మగ్గనివ్వాలి. ఈలోపు మైదాపిండిలో తగినంత ఉప్పు, నీరు వేసి పూరీ పిండిలా కలిపి పెట్టుకోవాలి. చల్లారిన శనగపప్పు మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చేసుకోవాలి. మైదాపిండిని కూడా చిన్న ఉండల్లా చేసుకొని అందులో శనగపప్పు మిశ్రమంలో కూరాలి. ఆ తర్వాత నెయ్యితో చిన్నగా పూరీల్లా ఒత్తుకోవాలి. ఇలా పిండి మొత్తం చేసుకోవాలి. పెనం మీద కాస్త నెయ్యి లేదా నూనె వేసి ఈ భక్షాలను రెండు వైపులా కాల్చుకోవాలి. వీటిని పాలతో తింటే సూపర్‌గా ఉంటాయి.

# ముఖాకృతిని బట్టి పాపిట

**చాలామంది జుట్టుకు పాపిట తీసే విధానం గురించి ఎక్కువగా ఆలోచించరు. కావాల్సిన విధంగా రాకుంటే బాధపడుతూ ఉంటారు. కనుక ముఖాకృతిని అనుసరించి జుట్టు పాపిటను మేకప్‌కు సరిపోయేలా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా?**



**1 గుండ్రటి ముఖాకృతి :** గుండ్రటి ముఖం ఉన్న పక్షంలో మధ్య పాపిటిని అనుసరించి జుట్టును వదిలేస్తేనే బాగుంటుంది. రెండువైపులా ముఖాన్ని కొద్దిగా కప్పి ఉంచుతుంది. ఇది ముఖాన్ని స్లిమ్‌గా, పొడవుగా కనిపించడానికి సహాయపడుతుంది.

**2 దీర్ఘవృత్తాకార ముఖాకృతి :** అండాకృతిలో ముఖం ఉన్నవారు జుట్టును ఏ విధంగా అయినా వేసుకోవచ్చు. అంటే పొడవాటి జుట్టు ఉన్న, షార్ట్, మీడియం జుట్టు ఉన్నా ఎలాంటి నష్టం లేదు. ఎలాంటి హెయిర్‌స్టయిల్‌లో అయినా ట్రెండీగా కనిపిస్తారు.

**3 చతురస్రాకారపు ముఖాకృతి :** చతురస్రాకారంలో విశాలమైన నుదురు గల వారికి హెయిర్ స్టైల్ చేయడం కష్టంగానే ఉంటుంది. నుదురుని కాస్త కప్పి ఉంచేలా స్టైలింగ్ అనుసరిస్తూ పక్క పాపిట జోడిస్తే బాగుంటుంది.

**4 డైమండ్ ఫేస్ :** ఈ ముఖానికి సైడ్ పార్టింగ్ చేస్తూ భుజాల మీదుగా జుట్టుని జారవిడిచిన ఎడల అందంగా కనబడుతారు. సైడ్ పార్టింగ్ మీ నుదురును కప్పిపుచ్చడంలో సహాయ పడుతుంది.

**5 ఆబ్లాంగ్ ముఖాకృతి :** నుదురు నుంచి గడ్డం వరకు అదే వెడల్పుతో ఉన్న ఎడల దానిని ఆబ్లాంగ్ ఫేస్ అంటారు. ఇరువైపులా వెంట్రుకలతో కూడిన మధ్యపాపిట ముఖం పొడవును అదేవిధంగా పక్కభాగాలను కప్పి ఉంచేందుకు దోహదపడుతుంది.

# ఆమె ఓ మార్గదర్శి!



**ఆమె దేనికి దూరమైందో అలాంటి పరిస్థితి తోటి అమ్మాయిలకు రావొద్దనుకున్నది. ఆర్థిక సమస్యలు వెంటాడినా చదువుకున్నది. ఇప్పుడు ఎందరో చదువుకొనేందుకు ఓ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేసింది. చదువుకు దూరమవుతున్న పిల్లలను బడి వైపు అడుగులేయిస్తున్నది.**

సఖి ఆర్తినాయక్ ముంబైలోని ములుండ్ ప్రాంతంలోని ఓ స్లమ్ ఏరియాలో పుట్టింది. ఆమెను ప్రోత్సహించేవారు, సాయం చేసేవారు, సలహాలు ఇచ్చేవారు ఎవరూ లేరు. దీంతో పదో తరగతి ఫెయిల్ అయింది. కానీ ఆమెలో చదువుకోవాలన్న కోరిక బలంగా ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగోలేవు. చదువు కోసం కుటుంబం మీద ఆధారపడకూడదని నిర్ణయించుకుంది. రకరకాల పనులు చేసుకుంటూ పదో తరగతి పాస్ అయింది. అశోక యూత్ వెంచర్ అనే సంస్థ కూడా ఆమెకు ఆర్థిక సాయం చేసింది. దీంతో ఇంటర్మీడియట్ చేసింది. ఆ తర్వాత తనలాంటి ఎందరో అమ్మాయిలు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనీ, వారి చదువు కోసం పాటుపడాలని నిర్ణయించుకున్నది. 2008లో 'సఖి' ఆర్గనైజేషన్‌ను ప్రారంభించింది. అది పూర్తిగా అమ్మాయిల చదువుకోసమే పనిచేస్తున్నది. మురికివాడల్లోనే అమ్మాయిలకు చదువు చెప్పడం ప్రారంభించింది. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా సోషియాలజీలో డిగ్రీ చదువుకుంటూనే, మురికివాడలోని ప్రతి ఇంటికీ తిరిగింది. అమ్మాయిలను చదివించడానికి ప్రోత్సహించింది. మొదట ఎవరూ ఆసక్తి చూపకపోయినా తన ప్రయత్నం మాత్రం మానలేదు. ఆడపిల్లలున్న తల్లులకు ముందు అవగాహన కల్పించింది. క్రమంగా ఫలితం కనిపించింది. మొదట ఆరుగురితో మొదలై 23 మంది ఆర్తి దగ్గరకు వచ్చారు. ఇప్పుడు 400 మంది అమ్మాయిలు సఖి ద్వారా చదువుకుంటున్నారు. వచ్చే ఐదేండ్లలో ఈ సంఖ్యను వెయ్యికి పెంచాలని భావిస్తున్నది. మొదట ఒక్కతే ప్రారంభించినా తర్వాత తోటి స్నేహితులు ఆర్తితో కలిసొచ్చారు. 2013లో ఓ అంతర్జాతీయ సంస్థ సహాయంతో మురికివాడలో 'గర్ల్ లెర్నింగ్ సెంటర్'ను ఏర్పాటు చేసింది. బుక్ బ్యాంక్ ఏర్పాటుచేసి అమ్మాయిలకు పుస్తకాలను అందిస్తున్నది. ఇలా ఆర్తి అక్కడి వారందరికీ మార్గదర్శినిగా మారింది.

## వంట చిట్కాలు



- పన్నీర్‌ను ఉడికించేటప్పుడు వాటిలో కొద్దిగా ఉప్పు కలుపుకొంటే మంచి ఫలితం ఉంటుంది.
- చపాతీలు మృదువుగా రావాలంటే పిండిని కలుపుకొనేటప్పుడు అందులో కొద్దిగా మక్కజొన్న పిండి, పాలు కలుపుకొంటే చాలు.
- నూడుల్స్ విరిగా రావాలంటే వాటిని చల్లని నీటితో వేసుకుంటే మంచిది.
- ఆలుగడ్డలు ఉడికించిన తర్వాత తొక్కతీస్తే అంత త్వరగా రాదు. అలాంటప్పుడు అవి ఉడికేటప్పుడు కొద్దిగా ఉప్పు వేస్తే తొక్క తేలికగా వస్తుంది.
- బఠాణీలు ఉడికించేటప్పుడు వాటిలో కొద్దిగా చక్కెరను కలుపుకొంటే రంగు మారకుండా ఉంటుంది.
- పప్పు త్వరగా ఉడకాలంటే అందులో కొంచెం నూనె కలుపుకోవాలి.

# ఆటే లక్ష్యంగా..

**చిన్నప్పటి నుంచీ ఫుట్‌బాల్ మీద ఆసక్తితో పెరిగింది. పదో తరగతి తర్వాత ఆటమీద పట్టు సాధించింది. అన్నో అడ్డంకులు ఎదుర్కొని, ఆత్మస్థయిర్యంతో ముందుకెళ్లింది. ఇప్పుడు ఫిఫా అండర్ 17 పోటీల్లో పాల్గొంటున్నది తమిళ నాడుకు చెందిన మరియమ్మల్.**



తమిళనాడులోని నమ్మకల్ జిల్లా సాలెమ్ పట్టణంలోని ఓ చేనేత కుటుంబంలో పుట్టింది మరియమ్మల్. పెద్దన్న ఫుట్‌బాల్ క్రీడాకారుడు. చిన్నప్పటి నుంచీ అతన్ని చూసి మరియమ్మల్ కూడా అతనిలా ఫుట్‌బాల్ ప్లేయర్ కావాలని కలలు కన్నది. ఎనిమిదో తరగతిలోని నమ్మకల్ ఫుట్‌బాల్ క్లబ్‌లో చేరింది. చదువు, ఫుట్‌బాల్ శిక్షణ ఏకకాలంలోనే పూర్తి చేసింది. పదో తరగతి వరకల్లా మంచి పట్టు సాధించింది. నమ్మకల్‌లోనే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. కాలేజీలో ఉన్నప్పుడు ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనేది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తన ప్రతిభను కనబర్చేది. 2018లో గోవాలో నిర్వహించిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో నమ్మకల్ జట్టు విజయంలో కీలక క్రీడాకారిణి అయింది. ఆ తర్వాతే అండర్ 17 ఇండియన్ ఫుట్‌బాల్ టీమ్‌లోకి సెలెక్ట్ అయింది. ఈ టీమ్ నుంచే 2020లో జరుగబోయే ఫిఫా టోర్నమెంట్‌లో పాల్గొనబోతున్నది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం నుంచి వచ్చిన మరియమ్మల్ ఆట మీద దృష్టి పెట్టింది. ఆటే లక్ష్యంగా ముందుకు సాగుతూ ఇప్పుడు జాతీయ జట్టులో స్థానాన్ని సాధించింది.

నమస్తే తెలంగాణ
# విశేష
[ కరీంనగర్ ]
గురువారం 1 ఆగస్టు 2019

## సముద్రగర్భంలో సరికొత్త మ్యూజియం!

మ్యూజియంను సరికొత్తగా సముద్రగర్భంలో ఏర్పాటు చేశారు. ఇది ఇక్కడికి వచ్చే పర్యాటకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందిస్తున్నది. ఇంతకీ అది ఎక్కడ ఉందో తెలుసా?



ప్రపంచంలోనే మొదటిసారిగా సముద్రగర్భంలో మిలటరీ మ్యూజియంని నిర్మించారు. జోర్డాన్‌లోని అకాబా తీరంలో ఈ అరుదైన ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. ఆ దేశానికి వచ్చే పర్యాటకులకు ఈ 'కొత్తరకం' మ్యూజియం వింత అనుభూతిని అందిస్తున్నది. ఇందులో యుద్ధట్యాంకులు, ట్రూప్ కారియర్లు, హెలికాప్టర్ వంటివి ఉన్నాయి. జోర్డాన్ రాయల్ ఎయిర్‌ఫోర్స్ సముద్రగర్భంలో ఏర్పాటు చేసిన ఈ మ్యూజియంకు హెలికాప్టర్‌ను బహూకరించింది. 19 రకాల యుద్ధవాహనాలు ఇక్కడ ఉన్నాయి. ఎర్ర సముద్రంలో 92 అడుగుల లోతున యుద్ధంలో మోహరింపును తలపించేలా సముద్ర గర్భంలోని పగడపు దిబ్బలపై దీనిని ఏర్పాటు చేశారు. ఇవేకాకుండా ఇక్కడ పర్యావరణం, క్రీడలకు సంబంధించిన అనేక వస్తువులను ప్రదర్శిస్తున్నారు. సముద్రంలోని జీవులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా యుద్ధవాహనాలను లోపలికి తీసుకెళ్లే ముందు హానికారక పదార్థాలను తొలగించారు. స్నోర్కెల్ మాస్క్ ధరించి సముద్రంలోపలికి వెళ్లాల్సి ఉంటుంది. స్క్యూబా డైవర్లు సముద్రం అడుగు వరకూ వెళ్లి ఈ మ్యూజియాన్ని చూడొచ్చు. పర్యాటకులను మాత్రం గాజు ఫ్లోర్ ఉన్న పడవల్లో తీసుకెళ్లి సముద్రం అడుగున ఉన్న యుద్ధవాహనాల ప్రదర్శనశాలను తిలకించేలా ఏర్పాట్లు చేశారు.

## ట్వీట్





**విమలా రామన్**
@Vimraman

**నాలోని నటనను.. నటనా పటిమను ఇలా ఓ ఫ్రేమ్‌గా మలిచారు. ఎంతో ఉత్తేజంతో చేసిన ఈ నట నేంటో త్వరలో తెలుస్తుంది!**

విమలా రామన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
2,03,909

## కామన్‌మ్యాన్ వాయిస్

9 కోట్ల మంది ముస్లిం మహిళల కోసం తలాక్ తలాక్ తలాక్ బిల్లు తెచ్చినందుకు అభినందనలు. మరి 60 కోట్ల మంది భారతీయ మహిళామణుల కోసం 'మహిళా రిజర్వేషన్ బిల్లు' ఎప్పుడు తెస్తారో చెప్పండి?
– Podduturi Niranjan

ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకునేంత సంపద వద్దు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదరికం వద్దు. మధ్యతరగతి జీవితం చాలు దేవుడా!
– Murali Buddha

గ్రామాల్లో సర్పంచ్‌లు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలి. అప్పుడు భూగర్భజలాలు పెరిగి నీటి సమస్యలకు కొంతమేర పరిష్కారం లభిస్తుంది.
– Manjula Reddy

## సరికొత్త పాన్‌లు



**భోజనానంతరం వేసుకునే పాన్‌లల్లో సరికొత్త రుచులు వస్తున్నాయి. హైదరాబాద్ బిర్యానీకే కాదు కిళ్లీలకూ అంతే ఫేమస్. ఇప్పుడు నగరంలో 30 రకాల స్వీటు పాన్‌లు తయారవుతున్నాయి.**

భాగ్యనగరంలో పాన్ దుకాణాలు గల్లీకొకటి కనిపిస్తుంటాయి. అందరికీ కిళ్లీల్లో 2 రకాలకు మించి తెలియవు. ఒకటి ఆకేసి సున్నం రాసి, ఖత్తా( చెట్టు బెరడు నుంచి తయారుచేసే పొడి) పూసి, వక్క పలుకులేసి, ఖర్జూరం, సోంపు వేసి చుట్టే పాన్‌ను సాదా పాన్ అంటారు. రెండోది మీఠా. తమలపాకుల్లో కొబ్బరి పలుకులు టూటీఫ్రూటీలు, ఎండుపండ్లు, ఖర్జూరం, బాదం, కిస్మిస్, గుల్‌ఖండ్, యాలకులు, వక్కపలుకులు, లవంగాలు వంటి పదిరకాల దినుసులతో స్వీటు పాన్ తయారవుతుంది. కూకట్‌పల్లిలోని చైతన్య పుడ్ కోర్టులో లభించే మీఠా కిళ్లీలో 35రకాల పదార్థాలు వేస్తారు. ఆర్డర్‌ను బట్టి వెండి, బంగారు రేకులూ కలుపుతారు. సికింద్రాబాద్‌లోని డిమ్మీ పాన్ ప్యాలెస్‌లో తయారయ్యే 75 రకాల పాన్‌లలో 30 రకాలు స్వీట్ పాన్‌లే. కోల్‌కతా మీనాక్షి నుంచి కుల్ఫీమీఠా వరకూ రకరకాల పాన్‌లతో కిళ్లీ ప్రియుల మనసు దోచుకుంటున్నదీ దుకాణం. కొత్తగా పెండ్లైన వారికి ప్రత్యేకమైన పాన్‌లు కూడా ఇక్కడ ఉన్నాయి. వాటిని హనీమూన్ పాన్‌లని అంటారు. పూర్వకాలంలో ఆడవాళ్ల కోసం స్పెషల్ కిళ్లీలుండేవట. మను చరిత్రలో వరూధిని వేసుకున్న తాంబూలం గురించి ప్రస్తావించారు. ఆమె వేసుకున్న కిళ్లీ పరిమళాన్ని గుర్తించిన ప్రవరాఖ్యుడు ఆ చుట్టు పక్కల స్త్రీ ఉన్నదని తెలుసుకోగలిగాడట. కాలానుగుణంగా కిళ్లీలున్నాయి. శీతాకాలంలో ఒంట్లో వేడిని పెంచడానికి కేసర్, కస్తూరి, లాల్‌జరి వంటివి కడుతుంటారు. వేసవి కాలంలో చలువ కోసం ఖస్‌రకాలనీ, ఐస్‌పాన్, రోజ్, చందన్ వంటి పాన్‌లు చుడతారు. ముంబై, ఢిల్లీలలో ఫైర్ పాన్‌కు మంచి గిరాకీ లభిస్తున్నది.

## లేటు వయసులో..



**పెండ్లి కుమారుడి వయసు 100, పెండ్లి కుమార్తె వయసు 103 ఏండ్లు. వారిద్దరి మనసులు కలవడంతో లేటు వయసులోనూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు.**

జాన్ కుక్ ,ఫిల్లిస్ కుక్‌లు అమెరికాలోని ఒహాయోలోని వృద్ధాశ్రమంలో ఉంటున్నారు. ఏడాది నుంచి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. వారి మనసులూ కలిసాయి. ఒకరికోసం ఒకరని నిర్ణయించుకున్నారు. వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ వయసులో పెండ్లేంటి? అని చాలామంది హేళన చేశారు. కానీ వారిద్దరూ మాత్రం ఎవరి మాటలనూ పట్టించుకోలేదు. వయసు మీద పడిన తర్వాత కావాల్సింది తోడూ, నీడేనని అందుకోసమే పెండ్లి చేసుకున్నామని కుక్ దంపతులు చెబుతున్నారు. భాగస్వాములను కోల్పోయి ఇక్కడకు చేరామని ఒకరిపై ఒకరికి ఇష్టంతో ఒకటయ్యామని అంటున్నారు. మిగతా వాళ్ల అభిప్రాయాలతో తమకు సంబంధం లేదంటున్నారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా నచ్చిన విధంగా జీవితాన్ని గడుపుతామని చెబుతున్నారు. ఒకరికొకరు తోడూ నీడగా జీవిస్తున్నారు. ఈ దంపతుల పెండ్లి విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అందరూ వారి వివాహబంధాన్ని ఆమోదించడం విశేషం.

**దివ్యాంగులు కారు నడపడం సాధ్యమయ్యే పనేనా? వీల్ చైర్‌కు పరిమితమైన వారు డ్రైవింగ్ చేయడం వీలవుతుందా? కాళ్లు, చేతులు సరిగా లేకపోయినా కారు నడిపేయొచ్చు. ఓ మెకానిక్ అటువంటి వారి కోసం కార్లు, బైక్‌లలో మార్పులు, చేర్పులు చేసి అందిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో అవయవాలను కోల్పోయిన వారు, అనారోగ్య కారణాల వల్ల బయటికి రాలేని వారు వీల్‌చైర్‌ను నడిపినంత సులువుగా వాహనాలు నడిపేలా వాటిని తయారు చేస్తున్నాడు జానీ మియా. హైదరాబాద్‌లో వర్క్‌షాపు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ 5 వేల వాహనాలను మార్చి అరుదైన ఘనతను ఆయన సొంతం చేసుకోవడం విశేషం.**



# దివ్యాంగులూ కారు నడుపవచ్చు

వనస్థలిపురంలో 'క్రియేటివ్ టెక్నాలజీస్' పేరుతో ప్రత్యేకంగా గ్యారేజీని ప్రారంభించాడు జానీమియా. వైకల్యాన్ని బట్టి కార్లను 14 రకాలుగా డిజైన్ చేస్తున్నాడు. ఇప్పటి వరకూ వేల సంఖ్యలో వాహనాల డ్రైవింగ్ వ్యవస్థను మార్చి వికలాంగులు సైతం షికారు చేసేలా రూపొందిస్తున్నాడు. కాళ్లు లేనివారు గేర్లు, క్లచ్, బ్రేక్, ఎక్సలేటర్ ఉపయోగించడం చాలా కష్టం. అటువంటి వారికోసం పెద్దగా కష్టపడే పని లేకుండా అన్ని పనులు చేతులతోనే సులువుగా చేసేందుకు హ్యాండ్ కంట్రోల్ మాడిఫైయర్ రూపొందించాడు. రెండు చేతుల్లో ఏదైన ఒకటే చేయి ఉన్న వారికోసం ప్రత్యేకంగా మరో విధానం ఉంటుంది. రెండు చేతులూ లేకపోయినా కాళ్లతోనే నడిపించేలా ఇంకో పద్ధతి ఉంటుంది. అందుకు హైడ్రాలిక్, ఎలక్ట్రికల్ మోటార్స్, కేబుల్, యాంగర్లను ఉపయోగించి డ్రైవ్ చేయవచ్చు. దివ్యాంగులు నడిపే కార్లలో సీటు కూడా డిఫరెంట్‌గా ఉంటుంది. అసలు నడవలేని పరిస్థితుల్లో ఉండేవారు వీల్‌చైర్‌తోనే డ్రైవింగ్ సీటు దగ్గరకు వెళ్లొచ్చు. కారు వెనుక నుంచి వీల్‌చైర్‌ను లోపలికి తీసుకెళ్లేలా ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. మార్పులు చేసిన కారును మామూలు వ్యక్తులు కూడా నడపవచ్చు. అందుకు దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థను లాక్ చేస్తే సరిపోతుంది.



దివ్యాంగుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసు కాబట్టే నాలా ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో గ్యారేజీని ప్రారంభించా. అనేక రాష్ట్రాల నుంచి వచ్చి కార్లను మాడిఫై చేయించుకుంటున్నారు. ఇలా సేవలు అందించడం నాకు చాలా సంతోషంగా ఉంది.
–జానీమియా,
క్రియేటివ్ టెక్నాలజీస్, ఫౌండర్.

### దేశ, విదేశాలకు సేవలు

మన దేశంలోని వివిధ రాష్ర్టాలకు చెందిన దివ్యాంగులకు సైతం జానీమియా డిజేబుల్డ్ డ్రైవింగ్ సేవలందిస్తున్నాడు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బెంగళూరు, ఒడిషా వంటి రాష్ర్టాల నుంచి వస్తున్నారు. కార్ల మార్పు చేర్పుల కోసం జానీమియా 'క్రియేటివ్ టెక్నాలజీస్'నే ఆశ్రయిస్తున్నారు. జానీ డిజేబుల్డ్ డ్రైవింగ్ కిట్లను స్వయంగా తయారు చేశాడు. దేశ, విదేశాల్లో ఉన్న వారికి ఇక్కడి నుంచే వాటిని పంపిస్తాడు. ఆయా కిట్లను కార్లకు ఏ విధంగా అమర్చుకోవాలనే విషయాలను ఆన్‌లైన్ ద్వారా వాళ్లకు వివరిస్తాడు.

### వారి సమస్యలు తెలుసు..

ఖమ్మం జిల్లాకు చెందిన జానీమియా పోలియో కారణంగా చిన్నప్పుడే రెండు కాళ్లు కోల్పోయాడు. ఐటిఐ పూర్తి చేశాక ఖమ్మంలో కొన్నాళ్లు ఫ్యాన్లు, టీవీలు రిపేరు చేశాడు. ఆ తర్వాత కువైట్‌లోని ఓ ఎలక్ట్రానిక్ చిప్ తయారీ కంపెనీలో రెండేండ్లు పని చేశాడు. డిజేబుల్డ్ డ్రైవింగ్ గురించి తెలుసుకుని కారు కొని మొదటగా దానిపై ప్రయోగాలు చేశాడు. సొంత కారులో మార్పులు, చేర్పులతో డ్రైవింగ్ చేయడం మొదలు పెట్టాడు. దివ్యాంగుల సమస్యలు అతనికి తెలుసు కాబట్టి ఎవరెవరికి ఎలా ఉంటే అనుకూలంగా ఉంటుందో జానీ గుర్తించాడు. అలా అవసరమైన వారికి అనుగుణంగా వాహనాలను మాడిఫై చేస్తున్నాడు. 2009లో హైదరాబాద్‌లో 'క్రియేటివ్ టెక్నాలజీస్' పేరుతో వర్క్‌షాపు ప్రారంభించాడు. వేల మంది దివ్యాంగులకు సేవలందిస్తూ అందరి ప్రశంసలూ అందుకుటుంన్నాడు జానీమియా.

### ఎలా పని చేస్తుందంటే?

క్లచ్, బ్రేకు, ఎక్సలేటర్, గేరు వీటిని పెడల్‌కు అనుసంధానం చేశారు. ఒకే చేత్తో దాన్ని పైకి కిందకు కదిలించడం ద్వారా కారు నడుపవచ్చు.

### డ్రైవింగ్‌లో శిక్షణ

దివ్యాంగులు డ్రైవింగ్ నేర్చుకోవాలంటే చాలాకాలం పడుతుంది. కానీ జానీ తయారు చేసిన డెమో వెహికిల్‌తో అయితే రెండు వారాల్లో డ్రైవింగ్ నేర్చుకోవచ్చు. డ్రైవింగ్ వచ్చిన తర్వాత ఆర్టీఏ కార్యాలయంలో టెస్ట్ డ్రైవ్ చేసి లైసెన్స్ పొందొచ్చు. వైకల్యానికి అనుగుణంగా కారును మార్పు చేయడానికి రూ. 10 వేల నుంచి 40 వేల వరకూ ఖర్చవుతుంది. అవసరమైన వారు మరిన్ని వివరాలకు http://handicappedcar.in వెబ్‌సైట్ చూడొచ్చు.

... పసుపులేటి వెంకటేశ్వరరావు

## వైరల్ వీడియో



**మీరు చేపల కోసం ఎప్పుడైనా గాలం వేశారా? ఒకరికొకరు పోటీ పడి చేపలు పట్టడం చూసే ఉంటారు కదా? అయితే గాలంతో చేపలు పట్టడాన్నే 'పోటీలు'గా పెట్టుకొంటున్నారు విదేశాల్లో. అలాంటి ఒక ట్రెండింగ్ వీడియో సందడి చేస్తున్నది. చూడండి!**

Bass Fishing Battle | Dude Perfect
Total views : 1,03,00,414+
Published on Jul 29, 2019

## సుడోకు

డైలీ సుడోకు 108 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 5 | 4 | 1 | 7 | 8 | 3 | 9 |
| 9 | 3 | 1 | 2 | 5 | 8 | 6 | 7 | 4 |
| 8 | 4 | 7 | 6 | 3 | 9 | 2 | 1 | 5 |
| 5 | 8 | 3 | 9 | 7 | 2 | 4 | 6 | 1 |
| 4 | 1 | 2 | 5 | 8 | 6 | 3 | 9 | 7 |
| 6 | 7 | 9 | 3 | 4 | 1 | 5 | 8 | 2 |
| 1 | 2 | 6 | 8 | 9 | 4 | 7 | 5 | 3 |
| 3 | 9 | 4 | 7 | 6 | 5 | 1 | 2 | 8 |
| 7 | 5 | 8 | 1 | 2 | 3 | 9 | 4 | 6 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### డైలీ సుడోకు -109

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 6 | 8 | 1 | | 3 | | 4 | 2 |
| 4 | | 7 | | | | | | |
| | | 9 | 7 | | | 6 | 8 | |
| 8 | 1 | | | | 2 | | | 7 |
| | | | 9 | 8 | 1 | | | |
| 2 | | | 4 | | | | 6 | 8 |
| | 5 | 2 | | | 9 | 4 | | |
| | | | | | | 8 | | 5 |
| 6 | 8 | | 5 | | 4 | 9 | 2 | 1 |

## కుట్టుయంత్రంతో కళాఖండాలు!

చిత్రకారుల కుంచే నుంచి జాలువారిన అద్భుతమైన చిత్రాల గురించి మాత్రమే మనం విని వుంటాం. కానీ ఓ ఆర్టిస్ట్ కుట్టుమిషన్‌తో ఔరా అనిపించే కళాఖండాలు చేస్తున్నాడు. ఆయన చిత్రాలకు ఎంతటి వారైనా ఫిదా అవ్వాల్సిందే!



పంజాబ్‌లోని పాటియాలాకు చెందిన అరుణ్ కుమార్ బజాజ్ అనే యువకుడు అందమైన చిత్రాలు కుడుతున్నాడు. కుట్టుమిషన్‌తో వేసిన చిత్రాలంటే ఎవరూ నమ్మేవారు కాదు. కుంచెతో వేసిన కళాఖండాలని చెబితే అందరూ మొదట్లో అతని మాటలను కొట్టిపారేసేవాళ్లు. కృష్ణుడు, ఏసుక్రీస్తు, గురుగోవింద్ సింగ్, భగత్ సింగ్, మదర్‌థెరిసా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీల చిత్రాలు రూపొందించాడు. అరుణ్ బజాజ్ 28 వేల మీటర్ల దారాన్ని ఉపయోగించి పొడవు 6అడుగులు, వెడల్పు 4 అడుగుల శ్రీకృష్ణుడి చిత్రాన్ని తయారు చేశాడు. దీనిని రూపొందించడానికి మూడేండ్లు పట్టింది. ఈ చిత్రానికి ఇండియా బుక్ ఆఫ్‌రికార్డ్స్‌తోపాటు వరల్డ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 'బజాజ్ ఆర్ట్స్' పేరుతో దగ్గర రూ. 15,000 నుంచి రూ. కోటి ధర పలికే కళాఖండాలున్నాయి. రెండు వేల మంది ప్రముఖుల చిత్రాలను రూపొందించాడు. అరుణ్ చిన్నప్పటి నుంచి వినూత్నంగా ఆలోచిస్తుండేవాడు. ఆ ఆలోచనలే ఆయనకు మంచి గుర్తింపును తెచ్చాయి. అతని తండ్రి కూడా టైలర్‌గా పని చేసేవాడు. అదే వృత్తిని బజాజ్ కొనసాగిస్తున్నాడు. అరుణ్ ఇటీవల నరేంద్ర మోదీ చిత్రాన్ని రూపొందించి ఆయనకు బహుమతిగా అందించాడు. ఆ చిత్రాన్ని చూసి ప్రధాని అతనిపై ప్రశంసల జల్లు కురిపించారు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఎన్‌ఆర్‌సీబీ

**తిరుచిరాపల్లిలోని ఐసీఏఆర్-నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్‌ఆర్‌సీబీ)లో యంగ్ ప్రొఫెషనల్, అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్– 4 పోస్టులు
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణత.
- **పోస్టు:** ప్రాజెక్టు అసిస్టెంట్
- **అర్హత:** ఎమ్మెస్సీ (బయోకెమిస్ట్రీ/బయోటెక్నాలజీ) ప్రథమశ్రేణి ఉత్తీర్ణత.
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 3
- **పోస్టు:** యంగ్ ప్రొఫెషనల్ –2 ఖాళీలు
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టులలో బీఎస్సీ/ఎమ్మెస్సీ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- ఈ పోస్టులకు ఆగస్టు 2న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** http://nrcb.res.in

## ఆర్మీలో 'ఇంజినీరింగ్' కొలువులు

**భారత ఆర్మీలో షార్ట్ సర్వీస్ కమిషన్ (టెక్) ఏప్రిల్ 2020 కోర్సులో ప్రవేశానికి ఇంజినీరింగ్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



**టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు ఎస్ఎస్‌సీ (టెక్) ద్వారా ఇంజినీరింగ్ అభ్యర్థులకు షార్ట్ సర్వీస్ కమిషన్ కింద ఉద్యోగావకాశాన్ని కల్పిస్తారు.**

- మొత్తం ఖాళీలు: 189
- **బ్రాంచీల వారీగా ఖాళీలు– అర్హతలు:** సివిల్–50, మెకానికల్–16. ఎలక్ట్రానిక్స్& టెలికామ్ లేదా టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ లేదా శాటిలైట్ కమ్యూనికేషన్–25. ఏరోనాటికల్/బాలిస్టిక్స్/ఏవియానిక్స్–12. ఎలక్ట్రానిక్స్/ఆప్టో ఎలక్ట్రానిక్స్/ఫైబర్ ఆప్టిక్స్/ మైక్రో ఎలక్ట్రానిక్స్&మైక్రోవేవ్–8, ప్రొడక్షన్ ఇంజినీరింగ్–3. ఆర్కిటెక్చర్/బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ–4. ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్&ఎలక్ట్రానిక్స్–24. కంప్యూటర్ సైన్స్& ఇంజినీరింగ్/కంప్యూటర్ టెక్నాలజీ/ఐటీ/ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్)–47.
- **అర్హతలు:** సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత లేదా ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 2020, ఏప్రిల్ 1 నాటికి ఇంజినీరింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. శిక్షణ ప్రారంభమైన 12 వారాల్లోగా సర్టిఫికెట్‌ను సమర్పించాలి.
- **వయస్సు:** ఎస్ఎస్‌టీ (టెక్)–54 మెన్, ఎస్ఎస్‌సీ డబ్ల్యూ (టెక్)–25 ఉమెన్ కోర్సులకు 2020, ఏప్రిల్ 1 నాటికి 20–27 ఏండ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. అంటే 1993, ఏప్రిల్ 2 నుంచి 2000, ఏప్రిల్ 1 మధ్య జన్మించి ఉండాలి. అభ్యర్థులు అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- **ఎంపిక విధానం:** రెండు దశల్లో చేస్తారు.
- మొదటి దశలో మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు.



- రెండో దశలో వీరికి సర్వీస్ సెలెక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.
- ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలను అలహాబాద్(ఉత్తరప్రదేశ్), భోపాల్ (మధ్యప్రదేశ్), బెంగళూరు (కర్ణాటక), కపుర్తలా (పంజాబ్)లో నిర్వహిస్తారు.
- ఎంపికైన వారికి 49 వారాలు చెన్నైలోని ఆఫీసర్స్ ట్రెయినిగ్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. అనంతరం లెఫ్టినెంట్ హోదాలో ఉద్యోగం ఇస్తారు.
- **పేస్కేల్:** శిక్షణ సమయంలో నెలకు రూ.56,100/– ఇస్తారు. అనంతరం లెవల్ పే 10 ప్రకారం రూ.56,100–1,77,500/–
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

## ఎన్‌ఎండీఎఫ్‌సీలో

**ఢిల్లీలోని నేషనల్ మైనార్టీ డెవలప్‌మెంట్& ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీఎఫ్‌సీ)లో అసిస్టెంట్, మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్ (జనరల్ స్ట్రీం)
- **ఖాళీలు:** 1
- **అర్హత :** ఏదైనా పీజీ లేదా బీఈ/బీటెక్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. 28 ఏండ్లు మించరాదు.
- **పోస్టు:** అసిస్టెంట్ మేనేజర్ (అకౌంట్స్&ఫైనాన్స్)
- **ఖాళీలు:** 2
పై రెండు పోస్టులకు
- **పేస్కేల్:** రూ.30,000–1,20,000/–
- **అర్హతలు:** సీఏ/ఐసీడబ్ల్యూఏ లేదా ఎంబీఏ (ఫైనాన్స్) లేదా ఎంకాం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత. వయస్సు 28 ఏండ్లు మించరాదు.
- **పోస్టు:** ఆఫీస్ అసిస్టెంట్
- ఖాళీలు –6
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత. 25 ఏండ్లు మించరాదు.
- **పేస్కేల్:** రూ.25,000–95,000/–
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** http://www.nmdfc.org

## ఎన్‌బీఆర్‌సీలో

**నేషనల్ బ్రెయిన్ రిసెర్చ్ సెంటర్ (ఎన్‌బీఆర్‌సీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్–1
- **అర్హత:** ఎంబీబీఎస్‌తో పాటు ఎంఎస్/ఎండీ లేదా ఎండీ/బీడీఎస్
- నర్సింగ్ ఆర్డర్లీ (ప్రాజెక్టు) –2
- **అర్హతలు:** పదోతరగతి ఉత్తీర్ణత
- టెక్నీషియన్ –2
- **అర్హతలు:** ఎమ్మెస్సీ (ఫిజిక్స్)/బీటెక్/బీఈ (ఇన్‌స్ట్రుమెంటేషన్) లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి.
- ల్యాబ్ అటెండెంట్–1, టెక్నాలజిస్ట్ (ఎంఈజీ)–1 పోస్టు ఖాళీగా ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 13
- ఇంటర్వ్యూలను గుర్‌గావ్‌లోని ఎన్‌బీఆర్‌సీ కార్యాలయంలో నిర్వహిస్తారు.
- **వెబ్‌సైట్:** https://www.aiims.edu చూడవచ్చు.

నమస్తే తెలంగాణ
రైతుబడి
[ కరీంనగర్ ]
గురువారం 1 ఆగస్టు 2019
raithubadi@ntnews.com





# బెండలో విత్తనోత్పత్తి

ఏడాది అంతా వినియోగదారుల నుంచి మంచి డిమాండు ఉన్న కాయగూర పంట బెండ. దీనిలో ఔషధ గుణాలతో పాటు మనిషికి అవసరమైన పోషకాలను ఉంటాయి. అందుకే ఈ పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతున్నది. ఈ పంట విత్తనానికి ఉన్న డిమాండు దృష్ట్యా మార్కెట్‌లో కల్తీ విత్తనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పంటలో రైతులు నేరుగా తమ స్థాయిలోనే నాణ్యమైన విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అందుకు కొన్ని కిటుకులు పాటించాలి.

బెండ ఉష్ణమండల పంట. ఎండాకాలం బాగా వస్తున్నప్పటికీ, వెచ్చని తేమతో కూడిన వానకాలంలోనూ పంట వస్తుంది. అయితే రాత్రిపూట చల్లని వాతావరణం ఉంటే మేలు. ఈ పంట మంచును తట్టుకోలేదు. 26-30 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో మొలకెత్తుతుంది. 16 డిగ్రీల కంటే ఉష్ణోగ్రత తగ్గితే విత్తనం మొలకెత్తదు. ఎండాకాలంలో సాధారణంగా విత్తన నాణ్యత బాగుంటుంది. అయితే విత్తన పరిమాణం తక్కువగా ఉంటుంది. కాబట్టి ఈ పంటను విత్తుకునే సమయంలో వానలు, ఈ పంట పూత దశ ఏకకాలంలో రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒకవేళ కాయ పక్వానికి వచ్చే దశ, ఎండ బెట్టే దశలో ముందస్తు వానలు పడితే నాణ్యత దెబ్బ తినే అవకాశం ఉంటుంది.

### ఎంచుకోవాల్సిన రకాలు

శంఖు రోగాన్ని తట్టుకునే సూటి రకాలను ఎంచుకొని విత్తనోత్పత్తి చేపట్టాలి. పూసా సవాని, పంజాబ్ పద్మిణి, పర్భణి క్రాంతి వంటి రకాలు విత్తనోత్పత్తికి మంచివి.



### పువ్వుల లక్షణాలు, సంపర్క లక్షణాలు

రకాన్ని బట్టి 4 నుంచి 8వ ఆకు, కాండం మధ్య నుంచి పూత మొదలవుతుంది. మొగ్గ నుంచి పూర్తి పువ్వుగా మారేందుకు 22-26 రోజులు పడుతుం ది. పొద్దుగాల 8-10 గంటల మధ్య పుష్పాలు విచ్చుకుంటాయి. పూత తర్వాత 15-20 నిమిషాల తర్వాత పుప్పొడి రేణువులు విడుదల అవుతాయి. పూత తక్కువ కాలమే విచ్చుకుని ఉంటుంది. పగటిపూట వరకు పూలు ముడుచుకుంటాయి. కీటకాల వల్ల వివిధ రకాలలో 4 నుంచి 19 శాతం వరకు పరపరాగ సంపర్కం జరుగుతుంది. అందుకే బెండను తరచూ పరపరాగ సంపర్కం చెందే పంటగా వర్గీకరిస్తారు.

### వేర్పాటు దూరం

ఇది తరచుగా పరపరాగ సంపర్కం చెందే పంట. కాబట్టి ఫౌండేషన్ విత్తనోత్పత్తికి 500 మీటర్లు, ధృవీకరణ విత్తనోత్పత్తికి 250 మీటర్ల వేర్పాటు దూరం పాటించాలి.

### నేలలు

మురుగు నీళ్లు పోయే సౌలతి, సారవంతమైన కర్బన శాతం ఎక్కువగా ఉన్న ఇసుక నేలల నుంచి ఒండ్రు మట్టి నేలల వరకు ఈ పంట సాగు చేయడానికి అనుకూలం. కొంతమేరకు పాక్షికంగా ఆమ్లత్వాన్ని తట్టుకుంటుంది. నేలలో ఉదజని సూచిక 6 నుంచి 7 ఉంటే మంచిది.

**విత్తే సమయం:** వానకాలం పంటను ఆగస్టు మొదటివారం వరకు, ఎండకాలం పంటను ఫిబ్రవరి-మార్చి మధ్యలో విత్తుకోవాలి.

**విత్తన మోతాదు:** హెక్టారుకు 8-10 కిలోలు అవసరం.

**నాటడం:** నేల, నీటి వసతులను బట్టి సాధారణ మడులలోగానీ, బోదెలలో గాని విత్తనం నాటుకోవాలి. వరుసల మధ్య 60 సెం.మీ. వరుసల్లోని మొక్కల మధ్య 30 సెం.మీ. దూరంలో ఉండేలా చూసుకోవాలి. రాత్రంతా విత్తనం నానబెట్టి ఒక పొదకు రెండు విత్తనాల చొప్పున నాటాలి. నేలలో తగినంత తేమ ఉండేలా చూసుకోవాలి. 12-15 సెం.మీ. ఎత్తు పెరిగిన తర్వాత ఆరోగ్యవంతమైన ఒక మొక్కను ఉంచి రెండో మొక్కను తీసివేయాలి.

**ఎరువులు:** నేల తయారీ సమయంలో బాగా చివికిన పశువుల ఎరువును హెక్టారుకు 30 టన్నులు వేయాలి. అలాగే హెక్టారుకు 100 కిలోల నత్రజని, 50 కిలోల చొప్పున భాస్వరం, పొటాష్ లనిచ్చే ఎరువులను అందించాలి. సగం నత్రజని, మొత్తం భాస్వరం, పొటాష్‌లను విత్తనం నాటేందుకు ముందే నేలలో కలిపి వేయాలి. 30-35 రోజుల తర్వా త మిగతా సగం నత్రజనిని పంట కు అందించాలి. వానకాలం ఎక్కువ వానలు ఉంటే నిల్వ ఉన్న నీటిని తీసివేయా లి. కాయ ఏర్పడే దశ, గింజలు అభివృద్ధి చెందే దశ ల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. కలుపు లేకుండా చూసుకోవాలి. ఎండాకాలంలో పగటిపూట ఎట్టి పరిస్థితుల్లోనూ కలుపు మందులను పిచికారీ చేయవద్దు.

### కల్తీల ఏరివేత

కనీసం మూడు క్షేత్ర తనిఖీలు చేపట్టాలి. శాఖీయ దశలో మొదటిసారి, పూత, పిందె దశలో రెండోసారి, కాయ పక్వానికి వచ్చే దశలో మూడోసారి తనిఖీలు చేయాలి. కల్తీలలో ముఖ్యంగా శంకు రోగం సోకిన మొక్కలను గుర్తించిన వెంటనే వేరు చేసి పీకి కాల్చివేయాలి. ప్రమాణాల ప్రకారం 6,7 కణుపుల తర్వాత వచ్చే కాయలు కల్తీవని గుర్తించి ఏరివేయాలి. అలాగే అటవీ బెండ రకాలు 5-6 శాతం కంటే ఎక్కువగా ఉన్న కాయలు కల్తీవిగానే పరిగణించాలి.

### కోత, విత్తనాల సేకరణ

విత్తనాల సేకరణకు పూర్తిగా ముదిరి, ఎండిన కాయలను కోసి భద్రపరుచాలి. వానలు లేని సమయంలో మొత్తం కాయలను సేకరించవచ్చు. వానలు ఉంటే రెండు, మూడు దఫాలుగా సేకరించాలి. కొన్నిరోజులు మాగిన తర్వాత పగలగొట్టి విత్తనాలు సేకరించాలి. ఆ తర్వాత 8-9 శాతం వరకు తేమ వచ్చేలా నీడలో ఎండబెట్టాలి. ఆ తర్వాత శుభ్రపరిచి పురుగు ఆశించిన, రంగు మారిన, తాలు విత్తనాలను వేరు చేసి తీసివేయాలి.

### విత్తన దిగుబడి

హెక్టారుకు 10-15 క్వింటాళ్లు.
నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం కల్తీలు గరిష్ఠంగా 0.2 శాతం, శంఖు రోగం సోకిన మొక్కలు 1 శాతం లోపే ఉండాలి.

### విత్తన ప్రమాణాలు

భౌతిక స్వచ్ఛత (కనీసం): 99 శాతం
వ్యర్థాలు (గరిష్ఠం): 1 శాతం
ఇతర పంటల విత్తనాలు (గరిష్ఠం): 0.05 శాతం
మొలక శాతం (కనీసం) : 65 శాతం
తేమ శాతం (గరిష్ఠం): 10 శాతం
తేమ కోల్పోని సంచులలో : 8 శాతం

డాక్టర్
పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త,
రాష్ట్ర ఉద్యాన
విశ్వవిద్యాలయం
7780509322



# మెట్ట పద్ధతి మేలు

రైతులు వరిని సాధారణ పద్ధతిలో సాగు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. అయితే ఇందుకు భిన్నంగా ఖమ్మం జిల్లా రైతులు ఆలోచన చేశారు. ప్రతికూల పరిస్థితులలోనూ వరిసాగు చేయవచ్చని గత ఏడాది వానకాలం, యాసంగిలో నిరూపించారు. ఇది తేలిక పద్ధతి. ఖర్చు కూడా తగ్గుతుంది. దీంతో కొందరు రైతులు మెట్ట పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. రైతుల నుంచి వస్తున్న ఆదరణతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు ఈసాగుపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.



మెట్ట, మాగాణి వరిసాగు విషయానికి వస్తే తొలకరి వర్షాలకు కల్టివేటర్ సహాయంతో 2-3సార్లు దుక్కి దున్నుకోవాలి. ఈ పద్ధతి ద్వారా సాగు చేస్తే ఎకరానికి 14-16 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయి. విత్తనాలను 30 సెంటీమీటర్ల దూరంలో నాగటి సాలు వెనుక గాని, గొర్రుతో గాని సీడ్ డ్రిల్‌తో గాని లేదా నేరుగా వెదజల్లడంగానీ ఏదైనా పద్ధతిలో వేయవచ్చు. విత్తనాన్ని చల్లిన తరువాత పొలమంతా రోటోవేటర్‌తో చేయాలి. ఈ పద్ధతిలో కలుపు సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి విత్తనం వెంటనే నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పెండిమిథాలిన్ 1 లీ. మందును ఎకరానికి భూమిపైన పిచికారీ చేయాలి. వరిని విత్తిన ఆగస్టులో పడే వర్షాలకు వరి పెరుగుతుంది. ఈ వర్షాలకు నీటి వనరులు పెరుగుతాయి. ఈ సమయంలో మెట్ట వరిని మాగాణిగా మార్చుకోవచ్చు.

### యాజమాన్యం

సాధారణ పద్ధతిలో వరి పంటకు సిఫార్సు చేసిన నత్రజని దమ్ములో మూడవ వంతు వేస్తారు. కానీ ఈ పద్ధతి ద్వారా నత్రజని ఎరువులు విత్తిన 20రోజుల తరువాత కలుపు నివారణ చేపట్టిన తరువాత వేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 24 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్ ఎరువులను వేసి కలియదున్నాలి. నత్రజని ఎరువును మూడు దఫాలుగా విత్తిన 15 రోజులకు పిలక దశలో ఒకసారి అంకురం దశలో మరోసారి వేసుకోవాలి. సాధారణ వరి కంటే సుమారుగా 25 శాతం అధికంగా వేయాలి. మిగిలిన సగభాగం పొటాష్ ఎరువులను (8 కిలోలు) నత్రజని ఎరువుతో పాటు అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. ఈ సాగు పద్ధతిలో ఇనుపధాతు లోపం అధికంగా ఉంటుంది. దీని నివారణకు లీటరు నీటికి 3-5 గ్రా. అన్నభేదిని 1 గ్రాము నిమ్మ ఉప్పుతో కలిపి పిచికారీ చేయాలి. సాధారణ నాటు వేసే పద్ధతితో పోలిస్తే నారు పెంపకం, నారు పీకడం, నాటు ఉండవు. కాబట్టి పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. కూలీల కొరత ఉండదు. నాటు వేసే పద్ధతితో సమానంగా దిగుబడులు సాధించవచ్చు.

– మద్దెల లక్ష్మణ్, 9010723131
ఖమ్మం వ్యవసాయం





### రైతుల నుంచి మంచి ఆదరణ

మెట్ట పద్ధతిలో వరి సాగు చేసేందుకు రైతుల నుంచి మంచి ఆదరణ వస్తున్నది. గత కొన్నేండ్లుగా జిల్లాలో పలువురు రైతులు సాగు చేస్తున్నారు. అయితే గత ఏడాది నుంచి ఇంకా కొంతమంది రైతులు కూడా ఇదే విధానంలో సాగు చేస్తున్నారు.

–అత్తోట ఝాన్సీలక్ష్మీకుమారి, ఖమ్మం జిల్లా వ్యవసాయశాఖ అధికారి



### తక్కువ నీటి వనరులతో సాగు

తక్కువ నీటి వనరులతో మెట్ట పద్ధతిలో వరి సాగు చేసుకోవచ్చు. అడపా దడపా వచ్చే చిరుజల్లుల సహాయంతో సాగు చేసుకోవచ్చు. రైతులు ఏ మాత్రం పంట కాలాన్ని కోల్పోరు. సాధారణ పద్ధతితో పోలిస్తే 20-30 శాతం నీటిని ఆదా చేసుకోవచ్చు. అలాగే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. కూలీల కొరతనూ అధిగమించవచ్చు.

–పి. రంజిత,శాస్త్రవేత్త, కృషీ విజ్ఞాన కేంద్రం, 9989617700



### మెట్ట పద్ధతిలో సాగు చేస్తున్నాం

మెట్ట పద్ధతిలో వరిసాగు చేయటం వల్ల మొదట కురిసే చిరుజల్లులు వరి విత్తనాలు మొలకెత్తుతాయి. తర్వాత కురిసే వర్షాలకు (ఆగస్టులో) చెరువులలో నీరు పంట పొలాలకు విడుదలవుతాయి. దీనివల్ల మాగాణి వరిగా మారుస్తాయి. దీంతో రెండు నెలల పంట కాలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాం.

–రాంమోహన్‌రెడ్డి, రైతు, మర్లపాడు-వేంసూర్ మండలం, 9963677458

# ఇంటిపంటల వాకిటిలో ఉషోదయం

మట్టిని తనివితీరా ముద్దాడినపుడు
మొక్కను గాఢంగా హత్తుకున్నప్పుడు
ఒక మేఘం చినుకవుతుంది మెల్లిగా..
ఒక స్వప్నం చిగురిస్తుంది పచ్చగా..
ఒక గానం వినిపిస్తుంది తోడుగా..
కొత్త లోకం విస్తరిస్తుంది గుండె నిండుగా..
నిజంగా..నిండుగా, పచ్చగా..వెచ్చగా..
అదే ప్రేమతో,అంతే పిచ్చితో
ఆమె చేసిన శ్రమ, సృజన కలిగలిసి
పట్టణానికి పల్లె పరిమళాన్ని అద్దింది
మిద్దె నుదుట ఆకుపచ్చ తిలకం దిద్దింది.




పేరు ఉషారాణి..
మిద్దెతోటల ప్రపంచంలో ప్రసరిస్తున్న తొలి కిరణాల హరిత ఉషస్సు. ఊరు భాగ్యనగరం. వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌గా ఉద్యోగం. ప్రస్తుతం రాజేంద్రనగర్ ఫార్మర్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎ.డి.ఎగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రైతులతో కలిసి పనిచేస్తుండటంతో వాళ్లు కూరగాయల సాగులో ఎక్కువ మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడటం చూసి ఆందోళన చెందారు. మనం కొంటున్న, తింటున్న ఆహారం ఇంత ప్రమాదకరమా అని ఆలోచించారు.

అదే సమయంలో యూట్యూబ్‌లో తుమ్మేటి రఘోత్తమరెడ్డి వీడియోలు చూసి తన ఇంటిపై మిద్దెతోటకు అంకురార్పణ చేశారు. ఇందుకు భర్త యలమంద ప్రోత్సాహం కూడా తోడైంది. మిద్దెతోటను ప్రారంభించినపుడు మొదట హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ సబ్సిడీకి ఇచ్చే కిట్ తెచ్చుకున్నారు. తరువాత దశలో ప్లాస్టిక్ డ్రమ్ములు అడ్డంగా కత్తిరించి కంటెయినర్స్‌గా వాడారు. ఇందులో మొదట ఎర్రమట్టి, కోకోపిట్, వర్మికంపోస్ట్‌ను (1: 1: 1 నిష్పత్తి) పాట్‌మిక్సింగ్‌గా కలిపారు. వర్మికంపోస్ట్‌లో 50శాతం వర్మి,50 శాతం మాగిన పశువుల ఎరువు వాడారు. దీనికితోడు ప్రతి కుండీలో ఒక దోస నీమ్‌కేక్, గుప్పెడు ఎముకల పొడి కలిపారు. వీటితో పాటు ట్రైకోడెర్మావిరిడి (ఎండు తెగులు, నేల నుంచి వేరు కుళ్లు తెగులు, ఇతర తెగుళ్ల నివారణలో ఉపయోగపడుతుంది.), సూడో మొనాస్ (ఎండాకు తెగులు, పాముపొడ తెగులు, నారుకుళ్లు తెగులు నివారణకు) వంటి బయోకంట్రోల్ ఏజంట్స్,అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్,రైజోబియం వంటి బయోఫెర్టిలైజర్స్‌ను ఒక కేజీ పాటింగ్‌మిక్స్‌కు 8 గ్రాముల చొప్పున కలిపారు.

గ్రోబ్యాగ్స్ నింపేటపుడు దాని అడుగున ఒక ఇంచుపైన కోకోపిట్ వేసారు. లేని పక్షంలో కొబ్బరిపీచు కూడా వాడవచ్చని అంటారు. తమ రోజువారీ అవసరాలకు ఉపయోగపడే అన్నిరకాల కూరగాయలతోపాటు, ప్లాస్టిక్ కంటెయినర్స్‌లో (18వ నెంబర్) మూడు రకాల మామిడి, స్వీట్‌లైమ్, వాటర్‌యాపిల్, సపోటా, యాపిల్ బేర్, దానిమ్మ, అంజీర్, పైనాపిల్, ప్యాషన్‌ఫ్రూట్ వంటి పండ్ల మొక్కలు పెంచుతున్నారు. ఉల్లి, నూనెలు తప్ప మరే అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్లనవసరం లేకుండా తన మిద్దెతోటను మల్చుకున్నారు ఉషారాణి. ముఖ్యంగా దొండకు శాశ్వత నిర్మాణం చేసుకున్నారు. ఒక 200లీ. డ్రమ్మును రెండు భాగాలుగా కత్తిరించి అడుగు భాగంలోని టబ్బులో ఎరువు నింపుకుని,దాని చుట్టూ నిలువుగా జి.ఐ వైరుతో ట్రీగార్డ్ వేసుకుంటే దొండ తీగ అల్లుకుంటుంది. మరోవైపు బెస్ట్ అవుటాఫ్ ద వేస్ట్ అనే కాన్సెప్ట్‌తో వాడి పారేసిన వాటర్ బాటిల్స్‌ను ఉపయోగించి వర్టికల్ గార్డెన్ నిర్మించారు. ఇందులో పాలకూర పెంచుతున్నారు. ఇది గార్డెన్‌ను బ్యూటిఫికేషన్‌లో భాగంగా కూడా కనిపిస్తుందంటారు. రెండస్థుల్లో అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు పండిస్తున్న ఉషారాణి నాలుగేళ్ల అనుభవాలు కొత్తగా మిద్దెతోట పెట్టేవారికి ఒక గైడ్‌లాగా దారి చూపిస్తాయి.

ప్రారంభదశలో ఒక సీజన్ ఆకుకూరలు పండిస్తే (8-9 వెరైటీలు) ఒక అనుభవం వస్తుంది. ఆకుకూరలు ఏ కాలంలోనైనా సులువుగా వస్తాయి. కాబట్టి ఎండాకాలంలో ఈ ప్రయత్నం చేయవచ్చు. రెండోదశలో వర్షాకాలాన టమాటా, మిరప, వంకాయ, చెట్టు చిక్కుడు, గోరుచిక్కుడు, బెండ, తీగజాతులు పెంచుకోవచ్చు. చలికాలంలో కారట్, బీట్‌రూట్, ముల్లంగి, క్యాబేజి, కాలిఫ్లవర్ వంటివి పండించుకోవచ్చు. రెండో సంవత్సరంలో నర్సరీ నుంచి అంటు మొక్కలు తెచ్చుకుని (మామిడి, సపోటా, జామ, దానిమ్మ, బొప్పాయి, మునగ) వాటికి తగిన కుండీల్లో నాటుకోవాలి అంటారు ఉషారాణి.

**విత్తన ఎంపిక:** దేశీ విత్తనాలకు ఎక్కువ రోగనిరోధక శక్తి వుంటుంది. అందరికీ దేశవాళీ విత్తనాలు అందుబాటులో ఉండటం లేదు. కాబట్టి ఓపెన్ పాలినేటెడ్, హైబ్రిడ్ ప్రారంభంలో పెట్టుకోవచ్చు. హైబ్రిడ్ విత్తనాలను ఎక్కువ న్యూట్రియంట్ అవసరం వుంటుంది. హైబ్రిడ్ విత్తనం దాదాపు నెలరోజుల్లో కోత పూర్తవుతుంది. దేశీ విత్తనాలు ఎక్కువ కాలం కాస్తాయి. ఐతే దేశీ విత్తనాలు దొరకలేదని ఆగకుండా, ఏ విత్తనం దొరికినా ప్రారంభించవచ్చు.

**విత్తన శుద్ధి:** విత్తడానికి ముందు విత్తనం మీద జిగురు కోసం దానిని బెల్లం పాకంలో ముంచి దానిపై ట్రైకోడెర్మా విరిడి పౌడర్‌ను పూయాలి. లేదా పసుపు బూడిద మిశ్రమం పూయవచ్చు. దీనివల్ల నారు కుళ్లు తెగులు (డాంపింగ్ ఆఫ్ డిసీజ్) రాకుండా ఉంటుంది. 25 రోజుల లోపుమొక్క బలంగా నేలలో కుదురుకుంటుంది. కాబట్టి ఎలాంటి సమస్య తలెత్తదు.

**నారు పోసుకోవడం:** నలుగురు ఉన్న ఇంట్లో ఏ విత్తనమైనా 20 నుంచి 30 విత్తనాలు పెట్టుకోవాలి. అందులో మొత్తం విత్తనాలు మొలకెత్తకపోయినా, ఇతరత్రా కారణాల వల్ల నష్టపోయినా(చీమలు,పక్షుల సమస్య) మిగిలినవి ఎదుగుతాయి. ప్రతి 45 రోజులకు ఒక మూడు వెరైటీ లు (టమాటా, వంగ, మిరప) నారు పోస్తూ ఉండాలి. ప్రతి రెండు నెలలకోసారి బెండ విత్తనాలు పెట్టాలి. తీవ్రమైన ప్రతికాలంలో ఒక నెల ఎండ, చలి, వర్షం ఉంటుంది. ఆ సమయంలో తప్ప మిగతా సమయాల్లో నారు పోసుకోవడం, కొత్త విత్తనాలు పెట్టుకోవచ్చు.

**ఎరువుల తయారీ:** మా మిద్దెతోటకు సంబంధించి అన్నిరకాల ఎరువులను మే చివర నుంచి జూన్ చివరి వరకు తయారుచేసుకుంటాం. జూన్, జూలైలో రైతుల దగ్గరు నుంచి పశువుల ఎరువు తెప్పించుకుని (అర ట్రక్కు),దీనికి గుర్రపు వ్యర్థాల ఎరువు,మేక ఎరువు, కోళ్ల ఎరువు అన్నీ రెండుబ్యాగులు కలుపుతాము. ధాన్యాలు (వడ్లు,గోధుమలు,సజ్జలు అన్ని రకాలు),ఆయిల్ సీడ్స్ (ఆవాలు, నువ్వులు వంటివి), పల్సెస్ (మినుములు, పెసలు, కందులు), అన్నిటినీ ఈ ఎరువుల దిబ్బమీద వేసి మొలకలు వచ్చాక 15-20 రోజుల తరువాత ఎరువులో కలిసిపోయేలా కలిసేలా చేస్తాం. ఇదే ఆర్గానిక్ డి.ఎ.పి. ఇక జీవామృతంలో 5వరోజు బయోఫెర్టిలైజర్స్ కలుపుతాము. 8వరోజు జీవామృతం అప్లై చేయడానికి ముందు 24 గంటల ముందు ట్రైకోడెర్మా విరిడిని కలుపుతాము. ఎందుకంటే ఇది ఎక్కువ గ్రోత్ వుంటుంది. మిగతా బాక్టీరియాను డామినేట్ చేస్తుంది కాబట్టి ఇలా చేస్తాము. వీటితో పాటు అవసరాన్నిబట్టి ఆయిల్‌కేక్స్, బోన్‌మీల్ వంటివి వాడుతున్నాము.

**పాలినేషన్ ప్రాబ్లమ్స్:** కూరగాయల్లో పూసిన ప్రతిదీ కాతకు రాదు. ఇందుకు కారణం పాలినేషన్ జరగకపోవడం. పాలినేషన్ జరగకపోతే కాత నిలవదు, పిందెలు రాలిపోతాయి. ఫలదీకరణ కోసం ఆవ, పొద్దు తిరుగుడు,బంతి లాంటివి పెంచితే తేనెటీగలు, సీతాకొకచిలుకలు రావడం వల్ల పాలినేషన్ ఎక్కువగా జరుగుతుంది. చేతితో కృత్రిమ పాలినేషన్ చేస్తే కొంత ఫలితం ఉంటుంది. సాయంత్రం వేళలో మగపుష్పాన్ని కత్తిరించి, పిందె కనిపించిన ఆడపువ్వు మీద సున్నితంగా అద్దాలి. దీనివల్ల పాలినేషన్ జరిగి మంచి కాత వస్తుంది. మొక్కలు పెంచేవారు మొదట తెలుసుకోవాల్సిందే మిటంటే, పూసిన ప్రతీ పువ్వూ..కాసిన ప్రతీ కాయా చేతికి రాదంటారు ఉషారాణి.

**తెగుళ్ల సమస్యలు:** చిక్కుడును నల్లపేనుబంక ఆశిస్తే బూడిద, పసుపు కలిపి గుడ్డలో మూటకట్టి కొమ్మలకు అద్దితే సులువుగా నియంత్రించవచ్చు.తెల్లనల్లి / పిండినల్లి ఆశించినపుడు 1 లీటర్ నీటిలో గుప్పెడు అన్నం కలిపి 3రోజుల తరువాత దానిని బాగా ఊపి ఆ ద్రావణాన్ని మిల్లీబగ్ ఉన్న దగ్గర పిచికారీ చేస్తే పిండినల్లి గట్టిపడి మరునాటికి రాలిపోతుంది. లోపలి పురుగు చచ్చిపోతుంది. రసం పీల్చే పురుగుల నివారణకు 3జి సొల్యూషన్ (అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి) వాడుతున్నారు. దీనిని తయారుచేసుకోవడానికి 50 గ్రాముల వెల్లుల్లి, అర ఇంచు అల్లం, రెండు పచ్చిమిరపకాయలు సరిపోతాయి. వీటిని మెత్తగా దంచి కొద్ది నీటిలో మరగబె ట్టి చల్లార్చి, ఫిల్టర్ చేసి దీనిని 15 లీటర్ల నీటి బకెట్‌లో కలపాలి. ఇది సాయంత్రం పిచికారీ చేసి,మరుసటి ఉదయం గార్డెన్‌లోకి వెళితే పురుగులన్నీ తెల్లని దుమ్ములా గాలిలోకి లేస్తాయి. ఆకుతినేపురుగులు చిన్నదశలో చనిపోయి చెట్టుకు వేళాడతాయి. మొక్కకు చిన్నదశలో నారు కుళ్లు వచ్చి మెడల దగ్గర కుళ్లిపోయి కిందకు వాలిపోయినపుడు, 1లీటర్ నీటికి 8గ్రాముల ట్రైకోడెర్మావిరిడి కలిపి పోయాలి. లేనిపక్షంలో దాల్చినచెక్క పొడిని మట్టిపై భాగంలో చల్లాలి. నెలకోసారి వేపనూనె ముందు జాగ్రత్తగా పిచికారీ చేయాలి.

నిజానికి గార్డెనింగ్ అనేది చాలా సింపుల్ యాక్టివిటీ. యూట్యూబ్‌లో వీడియోలు చూసి అమ్మో ఇంత పనా అని భయపడవద్దు. ఇవన్నీ చేస్తే తప్ప గార్డెన్ అవదేమో అని కంగారు పడవద్దు. ఎర్రమట్టి, మాగిన పశువుల ఎరువు, వర్మికంపోస్ట్‌ను గుడ్డలో మూట



కట్టి నీటి డ్రమ్ములో వేలాడదీస్తే, ద్రవరూప ఎరువు తయారవుతుం ది. దీనిని వారానికోసారి సులువుగా పిచికారీ చేసుకుంటే వేరే ఎరువులు కూడా అక్కరలేకుండా సరిపోను ఉత్పత్తులు పొందవచ్చు. పైన చెప్పినదంతా కేవలం నా అనుభవం మాత్రమే, అందులో అవసరమైనది తీసుకుంటే సరిపోతుంది అంటారు ఉషారాణి. రోజువారీ అవసరమైన మొక్కలే కాకుండా, ఔషధ మొక్కలు, అలంకరణ మొక్కలతో తన ఇంటిని పొదరింటిలా మల్చుకున్న ఉషారాణి, ప్రతి ఇల్లూ ఒక వ్యవసాయక్షేత్రం కావానేది తన కల అంటారు.

(ఇతర వివరాలకు ఉషారాణిని సంప్రదించవలసిన నెంబర్..8121796299)

–కె.క్రాంతికుమార్‌రెడ్డి,9603214455
నేచర్స్‌వాయిస్,

**'నేను స్టార్ అయిపోవాలి. పెద్ద హిట్ కొట్టాలి. ఇండస్ట్రీని ఏలేయాలి అని ఎప్పుడూ ఆలోచించను. మంచి సినిమా చేయాలి. నా పాత్రకు నూటికి నూరు శాతం న్యాయం చేయాలి. మంచి పేరు తెచ్చుకోవాలి. అదే నా తపన' అన్నారు యువ హీరో కార్తికేయ. 'ఆర్ఎక్స్ 100'తో నటుడిగా గుర్తింపును సొంతం చేసుకున్న ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'గుణ 369'. అర్జున్ జంధ్యాల దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో హీరో కార్తికేయ పాత్రికేయులతో ముచ్చటించారు.**

# డబ్బులు వస్తేనే కిక్కు!



కార్తికేయ

**'గుణ 369'పై నమ్మకంతో వున్నారా?**

ప్రతీ సినిమా కొత్త ప్రయాణమే. గత సినిమా హిట్ అయితే తరువాత చిత్రాన్ని ఎవరూ ఫ్లాప్ చేయరు. అలా అని గత సినిమా ఫ్లాప్ అని తరువాత చిత్రాన్ని హిట్ చేయాలని చూడరు. గత సినిమా తాలూకు ప్రభావం ప్రేక్షకుడు థియేటర్‌కు వచ్చే వరకే వుంటుంది. హీరో రామ్‌కు 'ఇస్మార్ట్ శంకర్'కు ముందు కొంత కాలంగా హిట్ లేదు. పూరి జగన్నాథ్‌కు అంతే. ఒకేసారి ఇద్దరికి బ్లాక్ బస్టర్ వచ్చింది. ఈ సినిమా విషయంలో నాతో పాటు మా నిర్మాతలు కూడా చాలా కాన్ఫిడెంట్‌గా వున్నారు. ఏ సినిమా అయినా నిర్మాతలకు డబ్బులు తెచ్చిపెడితేనే కిక్కుంటుంది.

**గుణ ఎవరు? అతని వెనకున్న కథేంటి?.**

గుణ ఒంగోలులో వుండే ఓ మధ్యతరగతి యువకుడు. బీటెక్ సప్లీలు రాస్తూ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. వీధి చివర ఓ సెల్‌ఫోన్ షాపులో పనిచేసే అమ్మాయిని ఇష్టపడుతుంటాడు. గుణ అంటే అమితంగా ఇష్టపడే తండ్రి. చాలా ఆనందంగా సాగిపోతున్న ఫ్యామిలీ. ఇలాంటి వాతావరణంలో వున్న గుణ ఎందుకు కొత్త దారిని ఎంచుకోవాల్సి వచ్చింది?. మన ఇంట్లో వుండే యువకుడిగా నా పాత్ర సాగుతుంది. మన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు మనం అవసరం వున్నప్పుడు మాత్రమే స్పందిస్తుంటాం. గుణ కూడా అంతే.

**హిప్పీ ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సినిమా విషయంలో జాగ్రత్తలు తీసుకున్నారా?**

'హిప్పీ' చిత్రాన్ని చాలా జాగ్రత్తలు తీసుకునే చేశాం. ఏ సినిమా చేసినా కేర్‌లెస్‌గా చేయం కదా?. నేను 'ఆర్ఎక్స్100'కి ఎంత కష్టపడ్డానో 'హిప్పీ'కి అంతకంటే ఎక్కువే శ్రమించాను. శారీరకంగా చాలా కష్టపడ్డాను. అన్నీ మన చేతుల్లో వుండవు. ఏ పనికైనా మనం మాత్రమే కష్టపడితే సరిపోదు. సినిమాకు నేనొక నటుడిని మాత్రమే. సినిమా అంటే నేను మాత్రమే కనిపిస్తాను కానీ దాని వెనక వంద మంది శ్రమవుంటుంది. అన్నీ బాగా కుదిరితేనే సినిమా బాగా వస్తుంది.

**'గుణ 369' అని పెట్టడానికి ప్రత్యేకమైన కారణం వుందా?**

గుణ అంటే గుణవంతుడు. మంచి వాడు. మన ఇంట్లో వుండే వాడు. గుణ అనే పేరులో ఓ స్వీట్‌నెస్ వుంది. పేరులో ఓ పవర్ వుంది. సినిమాకు ఇదే టైటిల్ అయితే బాగుంటుందని భావించాం. కేవలం గుణ అని పెడితే మళ్లీ కమల్‌హాసన్ సినిమా గుర్తొస్తుందని, దానితో పోలుస్తారని భావించాం. గుణ పేరుకు ఇంకా ఏదైనా జోడిస్తే బాగుంటుంది అనుకున్నాం. సినిమాలో నేను ఖైదీగా కనిపిస్తాను. నా నంబర్ 369. దాన్ని టైటిల్‌కి జత చేస్తే బాగుంటుందని దర్శకుడు చెప్పగానే ఆ పేరుతో నాకు తెలియని పవర్ కనిపించింది.

**ఈ సినిమాకు నేనూ ఓ నిర్మాతను అయితే బాగుండేది అన్నారు. కారణం?**

'గుణ 369' నా మనసుకు దగ్గరైన కథ. ఈ చిత్రానికి నేనూ ఓ నిర్మాతని అయితే నా సినిమా కదా అని మరింతగా ఈ చిత్రంలో లీనమై పనిచేసేవాడిని కదా అనిపించింది. 'ఆర్ఎక్స్ 100' ఇది నా సినిమా అని ఎలా ఫీలయ్యానో 'గుణ 369' చిత్రం విషయంలోనూ అలాగే ఫీలవుతున్నాను.

**గుణ మీ కెరీర్‌కు ఎలాంటి సినిమా అవుతుందని అనుకుంటున్నారు?**

నా నుంచి వచ్చిన చిత్రాలని మరిపించే చిత్రమిది. నా అభిమానులు కాని వారు. నన్ను పట్టించుకోని వాళ్లు కూడా ఈ సినిమా తరువాత నన్ను కొత్తగా చూస్తారు. నన్ను చూసే తీరు కూడా మారుతుంది. గర్వంగా ఫీలవుతారు.

**'నానీస్ గ్యాంగ్ లీడర్' టీజర్‌లో మీ పాత్రని రివీల్ చేయలేదు ఎందుకని?**

అలా రివీల్ చేస్తే కిక్కువుండేది కాదు. అందులో నేను విలన్‌గా నటించాను. అది సినిమాకి ఆసక్తికరమైన అంశం. 'ఆర్ఎక్స్ 100'లో ప్రేక్షకులు నన్నొక పంథాలో చూశారు. గుణలో మరో కోణంలో చూడబోతున్నారు. అయితే 'గ్యాంగ్‌లీడర్'లో నేను పోషించిన పాత్ర ఇంత వరకు చేయలేదు. మళ్లీ చేస్తానో లేదో కూడా తెలియదు. ఇందులో నా పాత్ర విలన్ అంటే విలన్‌లా వుండదు. ఆ పాత్రకు భావోద్వేగాలుంటాయి.

**హీరోగా చేస్తూ తొలి దశలోనే విలన్‌గా నటించడం రిస్క్ అనిపించలేదా?**

ప్రారంభ దశలో వున్నాను కాబట్టే విలన్‌గా నటించగలిగాను. ఇమేజ్ వచ్చాక ఇలాంటి అవకాశం నన్ను వెతుక్కుంటూ వచ్చేది కాదేమో. ఈ సినిమాలో నా పాత్రని చూస్తున్నప్పుడు ప్రేక్షకులు తిట్టుకుంటారేమో గానీ థియేటర్ నుంచి బయటికి వచ్చాక మాత్రం నా గురించి ఖచ్చితంగా మాట్లాడుకుంటారు. 'గుణ 369' కొన్ని వర్గాల వరకు వెళుతుంది. కానీ 'నానీస్ గ్యాంగ్‌లీడర్' మాత్రం అలా కాదు. భారీ స్థాయిలో అన్ని వర్గాలకు చేరుతుంది. నాని, విక్రమ్ కె. కుమార్ లాంటి పెద్ద వాళ్ల సినిమా అయినా నా గురించి మాత్రం ప్రేక్షకులు మాట్లాడుకుంటారనే నమ్మకముంది. నా లాంటి వాడికి ఈ సినిమా మంచి అవకాశం.

**'అర్జున్‌రెడ్డి' తరహాలో మీరు నటించిన 'ఆర్ఎక్స్100' కూడా ఇతర భాషల్లో రీమేక్ అవుతుండటం ఎలా అనిపిస్తోంది?**

తమిళంలో ఆది పినిశెట్టి చేయబోతున్నానని ప్రకటించాడు. కానీ ఇంకా ప్రారంభం కాలేదు. కన్నడంలో ఇప్పటికే చిత్రీకరణ సగం పూర్తయింది. బాలీవుడ్‌లో హీరో సునీల్‌శెట్టి తనయుడు అహన్ శెట్టిని ఈ రీమేక్ ద్వారా హీరోగా పరిచయం చేస్తున్నారు. నా సినిమా ఇతర భాషల్లో రీమేక్ అవుతుంటే గర్వంగా వుంది.

**మీ తదుపరి చిత్రం ఎంత వరకు వచ్చింది?**

యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది. టైటిల్ ఇంకా ఖరారు చేయలేదు. శేఖర్ విఖ్యాత్ దర్శకుడు.




రమేష్‌వర్మ, తలసాని సాయికిరణ్, అనుపమ పరమేశ్వరన్, బెల్లంకొండ శ్రీనివాస్, కోనేరు సత్యనారాయణ, అభిషేక్ నామా

# కొత్త ప్రయాణం మొదలుపెట్టాను!

'నేను ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఐదేళ్లు అవుతోంది. ఈ ప్రయాణంలో చిన్న చిన్న తప్పులు చేశాను. హీరోగా ఈ సినిమాతో నా ప్రయాణాన్ని కొత్తగా మొదలుపెట్టబోతున్నాను. 'రాక్షసుడు' చిత్రాన్ని నా తొలి సినిమాగా భావిస్తున్నాను. ఇకపై నటుడిగా ఫెయిల్‌కాకుండా ఉండటానికి ప్రయత్నిస్తాను. మంచి సినిమాలు మాత్రమే చేస్తాను' అని అన్నారు బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాక్షసుడు'. రమేష్‌వర్మ దర్శకత్వం వహించారు. కోనేరు సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. ఈ నెల 2న విడుదలకానుంది. మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ట్రైలర్‌ను నారాయణ్‌దాస్ నారంగ్ విడుదలచేశారు. తొలి టికెట్‌ను తలసాని సాయికిరణ్ స్వీకరించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 'వ్యక్తిగతంగా నాకు ఇష్టమైన కథ ఇది. అరుదుగా ఇలాంటి మంచి కథలు దొరుకుతాయి. నన్ను నమ్మి ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన నిర్మాత కోనేరు సత్యనారాయణకు రుణపడి ఉంటాను. నా ద్వారా ఈ నిర్మాణ సంస్థ ప్రారంభమవుతుండటం గర్వంగా ఉంది. నేనూ నిర్మాత కుటుంబం నుంచే వచ్చాను. అందుకే ప్రొడ్యూసర్స్‌ను గౌరవిస్తాను. రమేష్‌వర్మ ఎంతో కష్టపడి, ఇష్టపడి ఈ సినిమా చేశారు. కంటెంట్ ఈ సినిమాకు అసలైన హీరో' అని తెలిపారు. అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'తమిళ మాతృకలో అమలాపాల్ అద్భుతమైన నటనను కనబరి చింది. ఆమె స్థాయిలో నేను నటించగలనో లేదో అని తొలుత భయపడ్డాను. రమేష్‌వర్మ నన్ను నమ్మి కథానాయికగా అవకాశం ఇచ్చారు. ఈ పాత్రకు నా శైలిలో న్యాయం చేశానని నమ్ముతున్నాను' అని తెలిపింది. అందరూ మనసుపెట్టి పనిచేసిన సినిమా ఇదని దర్శకుడు రమేష్‌వర్మ పేర్కొన్నారు. 'ఇలాంటి కథతో దక్షిణాదిలో గత నాలుగైదేళ్లుగా సినిమాలు రాలేదు. ప్రతినాయకుడి ప్రధానంగా సాగే కథ కావడంతోనే 'రాక్షసుడు' అనే టైటిల్ పెట్టాం. తమిళంలో మాదిరిగానే తెలుగులో విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత కోనేరు సత్యనారాయణ పేర్కొన్నారు. హీరోగా సాయి శ్రీనివాస్‌ను మరో మెట్టు ఎక్కించే సినిమా ఇదని బెల్లంకొండ సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అభిషేక్‌నామా, అనిల్‌రావిపూడి తదితరులు పాల్గొన్నారు.

# నేను క్షేమం!



పోసాని కృష్ణమురళి

'సోషల్ మీడియాలో విఫలమైపోయిన ఆపరేషన్.. విషమ పరిస్థితుల్లో పోసాని కృష్ణ మురళి అంటూ ప్రచారం మొదలైంది. ఇలాంటి వార్తలు విని నా భార్య ఏడ్చింది. ఈ ప్రచారం వల్ల సినిమా పరిశ్రమలో పోసానికి సీరియస్‌గా వుందట అని వేషం ఇచ్చేవాడు కూడా ఇవ్వడు. పబ్లిక్‌లో కూడా ఓ టాక్ మొదలైంది. పోసానికి సీరియస్‌గా వుందంట.. ఇక బతకడమే కష్టమంట కదా అన్న మాటలు నేను కూడా విన్నాను. నా శ్రేయోభిలాషులతో పాటుయావత్ ప్రజానికానికి నా విజ్ఞప్తి నేను బాగానే వున్నాను. ఆరోగ్యంగా వున్నాను' అన్నారు పోసాని కృష్ణమురళి. గత కొన్ని నెలలుగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిపై సోషల్ మీడియాలో వదంతులు రావడంతో బుధవారం పోసాని కృష్ణమురళి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మే 13న నా ఆరోగ్యం బాగా లేకపోవడంతో యశోదా ఆసుపత్రిలో చేరాను. హెర్నియా కారణంగా నాకు శస్త్రచికిత్స జరిగింది. దురదృష్టం ఏంటంటే ఆపరేషన్ జరిగిన తరువాత ఇన్‌ఫెక్షన్ సోకింది. దాన్ని డాక్టర్లు కనిపెట్టలేకపోయారు. దాని కారణంగా నాకు రెండు నెలల పాటు జ్వరం వస్తూనే వుంది. వైద్యులు వైద్యం చేస్తున్నా తగ్గలేదు. ఆ సమయంలో నేను చనిపోతానేమో అని భయమేసింది. పది కిలోలు బరువు కూడా తగ్గాను. మళ్లీ యశోదా డాక్టర్లను సంప్రదిస్తే ఏం ఫరవాలేదు జ్వరం తగ్గిపోతుందని ఇంటికి పంపించారు. మళ్లీ జ్వరమొచ్చింది. నాకు అనుమానం రావడంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌గారికి గతంలో వైద్యం చేసిన డాక్టర్ ఎం.వీ.రావుని సంప్రదించాం. ఆయన ఆ సమయంలో లండన్‌లో వున్నారు. నా భార్య ఫోన్ చేసి చెప్పడంతో కంగారుపడి వెంటనే ఇండియా వచ్చారు. నన్ను పరీక్షించి నాకు ఇన్‌ఫెక్షన్ సోకిందని నిర్ధారించారు. ఒళ్లంతా పెట్ స్కాన్ చేసి ఆపరేషన్ చేసిన చోట ఇన్‌ఫెక్షన్ సోకిందని గుర్తించి దాన్ని తొలగించారు. ఎం.వీ.రావు ఇన్‌ఫెక్షన్‌ని కనిపెట్టలేకపోయినా, ఆయన లండన్ నుంచి ఇండియా రాకపోయినా ఈ పాటికి నేను పైకి వెళ్లిపోయేవాడిని' అన్నారు.

# సైబర్ క్రైమ్ నేపథ్యంలో..



నితిన్

'డిజిటల్ మనీ నేపథ్యంలో సైబర్ క్రైమ్ ప్రధానంగా సాగే చిత్రం 'అశ్వమేధం'. యదార్థ సంఘటనల ఆధారంగా రైటర్ జగదీష్‌మెట్లీ కథని రాశారు. గతంలో విశాల్ హీరోగా రూపొందిన 'అభిమన్యుడు' తరహాలో సినిమా వుంటుంది. కథ, కథనాలు కొత్తగా వుంటాయి' అన్నారు నితిన్. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'అశ్వమేధం'. ధృవ కరుణాకర్ హీరోగా నటిస్తున్నారు. ప్రియా నాయర్, ఐశ్వర్య యాదవ్, శుభ మల్హోత్ర, రూపేష్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు హైదరాబాద్‌లో బుధవారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'తెలుగులో నాకిది తొలి సినిమా. మరాఠీలో రెండు చిత్రాలు చేశాను. అందులో ఒకటి మంచి విజయాన్ని సాధించింది. మరో చిత్రం అక్టోబర్‌లో విడుదల కానుంది. ఆ రెండు చిత్రాల్ని ప్రియా నాయర్, ఐశ్వర్య యాదవ్ నిర్మించారు. వారి కోరిక మేరకే తెలుగులో ఈ చిత్రాన్ని రూపొందించాను. హీరో ధృవ ఉడిపి నటుడు. తెలుగులో అతనికీ తొలి సినిమానే. సైబర్ నేరాలని ఓ యువకుడు ఎలా పరిష్కరించాడన్నదే అసలు కథ. సినిమాలో ఆరు పోరాట ఘట్టాలు, రెండు ఛేజింగ్‌లు వుంటాయి. వీటిల్లో హీరో ఎలాంటి డూప్ లుకుండా నటించాడు. దాంతో అతనికి గాయాలయ్యాయి. సంగీతం, పోరాట ఘట్టాలు, కథ, స్క్రీన్‌ప్లే చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయి' అన్నారు.



# నాగశౌర్య యాక్షన్

నాగశౌర్య కథానాయకుడిగా ఐరా క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. రమణతేజ దర్శకుడు. ఉషా ముల్పూరి నిర్మిస్తున్నారు. మెహరీన్ కథానాయికగా నటిస్తున్నది. ప్రస్తుతం యాక్షన్ కొరియోగ్రాఫర్ అన్బుఅరివు సారథ్యంలో నాగశౌర్యపై యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ప్రేమ, యాక్షన్, వినోదం హంగులతో సాగే చిత్రమిది. 'కేజీఎఫ్' చిత్రానికి పోరాటాల్ని సమకూర్చిన అన్బుఅరివు తెలుగులో తొలి సారి ఈ సినిమాకు యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. ఆయన నేతృత్వంలో తెరకెక్కిస్తున్న యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటాయి. మూడు నిమిషాల నిడివి గల సింగిల్‌టేక్ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్నాం. ఈ పోరాట ఘట్టాలు తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి' అని తెలిపారు. ఈ చిత్రానికి 'అశ్వత్థామ' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి.




